అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

శనివారం 10-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 350 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు

- జర్నలిస్ట్ నిఖిల్ వాగ్లేపై పోలీసుల ఎఫ్ఐఆర్
- అద్వానీకి భారతరత్నపై విమర్శల ఫలితం

వివరాలు 11లో..




రూ.570 కోట్లకు పైగా విలువైన ఎలక్టోరల్

బాండ్ల విక్రయం

- ఇదంతా గతనెలలోనే
- 60 శాతం రూ.1 కోటి డినామినేషన్
- ఆర్టీఐ సమాధానంలో వెల్లడి

వివరాలు 11లో..



భారత రత్నాలు

మాజీ ప్రధానులు పివి, చరణ్ సింగ్.. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు అత్యున్నత పౌర పురస్కారం

- తొలి తెలుగు భారత రత్న గ్రహీత పీవీ నరసింహారావు
- బతికున్నప్పుడు ఇచ్చి ఉంటే నాన్న సంతోషించేవారు : సౌమ్య స్వామినాథన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారత మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు సైతం కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. బీజేపీ సీనియర్ నేత ఎల్ కె అద్వానీ, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం ఇటీవలే భారతరత్న పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొత్తం ఐదుగురికి భారతరత్న అవార్డులు ప్రకటించినట్టయింది. సాధారణంగా ఏడాదికి మూడు భారతరత్న అవార్డులు ఇస్తారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం ఐదుగురికి ఈ పురస్కారాన్ని ప్రకటించడం గమనార్హం. చౌదరి చరణ్ సింగ్ 1979 జూలై 28 నుంచి 1980 జనవరి 14 మధ్యకాలంలో, పీవీ నరసింహారావు 1991 జూన్ 21 నుంచి 1996 మే 16 వరకు దేశ ప్రధానమంత్రులుగా సేవలందించారు. చౌదరి చరణ్ సింగ్ ఉప ప్రధాని (1979), కేంద్ర ఆర్థిక (1979), హోం (1977-78), ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి (1970) బాధ్యతలు కూడా నిర్వర్తించారు. పివి నరసింహారావు కేంద్ర హెూం (1986), రక్షణ (1993-96), విదేశీ వ్యవహారాల (1992-94) మంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ...11లో

పీవీకి భారతరత్న ఇవ్వటం పట్ల

రేవంత్, కేసీఆర్ సహా పలువురి హర్షం

11లో..

గ్రూప్-1 వయోపరిమితి

46 ఏండ్లకు పెంపు

త్వరలో నోటిఫికేషన్ | పోలీస్‌శాఖలో 15వేల ఖాళీలు భర్తీ

పలుమార్లు వాయిదా పడిన గ్రూప్-1 పరీక్షలను త్వరలో పగడ్బందీగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వ పదేండ్ల నిర్లక్ష్యం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు కూడా అవకాశం కల్పిస్తూ వయోపరిమితిని 46 ఏండ్లకు పెంచి నోటిఫికేషన్ ఇస్తామని స్పష్టం చేశారు. కచ్చితంగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. తాము జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నాపత్రాలు విక్రయించి ఉద్యోగాలు భర్తీ చేసే వాళ్లం కాదనీ, ప్రభుత్వ శాఖల్లో బంధువులను పెట్టుకొని ఉద్యోగాలు అమ్ముకునే వాళ్లం అంతకంటే కాదని ప్రతిపక్షాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. పోలీసు శాఖలో 15వేల ఉద్యోగ నియామకాలు చేపడతామనీ, 15 రోజుల్లో ఆ నోటిఫికేషన్ వస్తుందని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వైస్‌ఛాన్సలర్ల నియామకం మే నెలలో జరుగుతుందనీ, దానికి సన్నాహకంగా ఇప్పటికే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తమ నిర్ణయాన్ని న్యాయస్థానం కూడా సమర్థించిందన్నారు. కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్దిష్ట విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. శుక్రవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు.

- యూనివర్సిటీ వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీ
- మైనార్టీలకు అన్నింటా ప్రాధాన్యత
- మనింటి అమ్మలాగే తెలంగాణ తల్లి విగ్రహం
- 12న ప్రాజెక్టులపై చర్చ
- 13న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ సందర్శన
- కేసీఆర్ సహా ప్రతిపక్షసభ్యులూ రావాలి : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

" తెలంగాణ ఆడబిడ్డలు పౌరుషానికి ప్రతీకలు. మన ఇండ్లలో అమ్మలాగానే ప్రేమను పంచుతూ, చూపుల్లో కరుణ చూపుతూ, శత్రువులపై చురకత్తులు విసిరే రూపంతో చాకలి ఐలమ్మ లాగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని భావించాం. కానీ రాచరిక పోకడలతో కిరీటాలు, వడ్డాణాలు పెట్టుకున్న వాళ్లని దొరల గడీల్లో మాత్రమే చూశాం" అని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందువల్లే తెలంగాణ తల్లి విగ్రహంలో సమూలు మార్పులు చేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ చిహ్నంలో రాచరిక పోకడలకు ప్రతీకలుగా ఉన్న కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తులు ఉందొద్దని నిర్ణయం తీసుకున్నామనీ, ప్రజలందరి సూచనలు, సలహాలు స్వీకరించి దాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఉద్యమ సమయంలో అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిందనీ, అందువల్లే దాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించామని చెప్పారు. మైనార్టీలకు ప్రభుత్వంలో, చట్టసభల్లో కీలక స్థానాల్లో నియమిస్తున్నామంటూ ముఖ్యమంత్రి కార్యాలయం సహా పలు శాఖల్లో నియమితులైన పలువురు ...2లో

420 హామీలను 420 ఫీట్ల లోతులో పాతిపెట్టారు



- గవర్నర్‌తో ముప్పై అబద్ధాలు..అరవై మోసాలు చెప్పించారు
- ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి : పల్లా

2లో..

లోపలా.. బయటా.. హాట్ హాట్...

- రెండో రోజు హీటెక్కిన ఉభయ సభలు
- ఆరు గ్యారెంటీలపై సర్కారును ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ యత్నం
- సీఎం రేవంత్ సహా మంత్రుల ఎదురుదాడి 3లో..
- అసెంబ్లీ, కౌన్సిల్ నేటికి వాయిదా

'ఓటుకు నోటు' కేసులో

సీఎం రేవంత్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

- విచారణను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పిటిషన్‌పై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' కేసు విచారణను తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాది, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2015లో తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి కోట్లు లంచంగా చూపి... అందులో అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వర్సెస్ రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం వర్సెస్ సండ్ర వెంకట వీరయ్యలతో రెండు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఈ రెండు కేసుల విచారణ తెలంగాణలోని ప్రత్యేక న్యాయమూర్తి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉంది. అయితే హైదరాబాద్ నుంచి ఈ కేసుల విచారణను ...11లో

కరుణించని ఆర్థిక శాఖ

ఉపాధికి నిధుల కోత | 22 శాతం తక్కువ కేటాయింపులు

- పార్లమెంటరీ కమిటీ నివేదికలో వెల్లడి
- వేతన సమీక్షకు ప్యానెల్ పిలుపు



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను ప్రతి బడ్జెట్‌లోనూ చిన్న చూపు చూస్తున్నది. ఈ సారి బడ్జెట్‌లోనూ ఇదే నిర్లక్ష్యపు తీరును ప్రదర్శించింది. ఎంజీఎన్ఆర్ఈజీఏపై ఆర్థిక శాఖ కనికరం చూపలేదు. ఈ పథకం కోసం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కోరిన దానికంటే చాలా తక్కువ నిధులను ఆర్థిక మంత్రిత్వ శాఖ కేటాయించింది. ఇటీవల లోక్‌సభలో సమర్పించిన పార్లమెంటరీ కమిటీ నివేదికలో ఇది వెల్లడైంది.ఎంజీఎన్ఆర్ఈజీఏ ద్వారా గ్రామీణ ఉపాధి, వేతన రేట్లు, దానికి సంబంధించిన ఇతర విషయాలపై అంతర్‌దృష్టి పేరుతో గ్రామీణాభివృద్ధి శాఖ (డీఓఆర్డీ) ప్రారంభంలో రివైజ్డ్ ఎస్టిమేట్ (ఆర్ఈ) దశలో రూ. 1.1 లక్షల కోట్లు కోరినట్టు సమాచారం. అయితే, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కోరిన మొత్తాన్ని కాకుండా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ కేటాయింపులను కేవలం రూ.86,000 కోట్లకు సవరించింది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఎంజీఎన్ఆర్ఈజీఏ కేటాయింపులు రూ. 86,000 కోట్లకు సవరించబడ్డాయి. డీఎంకే సభ్యులు కనిమొళి అధ్యక్షత వహించిన కమిటీ.. ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద హామీ ఇవ్వబడిన పనిదినాల సంఖ్యను 100 నుంచి 150కి పెంచాలనే డిమాండ్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే, వేతన సవరణకూ పార్లమెంటరీ ప్యానెల్ పిలుపునిచ్చింది.

స్వేచ్ఛ ఉంటేనే

ఆత్మగౌరవం

లక్షలాది కార్మికుల జీవితాలపై దెబ్బకొట్టిన జీవో

- ఆటోలు, ఫ్రీ బస్సులకు పంచాయతీ పెట్టొద్దు : సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్ని ఉన్నప్పటికీ..స్వేచ్ఛ ఉంటేనే ఆత్మగౌరవమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి దన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శుక్రవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. లక్షలాది మంది కార్మికుల జీవితాలపై దెబ్బకొట్టే విధంగా ప్రభుత్వం ఒక జీవోను విడుదల చేసిందనీ, దాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ జీవో ప్రకారం.. రూ.17వేల వేతనమున్న ...11లో

"అక్షరానికి మరణం లేదు. పుస్తక పఠనం వ్యక్తిత్వాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది. పుస్తకం ప్రశ్నించే గుణాన్ని నేర్పుతుంది. టాల్‌స్టాయ్ రాసిన చిన్న పుస్తకం గాంధీని మహాత్మగాంధీగా తీర్చిదిద్దింది. 90పేజీల కమ్యూనిష్టు మ్యానిఫెస్టో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నది. ఈ రకంగా సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసే పుస్తకాన్ని బతికించాలి" అని పలువురు వక్తలు సూచించారు.

అక్షరానికి మరణం లేదు

పుస్తక పఠనం జీవితాన్ని మారుస్తుంది | చదువుతో ప్రశ్నించే గుణం అలవడుతుంది



జాతీయ పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య

- నిర్వీర్యమైన గ్రంథాలయాలను పునరుద్ధరించాలి
- 36 జాతీయ పుస్తక ప్రదర్శనలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి(ఎన్‌టీఆర్ స్టేడియం)లో కొలువుదీరిన 36వ జాతీయ పుస్తక ప్రదర్శనను పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం మనిషిని పరిపూర్ణంగా మార్చే గొప్ప సాధనమని అన్నారు. ప్రతి ఒక్కరూ పఠనాన్ని తమ నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపు నిచ్చారు. అక్షరాలను, ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,160	▼	70
22 క్యారెట్లు	57,900	▼	100
కిలో వెండి	76,500	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	117
రిటైల్ (లైవ్)	రూ.	139
స్కిన్‌తో	రూ.	202
స్కిన్‌లెస్	రూ.	229

గ్రూప్-1 వయోపరిమితి
46 ఏండ్లకు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు వివరాలను వెల్లడించారు. ప్రజావాణిలో ధరణి, హౌసింగ్ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయనీ, ఐఏఎస్ అధికారులు అక్కడ దరఖాస్తులు స్వీకరిస్తున్నారనీ, మంత్రులు కూడా ప్రజల్ని కలిసి సమస్యలు తెలుసుకుంటున్నారని వివరించారు. తెలంగాణ అనేది ప్రజల భావోద్వేగమనీ, రాష్ట్రం సిద్ధించిన తొమ్మిదిన్నరేండ్ల తర్వాత విధ్వంసమైన స్వరాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాల్సి వస్తున్నదని అన్నారు.

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్ష నేత రాకపోవడం విచారకరమనీ, 80 వేల పుస్తకాలు చదివిన మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి తన జ్ఞానాన్ని సలహాలు, సూచనల రూపంలో ఇస్తారని ఆశించామన్నారు. ఆయన రాకపోవడం శాసనసభను అవమానించడమేననీ, గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలను సరిచేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక వాహనాలకు 'టీజీ' అనే ఆంగ్ల అక్షరాలు ఉండాలని కేంద్ర ప్రభుత్వం చెబితే, తమపార్టీ అక్షరాలు కనిపించేలా 'టీఎస్' అని పెట్టి నిబంధనలు ఉల్లంఘించారని తెలిపారు. ప్రగతిభవన్, వాస్తుకోసం నూతన సచివాలయంను ఆగమేఘాల మీద నిర్మించుకున్నారనీ, తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వరంగల్ కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాన్ని మాత్రం ఎందుకు పూర్తిచేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రజాగాయకుడు గద్దర్‌ను ప్రగతి భవన్ గేటు బయట రోజంతా ఎండలో నిలబెట్టారని మండిపడ్డారు. ఆయన మరణిస్తే చివరిచూపు చూసేందుకు రాజసౌధం నుంచి కేసీఆర్ బయటకు రాలేదని నిష్ఠూరమాడారు. ప్రజల ఆస్తితో కట్టిన ప్రగతి భవన్‌లోకి ప్రజలను రానివ్వలేదనీ, ఉద్యమకారుల్ని చిన్నచూపు చూశారనీ, ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను కనీసం రెవెన్యూ గ్రామంగా కూడా చేయలేదనీ, తాము అధికారంలోకి వచ్చిన రోజు ఆ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మారుస్తూ జీవోలు ఇచ్చామని వివరించారు. మరో ప్రజాకవి గూడ అంజయ్య చివరికోరికగా అప్పటి సీఎం కేసీఆర్‌ను చూడాలని కోరుకుంటే, ఆయన చనిపోయాక నివాళులు అర్పించేందుకు కూడా మనసురాలేదని విమర్శించారు. నియోజకవర్గ సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిగా తనను కలిసేందుకు వస్తే, వారిని అనుమానించి అవమానిస్తున్నారనీ, ప్రెస్ మీట్లు పెట్టి వారు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. తన వద్దకు వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల్ని బీఆర్ఎస్ అధిష్టానం అనుమానించాల్సిన అవసరం లేదనీ, ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎవరు వచ్చినా తాము ఆహ్వానిస్తామని చెప్పారు. రూ.97,500 కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో 90వేల ఎకరాలకు కూడా నీళ్లు అందలేదన్నది వాస్తవమనీ, కృష్ణా ప్రాజెక్టులను తాము కేంద్రానికి అప్పగించలేదనీ, దీనిపై ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న కేసీఆర్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో అభ్యంతరం చెప్పకుండా, ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ హక్కులను కాపాడేందుకు తాము కొట్లాడుతుంటే కాళ్ల మధ్య కట్టెలు పెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ధర్నాలు చేయాల్సింది నల్లగొండలో కాదనీ, ప్రాజెక్టులు గుంజుకుంటానన్న ప్రధాని నరేంద్రమోడీ ఉండే ఢిల్లీ జంతర్‌మంతర్‌లో చేయాలని సూచించారు. ఈ విషయంలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ అక్కడ ఆమరణ దీక్షలు చేస్తే, పోలీసులు దౌర్జన్యంగా వారిని తరలించకుండా తాము కాపలా ఉంటామనీ, ప్రాణాలు పోవుడో, ప్రాజెక్టులు వచ్చుడో అక్కడే తేల్చుకుందామని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ఈనెల 12న అసెంబ్లీలో పూర్తిస్థాయి చర్చ ఉంటుందనీ, అది పూర్తయ్యాక 13వ తేదీ 119 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలను ప్రభుత్వ ఖర్చుతో మేడిగడ్డకు తీసుకెళ్తామని చెప్పారు. చర్చకు, పర్యటనకు ప్రతిపక్షనేత కేసీఆర్ తప్పకుండా రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కేసీఆర్ ఇంటికి పిలిచి పులుసు తినిపిస్తే, దాన్ని అలుసుగా తీసుకొని సరిగ్గా పోలింగ్ రోజు ఆయన నాగార్జునసాగర్‌ను ఏకే 47 తుపాకులతో ఆక్రమించుకుంటుంటే అప్పటి సీఎం కేసీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరెత్తినప్పుడల్లా కృష్ణా జలాలు ముందుకు తెస్తున్నారనీ, ఈ డ్రామాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఏపీ సీఎంతో రాసుకు పూసుకు తిరిగి, పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఎందుకు చోద్యం చూశారని అడిగారు. ఇంద్రవెల్లి పోరాట యోధులకు నివాళిగా స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామనీ, అమరుల కుటుంబాలను వెతికి వారికి సొంతిండ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షం ప్రజల కోసం పనిచేయాలనీ, కుయుక్తులు పన్నితే ఈ సారి అక్కడ కూడా ఉండకుండా నాంపల్లి దర్గా దగ్గర కూర్చోవాల్సి వస్తుందని వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధమనీ, కేటీఆర్‌ను సీఎం చేయాలని తనని కేసీఆర్ అడిగారని తెలంగాణ పర్యటనలో ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారనీ, మీ పార్టీ అంతర్గత విషయాలకు కూడా మోదీని అనుమతి అడిగారంటే అర్థం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి, తన్నీరు హరీశ్‌రావు పలుమార్లు అడ్డుతగిలారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది.

28న లాసెట్ నోటిఫికేషన్

- మార్చి 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ వీసీ డి రవీందర్, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 28న లాసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని విజయలక్ష్మి తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసేందుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుంతో అదేనెల 25 వరకు సమర్పణకు అవకాశముందని తెలిపారు. జూన్ మూడో తేదీన లాసెట్ రాతపరీక్షలుంటాయని వివరించారు. ఇతర వివరాలకు https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను ఈనెల 28 నుంచి సంప్రదించాలని కోరారు.

'గొల్ల,కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గొల్ల, కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని యాదవ, కురుమ సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు చరణ్ కౌశిక్ యాదవ్, గౌరీ సతీష్ , లోకేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ్యులు మైండ్‌సెట్ మార్చుకోవాలి

- విపక్ష సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు
- ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు : మంత్రి శ్రీధర్‌బాబు
- ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణంపై విష ప్రచారం తగదు : సీతక్క




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు మైండ్‌సెట్ మార్చుకోవాలని మంత్రులు శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్, సీతక్క హితవు పలికారు. సభలో అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని సూచించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టి ప్రసంగించారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై చేసిన విమర్శలు సభలో గందరగోళానికి దారితీసింది. బీఆర్ఎస్ సభ్యులు వివేకానంద స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లగా..ఇది పద్ధతి కాదంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారించారు. వెంటనే అలర్ట్ అయిన జగదీశ్‌రెడ్డి వెంటనే వివేకానందను చేయిపట్టి వెనక్కి తీసుకొచ్చారు.విపక్ష సభ్యుల తీరుపై మంత్రులు శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్, సీతక్క తీవ్రస్థాయిలో స్పందించారు. .బీఆర్ఎస్ సభ్యులు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమల్లో ఉన్నారనీ, వారు మైండ్‌సెట్ మార్చుకోవాలని మంత్రి పొన్నం హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 60 రోజులు సమ్మె చేసినా, ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదనీ, ఇప్పుడు వాళ్లే ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆటోవాలాలపై వేలాది రూపాయల చలాన్లు వేయించింది మీరు కాదా? అని నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసినా పట్టించుకోనివాళ్లు ఇప్పుడు ఆటోకార్మికులపై మాట్లాడటం అంటే వారిని అవమానించడమేనని అన్నారు. ఆటోవాలాలను రెచ్చగొట్టి ఆత్మహత్యలు చేసుకునేలా బీఆర్ఎస్ సభ్యులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఫ్యూడలిస్టులు ఆటోల్లో వచ్చి ఆటోకార్మికులను అవమానిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు పదేండ్లలో ఒక్కసారి కూడా పీఆర్సీ ఇవ్వలేదనీ, ఆర్టీసీ ఆస్తులను అమ్మేశారని విమర్శించారు. ఓ నేత తన బంధువైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రిటైర్డ్ అయిన వ్యక్తిని ఎమ్‌డీగా నాలుగేండ్లు నియమించారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం తమ ప్రభుత్వం ధ్యేయమన్నారు.

గవర్నర్ ప్రసంగంపై మాట్లాడమంటే సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి సంబంధంలేని అంశాలు మాట్లాడుతూ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. 'ఉచిత బస్సు ప్రయాణం 13 అంశాల్లో ప్రధానమైనది. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయంపై బీఆర్ఎస్ సభ్యులు అనుకూలమా? వ్యతిరేకమా? అనేది చెప్పాలి. మ్యానిఫెస్టోలో పెట్టినప్పుడే ఆటోడ్రైవర్ల సంక్షేమం కూడా తమ బాధ్యత అని చెప్పాం. ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని పొందుపర్చాం. రానున్న రోజుల్లో దాన్ని అమలు చేసితీరుతాం. ప్రజలను తప్పుదోవ పట్టించేలోగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడటం తగదు" అని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఆర్టీసీ ఆస్తులను ధ్వంసం చేసిందని సీతక్క విమర్శించారు. 'ఆర్టీసీ భూములను కబ్జాలు చేసివాళ్లు, కార్మికుల ఆత్మహత్యలకు కారణమైన వాళ్లు ఇప్పుడు ఆర్టీసీ గురించి మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లు ఎక్కే ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల ధరలు పెంచింది. ఇవ్వాళ మేం ఆడవాళ్లకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాం. దీన్ని బీఆర్ఎస్ సభ్యులు తట్టుకోలేకపోతున్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పెట్టొద్దా? చెప్పండి? భూములను బీడులుగా పెట్టిన కోటీశ్వర్లకు రైతుబంధు కట్టబెడితే ఏనాడైనా పేదలు రోడ్డెక్కినారా? మీ ఇండ్ల ముందు ధర్నా చేశారా? ఆటో కార్మికులను ముందుపెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారా? మీరెప్పుడు సెంటిమెంట్లతో ఆడుకుంటారు. ఒకరిని ముందు పెడతారు..మీరు వెనుక నుంచి వస్తారు. ఇది బీఆర్ఎస్ సభ్యుల నైజం. గతంలో అగ్గిపుల్లలు దొరక్క డ్రామాలు చేస్తే వేరే పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారు. పేదల మీద పన్నులేసి కోట్ల రూపాయలను పెద్దపెద్ద భూస్వాములకు పంచిపెట్టారు. ఆనాడు ఏ పేదనైనా మాకెందుకు ఇవ్వలేదని రోడ్లు ఎక్కారా? ఆ విధంగా మేం ప్రోత్సహించామా? అరె ఉచిత బస్సు ప్రయాణం వల్ల నెలకు ఆరేడువేలు మిగులుతున్నాయని ఆడబిడ్డలు సంతోషడుతుంటే ఎందుకు తట్టుకోలేకపోతురు? ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తే మీకేంటి ప్రాబ్లమ్? ' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

గుట్టలో 500 మంది పొట్టగొట్టినోళ్లు..ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడుతారా? : విప్ బీర్ల అయిలయ్య

'యాదగిరిగుట్టలో గుట్టపైకి ఆటోలు వెళ్లకుండా నిషేధించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. అక్కడ 500 మంది ఆటోకార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయి. పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారు. యాదాద్రి డెవలప్‌మెంట్ పేరుతో 50 శాతం నిధులను దోచుకున్నారు. వైటీడీఏ పేరు చెప్పి కవిత, జగదీశ్‌రెడ్డి ఆస్తులను పోగేసుకున్నారు. ఇప్పుడు అదే బీఆర్ఎస్ వాళ్ల ఆటోకార్మికుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. యాదగిరి గుట్టలో ఆటోకార్మికులకు మేలు చేసేందుకు ఈ నెల 11 నుంచి గుట్టపైకి ఆటోలకు అనుమతిస్తున్నాం' అని అయిలయ్య తెలిపారు..

420 హామీలను 420 ఫీట్ల లోతులో పాతిపెట్టారు

- గవర్నర్‌తో ముప్పైఅబద్దాలు.. అరవై మోసాలు చెప్పించారు
- ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి : పల్లా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలపై గవర్నర్ ప్రసంగంలో పైపైన తడిమారే తప్ప నిర్దిష్టంగా చెప్పలేదనీ, ప్రభుత్వం గవర్నర్‌తో ముప్పై అబద్దాలు..అరవై మోసాలు చెప్పించిందని శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 420 హామీలను 420 ఫీట్ల లోతులో పాతిపెట్టినట్టు ఉందని ఎద్దేవా చేశారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. హామీలపై రాష్ట్ర సర్కారు అరచేతిలో వైకుంఠం చూపి 60 రోజుల్లో చేతులెత్తేసినట్టు ఉందని విమర్శించారు. వెయ్యిమంది జర్నలిస్టులతో సమావేశం పెట్టి రూ.100 కోట్లు విడుదల చేయడం, అంగన్‌వాడీలతో సమావేశం పెట్టి జీతాలు పెంచడం, అఖిలపక్షం పెట్టి దళితబంధు పథకం తీసుకురావడం, రైతుబంధుకు రూపకల్పన చేయడం, సింగరేణి కార్మికులతో సమావేశమై వారి సమస్యలు పరిష్కరించడం వంటివి చేసింది ప్రగతిభవన్‌లోనే అన్న విషయాన్ని మరవొద్దన్నారు. రోజూ ప్రజాభవన్‌లో గంట కూర్చుంటానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరోజుకే పరిమితమయ్యారనీ, 60 రోజుల్లో 6 నిమిషాలు కూడా వినతులు తీసుకోనప్పుడు అది ప్రజాభవన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. మంత్రులు కూడా వినతులు తీసుకోవడం లేదని విమర్శించారు. వందల కిలోమీటర్ల నుంచి వచ్చే ప్రజల నుంచి వినతులను ఔట్‌సోర్సింగ్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వినతులెన్ని? వాటిలో ఎన్నిటికి పరిష్కారం చూపారు? మిగతావాటి పరిస్థితేంటి? తదితరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరుగ్యారంటీల్లోని 13 అంశాల్లో రెండింటిని మాత్రమే ప్రారంభించారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.20 కోట్లు ఖర్చు చేసి రూ.60 కోట్లు పెట్టి ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి బస్సుల సంఖ్యను, ట్రిప్పులను పెంచలేదని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. రైతుబంధు పథకానికి నిధుల విడుదల డైలీ సీరియల్‌ను తలపిస్తున్నదని ఎద్దేవా చేశారు. ఖరీఫ్‌లోనే రైతుల పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మాటతప్పారనీ, యాసంగిలోనైనా మోసంగి చేయకుండా రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు రుణమాఫీ ఏమైందని నిలదీశారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్ల జీవితాలు ప్రమాదంలో పడ్డాయనీ, 21 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాల్లో ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. క్రోనీ క్యాపిటలిస్టులకు వేల కోట్ల ప్రాజెక్టులు ఇవ్వడం సరిగాదన్నారు. ఒక్క ఆదానీ కంపెనీతో 12వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల తెలంగాణ ఆర్థిక ప్రగతి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదానీతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంఓయూను ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా పల్లా డిమాండ్ చేశారు.

గ్రూప్-4 ఫలితాలు విడుదల

- జనరల్ ర్యాంకింగ్ జాబితా ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ
- 7,26,837 మంది ఎంపిక
- త్వరలో మెరిట్ జాబితా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 రాతపరీక్షలకు సంబంధించిన ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించామని తెలిపారు. గతేడాది జూలై ఒకటిన గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పేపర్-1కు 7,62,872 (80 శాతం) మంది, పేపర్-2కు 7,61,198 (80 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 7,26,837 మందిని జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ఎంపిక చేశామని వివరించారు. త్వరలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. త్వరలోనే మెరిట్ జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఫలితాల కోసం http://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022, డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

పోరాడి విజయం సాధించిన ఆశా వర్కర్లు.

- నిర్దిష్టమైన హామీలు ఇచ్చిన ఆరోగ్యశాఖ కమిషనర్ కర్నన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు నిర్వహించాలని ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా హైదరాబాద్ సెంట్రల్, సౌత్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఆధ్వర్యంలో హైదరాబాద్ కోఠి ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సందర్భంగా ప్రతినిధులు వైద్యారోగ్యశాఖ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కర్నన్ ఆశాలకు పలు హామీలిచ్చినట్టు యూనియన్ నాయకులు తెలిపారు.

డిసెంబర్ ,జనవరి రెండు నెలల పారితోషికాలు వారం రోజుల్లో ఆశాల అకౌంట్లో వేస్తామని తెలియజేశారు. యాక్సిడెంట్ అయినా లేదా సాధారణంగా మరణించినా, ఏ విధంగా మరణించినా రూ.50 లక్షలు ఇన్సూరెన్స్ ఇస్తామని చెప్పారు. దహన సంస్కారాలు మట్టి ఖర్చుల కోసం రూ.50 వేలు ఇస్తామని చెప్పారు. అభయహస్తం, మహాలక్ష్మి, గ్యాస్ సిలిండర్ తదితర సర్వేలు చేయాల్సిన అవసరం లేదనీ, చేయొద్దని చెప్పారు. అవసరమైన రిజిస్టర్స్ ప్రింట్ చేసి సరఫరా చేస్తామని తెలిపారు. రిటైర్మెంట్ వయసు, వయస్సుతో పాటు బెనిఫిట్స్ కూడా ఫైనల్ చేస్తామని హామీ ఇచ్చారు. ఫిక్స్ వేతనం, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో వెయిటేజ్ మార్కులు, జాబ్ చార్ట్ తదితర సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయనున్నట్టు కర్ణన్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కవిత, ఏ.హేమలత, రాష్ట్ర నాయకులు హైదరాబాద్ సౌత్ ఎం.మీనా, కల్పన. రంగారెడ్డి జిల్లా సునీత, లలిత, హైదరాబాద్ సెంట్రల్ యాదమ్మ అనిత మేడ్చల్ ఎం.రేవతి, సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం
పెన్షన్ వర్తింపజేయాలి

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.కృష్ణమూర్తి



నవతెలంగాణ- అంబర్‌పేట

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పెన్షన్‌దారులందరికీ పింఛన్ వర్తింపజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టీఏపీఆర్‌పీఏ) రాష్ట్ర అధ్యక్షులు పి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బర్కత్‌పురాలోని ఈపీఎఫ్ కార్యాలయం ముందు టీఏపీఆర్‌పీఏ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం అసోసేయేషన్ ప్రతినిధులు బర్కత్‌పురా ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఎగ్జెంప్టెడ్, అన్ ఎగ్జెంప్టెడ్ అనే భేదం లేకుండా పెన్షన్‌దారులందరికీ పెన్షన్లు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. కోర్టులపై నమ్మకం కూడా లేకుండా చేస్తున్నారని.. సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ప్రజావాణిలో అంగన్వాడీ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.స్వప్న, జి. శారద, డి.సునీత, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.శోభా, బి.లలిత, బి. నారాయణమ్మ, రమా, వెంకటమ్మ, సమ్మక్క, మాసమ్మ, జ్యోతి, సులోచన, సుకన్య, అంగన్వాడీ హెల్పర్స్ కళ్యాణి, గంగమ్మ, కళాబాయి, సత్యవతి, రాధా, మాణిక్యమ్మ తదితరులు ప్రజావాణి నోడల్ అధికారి దివ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి రెండు నెలల వేతనాలు చెల్లించాలనీ, 24 రోజుల సమ్మె కాలం వేతనాలు, సమ్మె సందర్భంగా ఇచ్చిన ఇతర హామీలు నెరవేర్చాలని వారు కోరారు.

ఉద్యోగాలివ్వండి
ప్రజావాణిలో స్టాఫ్ నర్సుల వినతి

గతంలో స్టాఫ్ నర్సుల నియామకాల సమయంలో ఎంపికైన తమను పక్కన పెట్టారనీ, తమకు న్యాయం చేయాలని పలువురు స్టాఫ్ నర్సులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రజావాణిలో స్టాఫ్ నర్సు అభ్యర్థి పి.శోభా రాణి తదితరులు వినతిపత్రం సమర్పించారు. 2017లో 3,311 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. 2,418 మందిని ఎంపిక చేసి బడ్జెట్ లేదంటూ 893 పోస్టులకు అపాయింట్ మెంట్ లెటర్స్ ఇవ్వలేదని తెలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది తమ పోస్టులను తమకివ్వాలని కోరారు.

రైతు ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-బేల

ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని పాటన్ గ్రామంలో శుక్రవారం అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. పాటన్ గ్రామానికి చెందిన రైతు ఏనుగు లచ్చరెడ్డి(50) తన రెండున్నర ఎకరాల పొలంతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. అయితే ఈ సంవత్సరం పంట దిగుబడి రాకపోవడంతో, అప్పులు ఎలా తీర్చాలోనని ఆందోళనకు గురయ్యాడు. శుక్రవారం పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు రూ.8లక్షల వరకు ప్రయివేట్‌గా అప్పు ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పీవీకి భారతరత్న ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన గిరిజన ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. సేవాలాల్ గొప్ప నాయకుడని, గిరిజన అభివృద్ధికి పాటుబడిన సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా నిర్వహిస్తామన్నారు. వచ్చే జయంతి నాటికి సేవాలాల్ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' రావడం సంతోషంగా ఉందని అన్నారు. పీవీ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీలాంటి గొప్ప వ్యక్తికి అత్యున్నత పురస్కారం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. పీవీని ఏనాడూ కాంగ్రెస్ అగౌరవ పరచలేదన్నారు. రెండు సార్లు ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలొచ్చినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కాదనుకుని పీవీనే ప్రధానిని చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పీవీకి అనేక అవకాశాలు కల్పించిందన్నారు. అసత్యాలు ప్రచారాలు చేసే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణకు మీరేం చేశారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డినుద్దేశించి ప్రశ్నించారు. మోడీకి అద్వానీ నమస్కారం చేస్తే తిరిగి సంస్కారం చూపలేదన్నారు.

మూడ్రోజులపాటు సేవాలాల్ జయంతి ఉత్సవాలు

సేవాలాల్ జయంతి ఉత్సవాలను భంజారా భవన్‌లో 14,15,16 తేదీల్లో నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తోపాటు ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, బాటోత్ రాంచందర్ నాయక్, రాందాస్ నాయక్, మురళి నాయక్ తెలిపారు. గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. లంబాడీ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని సీఎంను కోరామన్నారు. గత ప్రభుత్వం గిరిజనులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేస్తోందన్నారు.

లోపలా.. బయటా.. హాట్ హాట్...

రెండో రోజు హీటెక్కిన ఉభయ సభలు

- ఆరు గ్యారెంటీలపై సర్కారును ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ యత్నం
- సీఎం రేవంత్ సహా మంత్రుల ఎదురుదాడి
- మండలిలో కార్యకలాపాలను అడ్డుకున్న ప్రతిపక్షం
- అసెంబ్లీ, కౌన్సిల్ నేటికి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫిబ్రవరిలోనే రాష్ట్రంలో వాతావరణం హీటెక్కుతోంటే.. అంతకుమించి తెలంగాణ శాసనసభ, మండలిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అసెంబ్లీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల రెండో రోజైన శుక్రవారం ఉభయ సభల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్... అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించింది. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు, అందులోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటోవాలాలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతూ ఆ పార్టీ సభ్యుడు పల్లా రాజేశ్వరరెడ్డి సుదీర్ఘంగా ప్రసంగించారు.



కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఆయన '420' హామీలుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు... పల్లా వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఈ సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు కేపీ వివేకానంద స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లటం వివాదాస్పదమైంది. మరోవైపు గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానమిస్తూ... బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు.

ఆ పార్టీ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఆయన పలుమార్లు సెటైర్లు విసిరారు. కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభలో ప్రతిపాదించగా... అధికార పక్ష సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, బీర్ల ఐలయ్య ఆ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. ప్రధాన ప్రతిపక్ష సభ్యులపై వారు ఈ సందర్భంగా వ్యంగాస్త్రాలు సంధించారు.

మండలిలోనూ...

మరోవైపు శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన నిరసనతో సభ రోజంతా హీటెక్కింది. మండలి సభ్యులనుద్దేశించి సీఎం రేవంత్ గతంలో చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిని శాంతింపజేసేందుకు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ బండ ప్రకాశ్, మంత్రులు జూపల్లి, తుమ్మల, శ్రీధర్‌బాబు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవటంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు. అటు రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాత కూడా కొనసాగిన శాసనసభ కూడా శనివారానికి వాయిదా పడింది. ఈ రకంగా ఉభయ సభలు శుక్రవారం హాట్ హాట్‌గా కొనసాగాయి. వీటికితోడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద... అసెంబ్లీకి వస్తూ ప్రధాన ద్వారం వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగటం చర్చనీయాంశమైంది.



ఆటోల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- ఆటో డ్రైవర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్
- డ్రైవర్లకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన
- ఎమ్మెల్యేలకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం

నవతెలంగాణ- హిమాయత్‌నగర్

రాష్ట్ర వ్యాప్తంగా ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న 6 లక్షల మంది ఆటో డ్రైవర్లకు అసెంబ్లీ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శుక్రవారం హైదర్‌గూడ న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి గన్‌పార్క్ వరకు ఆటోలలో ప్రయాణించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య కొంతసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, మల్లారెడ్డి, కె.పి.వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 21 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన



మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఆ పథకం ద్వారా ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, నెలకు ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులను వెంటనే ఆదుకుని, వారి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ డ్రామాలేంటి?

లోపల సీసీ కెమెరా బిగించిన ఆటోలో కేటీఆర్ ప్రయాణం

ఆటో రాముడూ...

మహిళలకు ఉచిత ప్రయాణం వద్దా?

- బతుకే భారమైన ఆటోవాలాలు... ఆటోలను తగులబెట్టుకుంటారా?
- వారిని రెచ్చగొట్టి రాజకీయ లబ్దిపొందాలనే జూ.ఆర్టిస్టు వేషాలు
- గవర్నర్‌కు ధన్యావాదాలు తెలిపే తీర్మానంలో కేటీఆర్‌పై రేవంత్ ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడాన్ని స్వాగతించని బీఆర్ఎస్ నేతలు...దాంతో ఆటో డ్రైవర్లకు నష్టం జరుగుతోందంటూ డ్రామాలాతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కృష్ణానగర్ జూనియర్ ఆర్టిస్టులా ఆటో రాముడు ఆటోలో తిరుగుతూ నాటకాలడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను తెలుసుకునేందుకు ఆటోలో తిరిగితే పర్వాలేదు...కానీ ఆటో లోపల సీసీ కెమెరా బిగించి, మరి ప్రయాణించారని మాజీ మంత్రి కేటీఆర్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు. మరో నటుడు గతంలో వంద రూపాయాలు పెట్టి పెట్రోలు తెచ్చుకున్నారు, కానీ రూపాయి పెట్టి అగ్గిపెట్టే కొనుక్కోలేక పోయారని విమర్శించారు. ఎందుకీ డ్రామాలని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ సర్కారు మహిళలకు మంత్రి పదవులు ఇవ్వకపోగా, మహిళలకు ఇస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని తప్పుపట్టడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత 15.21 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ఇప్పటివరకు ఆడబిడ్డల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 500.52 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. శుక్రవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు లెవనెత్తిన వివిధ అంశాలకు సీఎం సమాధానమిస్తూ...తొమ్మిదేండ్లుగా అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్‌నేతలు...కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండునెలలు కాముందే ఎన్నో విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ఈ రెండు నెలల్లో తాము అనేక గొప్ప నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కానీ 'బీఆర్ఎస్ నేతలు నేతలు మాత్రం కాంగ్రెస్ సర్కారు దివాళాతీసింది. ఖజానాలో చిల్లిగవ్వలేదు. గ్యారంటీలు అమలు కావు. కాంగ్రెస్ పనైపోయింది' అంటూ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పరిపాలన తీరులో ఏమైనా లోపాలు ఉంటే చెబుతారనుకుంటే, తమ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని గతంలో సంక్షోభంలోకి నెట్టిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా ఉండాలని టీఆర్ఎస్ కోరుకుంటున్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం మాత్రం ఆ రకంగా చేయబోదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో రైతు బంధు పథకాన్ని ప్రారంభించిందనీ, అప్పటి నుంచి 4, 5, 9 నెలలపాటు రైతుల ఖాతాల్లో ఆలస్యంగా డబ్బు జమ చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొద్దిగా ఆలస్యం కాగానే ఆ పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు.

భూకబ్జాదారులపై కేసులు

స్మార్ట్‌సిటీ తిమింగలాలపైనా చర్యలు
అసెంబ్లీ లాబీలో మంత్రి పొన్నం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కరీంనగర్ జిల్లాలో భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఇప్పటికే ముగ్గురు కార్పొరేటర్లను అరెస్ట్ చేశామనీ, మరో 15 మందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారం ఉందని బీఆర్ఎస్, ఇతర నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. అవినీతి, అక్రమాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రయివేటు వ్యక్తుల భూములను భూకబ్జా చేసిన వారిని వదిలిపెట్టమని అన్నారు. మర్యాదగా భూములు సంబంధిత వ్యక్తులకు భూములు తిరిగి అప్పగించాలని అల్టీమేటమ్ ఇచ్చారు. వందలాది ఫిర్యాదులు వస్తున్నాయనీ, భూకబ్జాదారులపై కేసులు పెట్టేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ఇదిలావుండగా కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనుల్లో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని సైతం వదలబోమని ప్రకటించారు. రూ. 600 కోట్ల పనుల్లో నాణ్యతాలోపాలు ఉన్నాయనీ, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని అభిప్రాయపడ్డారు.



ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తి పీవీ

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- భారతరత్న రావడంపై మండలి హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు భూసంస్కరణలు అమలు చేసిన గొప్ప ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కొనియాడారు. పీవీకి భారతరత్న రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆయన శాసనమండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. "తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన మన తెలంగాణ ముద్దు బిడ్డ, మాజీ ప్రధానమంత్రి, భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన పరిస్థితుల్లో గొప్ప సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఆర్థిక మేధావి, బహుభాషా కోవిదుడు పాములపర్తి వెంకట నర్సింహారావుకు భారతరత్న దక్కడం గర్వించదగ్గ విషయం. తెలంగాణ బిడ్డలుగా మనందరి గుండెల్లో ఇది ఆనందం. ఉప్పొంగే క్షణం. అదే విధంగా మాజీ ప్రధాని చరణ్ సింగ్, రాజకీయ కురువృద్ధుడు ఎల్.కె.అద్వానీ, కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌లకు భారతరత్న రావడం సతోషకరం... " అని భట్టి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు చప్పట్లతో స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



అసెంబ్లీ, మండలిలో

పీవీకి పుష్పాంజలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత మాజీ ప్రధాని పి.వి నర్సింహ రావుకు భారత రత్న రావడం పట్ల పలువురు ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని శాసనమండలి అవరణలో ఆయన కుమార్తె ఎమ్మెల్సీ వాణి దేవిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలోని పీవీ చిత్రపటానికి పలువుర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై

మండలి గరం గరం


ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాల్సిందే

- బీఆర్ఎస్ సభ్యుల డిమాండ్ • చైర్మెన్ పోడియం ముందు నిరసన
- రోజంతా వాయిదాలే • సభా గౌరవాన్ని మంటగలిపారు : భానుప్రసాదరావు

బీఆర్ఎస్‌కు నైతిక హక్కు లేదు : మంత్రి జూపల్లి

- పెద్దల సభను మీరే అగౌరవపరుస్తున్నారు : జీవన్‌రెడ్డి





పెద్దల సభ అంటే ఇదేనా? : జీవన్‌రెడ్డి

ఇదేనా పెద్దల సభ అంటే అని కాంగ్రెస్ సభ్యుడు టి జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి అన్నట్టుగానే బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారనీ, సభను అగౌరవపరుస్తు న్నారని విమర్శించారు. ఈ సభలో నిరసన తెలపడం సరైంది కాదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపాలంటూ కోరారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఓ ప్రయివేటు చానెల్‌లో చేసిన వ్యాఖ్యలపై శాసనమండలిలో శుక్రవారం తీవ్ర దుమారం చెలరేగింది. సీఎం క్షమాపణ చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై నిరసన వ్యక్తం చేస్తూ వారు నల్ల కండువాలతో సభకు హాజరయ్యారు. దీంతో సభ ప్రారంభమైనప్పటి నుంచే గందరగోళం ఏర్పడింది. కొద్దిసేపటి తర్వాత చైర్మెన్ పోడియం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. 'సీఎం రావాలి, క్షమాపణ చెప్పాలి, వియ్ వాంట్ జస్టిస్, జై తెలంగాణ'అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో రోజంతా సభ వాయిదాలతోనే సాగింది. మొదటిసారి ఉదయం 10.10 గంటలకు, రెండోసారి 10.40 గంటలకు, మూడోసారి 11.33 గంటలకు, నాలుగోసారి 2.30 గంటలకు, ఐదోసారి 5.05 గంటలకు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరి సారి సాయంత్రం 6.50 గంటలకు సభను చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండలిని శనివారానికి వాయిదా వేశారు. చైర్మెన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు ఎంత చెప్పినా బీఆర్ఎస్ సభ్యుల తీరులో మార్పు రాలేదు. దీంతో సభను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు.



నిరసన తెలిపే హక్కు బీఆర్ఎస్‌కు లేదు : జూపల్లి

నిరసన తెలిపే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాజ్యసభ సీట్లు ఎవరికిచ్చారో (పత్రికలో రాయలేని భాష వాడారు) తెలుసునని చెప్పారు. చట్టప్రకారమే సభ్యులుగా ఎన్నికయ్యారనీ, దాని ప్రకారమే ప్రివిలేజ్ కమిటీ ఉంటుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సభా గౌరవాన్ని దిగజార్చే విధంగా వ్యవహరించొద్దని కోరారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించాలని సూచించారు. ఇలా వాయిదా వేయడం సరైంది కాదన్నారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు సభా గౌరవాన్ని తగ్గిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రులు సమా ధానం చెప్పడం కాదనీ, ముఖ్యమంత్రి వచ్చి క్షమా పణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. చైర్మెన్, మంత్రులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా వారు వినలేదు. సభను నడవనీయ కుండా చివరిదాకా నినాదాలు చేస్తూనే ఉన్నారు. దీంతో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

అవమానించిన సీఎం : భానుప్రసాదరావు

తాను 14 ఏండ్లుగా సభలో ఉంటున్నానని బీఆర్ఎస్ సభ్యుడు భానుప్రసాదరావు అన్నారు. చాలా మంది ముఖ్యమంత్రులను చూశానని అన్నారు. ఎవరూ ఇలా సభా గౌరవాన్ని మంటగలిపేలా, అవమానపరిచేలా వ్యాఖ్యానించలేదన్నారు. శాసనమండలినుద్దేశించి ఇరానీకేఫ్ అనీ, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు అడ్డాగా మారిందనడం సిగ్గుచేటని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలనీ, బేషరతుగా ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభా గౌరవాన్ని కాపాడాలని కోరారు. మండలిని అవమానించిన తర్వాత ఈ సభలో సభ్యులుగా ఎందుకుండాలని ప్రశ్నించారు. సీఎం క్షమాపణ చెప్పేంత వరకూ సభను సాగనివ్వబోమని స్పష్టం చేశారు.

ప్రివిలేజ్ కమిటీకి ఇచ్చాం : చైర్మెన్

సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. దాన్ని ప్రివిలేజ్ కమిటీకి అప్పగించామన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపాల్సిన అవసరముందని సూచించారు. నిరసన రికార్డుల్లోకి ఎక్కిందని వివరించారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడి నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. సభ్యులు తమతమ స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కల్పించుకుని మండలిలో ప్రివిలేజ్ కమిటీ లేదనీ, ఎలా పంపించారని ప్రశ్నించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ మండలిని కించపరిచేలా సీఎం మాట్లాడి సభా గౌరవాన్ని బజారుకీడ్చారని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఇలాంటి వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు.

బీఆర్ఎస్ తప్పులన్నీ తెలుసు..

బయటపెడతా

కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అవమానానికి గురై బయటకొచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరిన తనకు బీఆర్ఎస్ తప్పులన్నీ తెలుసుననీ, వాటిని బయట పెడతానని అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీన్ని కాంగ్రెస్ సభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బలపరిచారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యతిరేక విధానాలను అవలంబించిందని విమర్శించారు. 2018 ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మిషన్‌భగీరథ పథకంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. నా నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో ఆ నీళ్ల రావడం లేదని తెలిపారు. నల్లగొండ జిల్లాలోని ఏ ప్రాజెక్టునూ పూర్తిచేయలేదనీ, దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష చూపారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని బొందపెట్టారని విమర్శించారు. విద్యావైద్య రంగాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన గద్దర్‌ను కేసీఆర్ మూడు గంటల పాటు బయట కూర్చోబెట్టి అవమానించారన్నారు. ఉద్యమకారుల కుటుంబాలను కూడా కేసీఆర్ ప్రభుత్వం అవమానించిందన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదున్నరేండ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనీ, చేసిన మోసాలన్నీ మదిలో ఉన్నాయి కాబట్టే పదేపదే 420 అని గుర్తుకొస్తున్నట్టుందని చెప్పారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ గీతంగా తమ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దొంగ జీవోల పేరుతో కొందరు బీఆర్ఎస్ నేతలు, అధికారులు భూములు కొట్టేశారని ఆరోపించారు. ఇంగ్లీష్ మాట్లాడటం రాకపోతే పరిపాలనా దక్షత లేనట్టా? పదేండ్ల కాలంలో ఇంగ్లీషు బాగా వచ్చిన ఆయన ఏం ఎలగబెట్టాడో తాము చూశామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తీరువల్ల గ్రామీణ ప్రాంతాల్లోని 150 ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇప్పటికీ గట్టిగా ఉన్నాయనీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టులు కూలిపోతున్నాయని విమర్శించారు.

మార్చి 1 నుంచి

టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షలు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అదేనెల 11వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అందుకే పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం 1.45 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. తొలిసారిగా ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వచ్చేనెల ఒకటిన ఫస్ట్ లాంగ్వేజ్, రెండున సెకండల్ లాంగ్వేజ్, నాలుగున థర్డ్ లాంగ్వేజ్, ఐదున మ్యాథమెటిక్స్, ఆరున ఫిజికల్ సైన్స్, ఏడున బయలాజికల్ సైన్స్, 11న సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో) పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నవతెలంగాణ

గెలవకపోవడం ఓటమి కాదు,
మళ్లీ ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమి - శ్రీశ్రీ

శనివారం 10 ఫిబ్రవరి 2024
www.navatelangana.com

సంపాదకీయం


దేశం తరపున కేరళ..

ఢిల్లీలో ధర్నాచౌక్ జంతర్‌మంతర్. కార్మికులో రైతులో కాదు, రాష్ట్ర ప్రభుత్వాలే ధర్నాలకు దిగాల్సిరావడం నేటి పరిస్థితి. రాష్ట్రాల ఆర్థిక హక్కుల్ని, రాజకీయ హక్కుల్ని, యావత్ సమాఖ్య నిర్మాణాన్ని కూల్చివేస్తున్న కేంద్ర సర్కార్‌పై కేరళ చేస్తోన్న పోరు దేశంలోని అన్ని రాష్ట్రాల తరుపునా అనేది స్పష్టం. కేరళ, దీనికి ఒక రోజు ముందు కర్నాటక ప్రభుత్వం సైతం ఇదే వేదిక నుంచి కేంద్రంపై తన నిరసన గళం వినిపించింది. స్వయంగా

దీనినే కేరళ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. సమాధానం చెప్పలేని కేంద్రం దీనిని ఉత్తర దక్షిణ సమస్యగా చిత్రించ జూస్తోంది. ఇదే నిజమైతే బెంగాల్‌లో తృణమూల్ ప్రభుత్వం కూడా కేంద్రంపై ఎందుకు నిరసన చేపట్టింది? తమిళనాడు సహా కేరళకు సంఘీభావం పలికిన ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు కేంద్రాన్ని దక్షిణాది నుంచే నిరసిస్తున్నాయా? నిజానికి రాష్ట్రాలపై కేంద్రం సాగిస్తున్న ఈ దాడికి బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రమూ మినహాయింపు కాదు. అన్ని రాష్ట్రాలదీ అదే కథ ఒకే వ్యథ.

ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఈ ఆందోళనలకు నేతృత్వం వహించగా ఆ రాష్ట్రాల ప్రజా ప్రతినిధులంతా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా రాష్ట్రాల హక్కులను, సమాఖ్య వ్యవస్థను కాపాడుకోవడమే తమ పోరాట లక్ష్యంగా పినరై విజయన్, సిద్ధ రామయ్యలు స్పష్టం చేయడం గమనార్హం. అందువల్ల ఇదేదో కేరళ, కర్నాటకలకు సంబంధించిన విషయం మాత్రమే అనుకుంటే పొరపాటు. దేశ సమైక్యతకూ రాష్ట్రాల మనుగడకు సంబంధించిన పోరాటంగా భావించాలి.

భారత రాజ్యాంగం ఈ దేశాన్ని "యూనియన్ ఆఫ్ స్టేట్స్"గా అభివర్ణించింది. రాష్ట్రాల సమాఖ్యగా నిర్దేశించింది. కానీ మోడీ సర్కారు గత దశాబ్ద కాలంగా ఈ సమాఖ్య భావననే నిర్వీర్యం చేస్తోంది. "యూనియన్ ఆఫ్ స్టేట్స్"ను కాస్తా "యూనియన్ ఓవర్ స్టేట్స్" (స్టేట్స్‌పై యూనియన్)గా మార్చేస్తోంది. భౌగోళికంగా సాంస్కృతికంగా భిన్న ప్రాంతాల, జాతుల సమాహారం ఈ దేశం. ఆమేరకు స్వరూప స్వభావాల్లోనే కాదు, ప్రజల అవసరాలూ ఆదాయాల్లోనూ తేడాలుంటాయి. తదనుగుణంగా స్థానిక ప్రజలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే సరైన నిర్ణయాలు తీసుకోగలవు. ఈ కారణం చేతనే దేశాన్ని రాష్ట్రాల సమాహారంగా పేర్కొనడమే గాక, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్పష్టమైన అధికార విభజన చేసింది మన రాజ్యాంగం. దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రాల హక్కులనూ అధికారాలను ఒక్కొక్కటిగా అపహరిస్తూ సమాఖ్య విధానానికే తూట్లు పొడుస్తోంది. శాంతిభద్రతలతో సహా కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోనివే కాదు, రాష్ట్రాల జాబితాలోని అధికారాలను కూడా స్వాహా చేస్తోంది.



ఇందుకోసం అప్రజాస్వామికంగా చట్టాలు చేస్తోంది.

అడుగడుగునా రాష్ట్రాల నిర్ణయాలపై ఆంక్షలు విధిస్తూ, గవర్నర్ల ద్వారా వాటి అభివృద్ధికి అడ్డుపడుతోంది. అంతేనా... వాటి ఆదాయ వనరులకు సైతం గండి కొడుతోంది. జీఎస్టీ ద్వారా ప్రధాన ఆదాయ వనరైన పన్నులపై రాష్ట్రాల నియంత్రణను తొలగించి తన ఆధీనంలోకి బదలాయించుకుంది. అందులో రాష్ట్రాల వాటాను క్రమేణా కుదిస్తోంది. జీఎస్టీ పన్ను లైతే రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకోవాల్సి వస్తుందని సెస్‌లు, సర్‌ఛార్జీల రూపంలో దొడ్డిదారిన కొల్లగొడుతోంది. ఉచితాల పేరుతో, అవి ప్రభుత్వాలకు భారమనే సాకుతో సంక్షేమ పథకాలపై దాడి చేస్తోంది. స్థానిక ప్రభుత్వ పథకాలు కాకుండా కేంద్రం రూపొందించిన పథ కాలను మాత్రమే అమలు పరుచాలంటోంది. వాటికి యాభై శాతం నిధులు రాష్ట్రాలే భరించాలంటోంది. అంటే "సొమ్ము రాష్ట్రాలదీ సోకు కేంద్రానిది" అన్నమాట. కేంద్రం ఇవ్వాల్సిన మిగిలిన యాభై శాతం నిధులను కూడా వారి షరుతులకు లోబడితేనే ఇస్తానంటోంది. మోటార్లకు మీటర్లు బిగించాలనడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. ఇలా చెప్పుకుంటూపోతే కేంద్ర పాలకుల లీలా విన్యాసాలు అనేకం...

దీనినే కేరళ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. సమాధానం చెప్పలేని కేంద్రం దీనిని ఉత్తర దక్షిణ సమస్యగా చిత్రించ జూస్తోంది. ఇదే నిజమైతే బెంగాల్‌లో తృణమూల్ ప్రభుత్వం కూడా కేంద్రంపై ఎందుకు నిరసన చేపట్టింది? తమిళనాడు సహా కేరళకు సంఘీభావం పలికిన ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు కేంద్రాన్ని దక్షిణాది నుంచే నిరసిస్తున్నాయా? నిజానికి రాష్ట్రాలపై కేంద్రం సాగిస్తున్న ఈ దాడికి బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రమూ మినహాయింపు కాదు. అన్ని రాష్ట్రాలదీ అదే కథ ఒకే వ్యథ. అయితే విపక్ష పార్టీల ప్రభుత్వాలున్న చోట వివక్ష, కక్షసాధింపులు అదనం. ఇందుకు కేరళ ఓ ఉదాహరణ మాత్రమే. కేరళ ప్రభుత్వం మోడీ సర్కారుకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు సాగుతోంది. ఇది సహించలేని కేంద్రం గ్రాంట్ల విడుదల మొదలు రుణ పరిమితులు విధించడం వరకూ రకరకాల ఆంక్షలు విధిస్తోంది. అయిన ప్పటికీ దాదాపు అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రగామిగా దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పుడు కేంద్రం బారినుంచి హక్కుల రక్షణకు రాష్ట్రాలకూ మార్గం చూపుతోంది. ఇది మింగుడుపడని మోడీ పరివారం ఉత్తర దక్షిణ వాదాన్ని ముందుకు తెస్తోంది. ఇది ముమ్మాటికీ అబద్ధం, అసం బద్ధం. ఇంకా చెప్పాలంటే దేశాన్ని ఉత్తర దక్షిణ విభజన దృష్టితో చూస్తున్నది కేంద్రమే. ఇందుకు ఉదా హరణలు కోకొల్లలు. కానీ కేరళ ఇందుకు భిన్నం. వారిది దేశ ఐక్యతకు, సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకు సాగుతున్న ప్రజాస్వామ్య పోరాటం.

అయోధ్య వివాదం దేనికోసం?



హర్ష్‌మందర్

12వ శతాబ్దపు కవి, తత్వవేత్త బసవ ఇలా అన్నాడు :
ధనవంతులు శివుని కోసం ఒక ఆలయాన్ని నిర్మిస్తారు.
పేదవాడినైన నేను, ఏమి చేయాలి?
నా కాళ్ళు స్తంభాలు,శరీరం ఓ ఆరాధనా మందిరం,
శిరస్సు ఓ బంగారు గోపుర శిఖరం...

శతాబ్దాల తరువాత నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ మరొక దేవాలయం గురించి రాస్తాడు. ఒక రాజు నిర్మించిన ఆ ఆలయం "ఆకాశాన్ని ఛేదిస్తుంది", ఇది "బంగారు సింహాసనం" పై "ముత్యాలు పొదిగిన విగ్రహాన్ని" కలిగిఉంది. అయితే విస్తృత స్థాయిలో గౌరవాన్ని పొందే ముని మాత్రం ఆలయాన్ని తిరస్కరిస్తూ, దానికి బదులుగా రోడ్డు వెంట ఉన్న ఒక చెట్టు కింద దేవునిపై పాటలు పాడతాడు. జనమంతా ఆయన చుట్టూ గుమిగూడారు. ఆలయం ఖాళీగా పడిఉంది. రాజు ఆగ్రహిస్తాడు. అప్పుడు ముని, 20వేల మంది ప్రజల్ని నిరాశ్రయులుగా, దిక్కులేని వారిగా మార్చిన మంటల అలజడి గురించి రాజుకు గుర్తుచేస్తాడు. సహాయం కోరుతూ వారంతా వచ్చి అతని తలుపు వద్ద నిలబడ్డారు. అయితే ఇళ్ళులేని తన ప్రజలకు ఆయన ఇళ్ళు ఇవ్వడానికి బదులుగా, ఒక దేవత కోసం బంగారంతో ఒక ఇంటిని నిర్మిస్తే సరిపోతుందని అనుకున్నాడు.

"ఆ ఆలయంలో దేవుడు లేడు... ప్రపంచ దేవుడ్ని కాక, నిన్ను నీవు ప్రతిష్ఠించుకున్నావని" ముని, రాజుతో అంటాడు.

దేవుడిలా ప్రకటిస్తాడు :
నా శాశ్వత గృహం లెక్కలేనన్ని దీపాలతో
అనంత ఆకాశంలో నీలిరంగులో
వెలిగిపోతున్నాయి
దీని శాశ్వత పునాదులు
సత్యం, శాంతి,కరుణ, ప్రేమ..

జనవరి 22 వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ సమక్షంలో 51

ఆందోళనకరమైన విషయమేమంటే, కేవలం బీజేపీ-ఆర్ఎస్ఎస్ వారు మాత్రమే కాక విస్తృతస్థాయిలో రాజకీయ భావాలున్న పెద్ద వర్గాల వారు కూడా నూతన రామ మందిరం ప్రకారమే నైతిక, ఆధ్యాత్మిక, చట్టపరమైన చట్టబద్ధతను కలిగి ఉన్నారు.మూడు నేర పూరితచర్యల ఫలితంగా మసీదు ఒక ఆలయంగా మారింది.1949లో మసీదులోకి రాముని విగ్రహాన్ని రహస్యంగా, చట్ట విరుద్ధంగా ప్రవేశపెట్టడమనేది మసీదులో ప్రార్థనలకు అంతరాయం కల్గించిన మొదటి నేరపూరిత చర్య. రెండవది,1992 లో అలజడి సృష్టించే అల్లరిమూకచే మసీదు కూల్చివేత, ఈ చర్యను అద్వానీ లాంటి నాయకులు కేరింతలతో ప్రోత్సహించారు. గాంధీ హత్యానంతరం,దేశానికిది విచారకరమైన రోజని ఉపరాష్ట్రపతి కే.ఆర్.నారాయణన్ అన్నారు.

అంగులాల నల్లరాతితో బాలరాముని విగ్రహాన్నిఅయోధ్యలో ప్రతిష్ఠించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన కొన్ని సంవత్సరాలకే సౌరాష్ట్ర ప్రభుత్వం సోమనాథ దేవాలయ పునర్నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించినప్పుడు, భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలు నాకు గుర్తుకొస్తున్నాయి. "ఏ ప్రభుత్వమైనా ఇలా చెయ్యడం పూర్తిగా సరైంది కాదని నాకనిపిస్తుంది.ఆ ప్రకారమే, నేను ఆ ప్రభుత్వానికి లేఖ రాస్తానన్న : "ఏ సమయంలోనైనా ఇది ఆమోదయోగ్యం కాదు, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో, దేశం ఆకలితో అలమటిస్తున్న సమయంలో జాతీయ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సంక్షోభం గురించి మనం మాట్లాడుకునే సమయాన ప్రభుత్వం ఈ ఖర్చుకు పూనుకోవడం అందునా ఒక రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల కోసం పెద్ద మొత్తంలో డబ్బును ఎలా ఖర్చుచేయగలుగుతుంది" అన్నారు నెహ్రూ.

సోమనాథ దేవాలయం సౌరాష్ట్ర తీర ప్రాం తంలో ఉన్న ప్రభాస్ పఠాన్ వద్ద ఉంది. 1026 లో దురాక్రమణదారుడైన మహ్మద్ ఘజనీ దానిని కొల్లగొట్టి, నాశనం చేశాడు.ఆ తరువాత దశాబ్దాల్లో కూడా అలా అనేకసార్లు జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని ఆదేశించాడు.1950లో ఆయన మరణం తరువాత,నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ దీవెనలతో కాంగ్రెస్ నాయకుడైన కే.ఎం.మున్షీ ఈ కార్యాన్ని ముందుకు తీసుకెళ్ళాడు. అయితే, ఒక మతపరమైన కార్యక్రమంలో లౌకికరాజ్యం ప్రమేయాన్ని,ఒక మతపరమైన మందిర పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధుల కేటాయింపును, 1951లో ఆలయ ప్రారంభోత్సవం సమయంలో రాష్ట్రపతితో సహా సీనియర్ అధికారులు హాజరు కావడాన్ని నెహ్రూ వ్యతిరేకించాడు. రాజ్యాంగ నిబంధనలకు భిన్నంగా ఒక్క మతానికే ప్రాధాన్యతనిచ్చే ఎలాంటి చర్యనూ ఆయన సమర్థించలేదు.

సోమనాథ దేవాలయం పునర్నిర్మాణాన్ని చేపట్టిన మున్షీకి, దీన్నే "హిందూ పునరుద్ధరణవాద" ప్రయత్న మని నెహ్రూ అభివర్ణించాడు.ఆయన తన అసమ్మతిని కూడా మర్యాదగా రాజేంద్రప్రసాద్‌కు తెలియజేశారు: అయితే ఒక లౌకికరాజ్యం, ఆలయ నిర్మాణం లాంటి కార్యాలకు దూరంగా ఉండాలన్న నెహ్రూ డిమాండ్ పట్ల, దశాబ్దాల తర్వాత మోడీ చాలా కఠినంగా ఇలా మాట్లాడాడు. "సోమనాథ దేవాలయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిని సాహసవంతులైన ప్రజలకు చెందిన ఈ నేల క్షమించదని" ప్రకటించాడు.

భారతదేశంలో ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్మూకాశ్మీర్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 కింద ఉన్న ప్రత్యేక రక్షణలను రద్దు చేయడం, యూనిఫాం సివిల్ కోడ్ ఏర్పాటుతో పాటు, 460ఏళ్ళుగా అయోధ్యలో ఒక మసీదు ఉన్న స్థలంలో రామునికి గొప్ప ఆలయాన్ని నిర్మించాలనే ముఖ్యమైన ఎజెండాను ఆర్ఎస్ఎస్, బీజేపీలు ముందుకు తెచ్చాయి.ఈ కారణంగానే బాబ్రీ మసీదు స్థలంలో రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కాషాయ దళానికి ఒక విజయోత్సవ సమయమైంది. అయితే నేను ఇంతకు ముందు రాసినట్లు,ఇది ఉత్తరప్రదేశ్‌లో ధూళిమయంగా ఉన్న ఒక చిన్న పట్టణంలో రెండు ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో ఉండే చిన్నపాటి భూమికి సంబంధించిన వివాదం కాదు. ఇది మధ్య యుగాల నాటి మసీదు(ఇప్పుడు నేలమట్టం చేయబడిన)కు, ఆలయానికి మధ్య పోటీ కూడా కాదు. ఇది ఏ రకమైన దేశం, భవిష్యత్తులో ఎలాంటి దేశంగా ఉంటుంది, ఈ దేశానికి చెందిన వారెవరు, ఎలాంటి షరతులపైన ఆధారపడి భిన్న అస్తిత్వాలు, భిన్న విశ్వాసాలు గల ప్రజలు ఈ విశాలమైన భూమిపై కలిసి జీవించాలనే విషయం గురించే ఈ వివాదం.

భారతదేశం గురించి ఒక భావన ఉంది.ఆ భారతదేశ భావన కోసమే మోహన్ దాస్ కరంచంద్ గాంధీ ఇష్టపూర్వకంగా తన జీవితాన్ని త్యాగం చేశాడు,ఆ భావననే బీ.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచాడు. ప్రతీ అస్తిత్వం, ప్రతీ విశ్వాసానికి చెందిన ప్రజలందరినీ అన్ని విషయాల్లో సమానంగా చూసే భారతదేశం ఇది. భారతదేశ హిందువులు,సిక్కులు,జైనులు, బౌద్ధులు, వాస్తవానికి పార్శీలు, క్రైస్తవుల వలెనే,భారతీయ ముస్లింలు కూడా విశ్వాసంతో, చట్టబద్ధంగా వారి జన్మభూమి, వారి ఎంపిక పట్ల సమానమైన హక్కును కోరడమే ఆ భావన. శక్తివంతులైన, మెజారిటీ విశ్వాసాలు గల ప్రజల వాదనలకు లోబడి ఇతర మతాల ప్రజలు తమ వాదనలను వదులుకోకుండా,విశ్వాసాలలో ఎలాంటి క్రమానుగత ఆదేశాలు ఉండవనే హామీ ఉంటుంది.

ఈ భారతదేశ భావనకు వ్యతిరేకంగా, భారతదేశానికి సంబంధించి బీజేపీ, ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభలకు మరొక ఊహ ఉంది. అదేమంటే, ఈ దేశం హిందూ (అగ్రవర్ణాలకు) ప్రజలకు చెందినది. దీనిలో సిక్కులు,జైనులు,బౌద్ధులు ఉంటారు ఎందుకంటే, వారి మతాలు కూడా భారతదేశ మట్టిలో నుండే పెరిగాయి. అయితే ఇస్లాం, క్రైస్తవులు విదేశీ విశ్వాసాలను పాటిస్తారు కాబట్టి వారిని "విదేశీయులు"గా గుర్తిస్తారు.ఈప్రత్యామ్నాయ భారతదేశ ఊహలో వారి అనుచరుల్ని భారతదేశంలో నివసించడానికి మెజార్టీ హిందువులు(అగ్రవర్ణాలు)అనుమతిస్తారు, అయితే మెజారిటీ మతం, సంస్కృతికి చెందిన మనోభావాలు,విశ్వాసాలకు లోబడి ఉండాలనే షరతుపై మాత్రమే అనుమతిస్తారు.బాబ్రీ మసీదు స్థలంలో రామ మందిర నిర్మాణం కోసం జరిగే ప్రచారం మొత్తం కూడా హిందువుల కోసమేనన్నట్టు సాగింది.కానీ విశ్వహిందూ పరిషత్ అనే ప్రధాన తగాదాల మారి హిందూత్వ మిలిటెంట్ సంస్థ,ఆర్ఎస్ఎస్,హిందూ మహాసభలు అనేకమంది హిందువుల మనోభావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి కానీ హిందువులంతా ఆ సంస్థల్ని ఏ రకంగానూ సమర్థించడం లేదు.

16వ శతాబ్దంలో మసీదును నిర్మించడానికి వాస్తవంగా రాముని హిందూ దేవాలయాలయాన్ని కూల్చివేశారనే రుజువు



లేదనే విషయాన్నిహిందూ వ్యాజ్యగాళ్ళకు భూమిని కేటాయిస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ధ్రువీకరిస్తుంది.కానీ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత నేనడిగినట్లు,వాస్తవానికి మసీదు నిర్మించిన స్థలంలో హిందూ ఆలయం ఉందని నిరూపించే రుజువులు ఉన్నాయా? మసీదు ఉన్న స్థలంలో రామమందిరం నిర్మించాలని బీజేపీ నాయకుడు ఎల్.కే.అద్వానీ నాయకత్వంలోని మొత్తం ఉద్యమం కోరుకుంది కాబట్టి 21వ శతాబ్దంలో చరిత్రలో జరిగిన తప్పిదాల్ని సరిచేసుకునే ప్రయత్నం చేయడానికి చట్టపరమైన,రాజ్యాంగ ఆధారాలు ఏమైనా ఉన్నాయా?ఇది ఎప్పటికి అంతమవుతుందో ఎవరు నిర్ణయిస్తారు? ఈ "దిద్దుబాట్లు" ఇతర వివాదాస్పద స్థలాలకు వర్తిస్తుందా? ఇలా చరిత్రలో మనం ఎంతవరకు వెళ్లాలి? 500 సంవత్సరాల చరిత్ర వద్దే ఎందుకు ఆగాలి?1000, లేక 1500, లేక 2000 సంవత్సరాలు, లేక ఇంకా దూరంగా ఎందుకు వెళ్ళకూడదు? 9వ శతాబ్దం వరకు భారతదేశంలో అనేక ప్రాంతాల్లో బౌద్ధం ఉండేది, బ్రాహ్మణవాద హిందూ మతం అత్యంత క్రూరంగా బౌద్ధ మతాన్ని అణచివేసి, భారతదేశంలో దాదాపు తుడిచిపెట్టింది.బౌద్ధ స్తూపాలను కూల్చి వేయడం ద్వారా అనేక దేవాలయాలను నిర్మించారనే రుజువులు చరిత్రలో ఉన్నాయి.

కాబట్టి హిందూ దేవాలయాలున్న ప్రాంతాల్లో బౌద్ధ ప్రార్థనా స్థలాలన్ని పునఃస్థాపన చేయాలని మనం ఇప్పుడు వాదనలు చెయ్యాలా? వాస్తవానికి, భారతదేశంలోని అనేక గిరిజన ప్రజల ప్రార్థనా స్థలాల్ని వేల సంవత్సరాలుగా హిందూ ప్రార్థనా స్థలాలకు ఇచ్చేట్టు వారిని ఒత్తిడి చేశారు. చరిత్రలో మనం ఎంత వెనక్కి వెళ్లాలనే విషయాన్ని ఎవరు నిర్ణయిస్తారు? మనం కొన్ని చరిత్రల్నే ఎందుకు ఎంచుకోవాలి, ఇతరులను సరిదిద్దడానికి ఎందుకు ఎంచుకోకూడదు? మరీ ముఖ్యంగా మన రాజ్యాంగంలో, చట్టంలో ఏది ఈ ఎంపికల్ని సమర్థిస్తుంది? రాముడు అయోధ్యలో జన్మించాడని చాలా మంది హిందువులు నమ్ముతారు అయితే ఆయన పుట్టిన అయోధ్య వాస్తవానికి నేడున్న అయోధ్య ఒకటేనా అనే దానిపై భిన్నమైన విశ్వాసాలున్నాయి. ప్రస్తుత అయోధ్యలో కూడా రాముడు పుట్టిన ప్రదేశంగా అక్కడి నివాసితులు చెప్పుకునే ప్రదేశాలు చాలానే ఉన్నాయి. రాముడు మరెక్కడో జన్మించాడనే అసంఖ్యాక హిందువుల విశ్వాసం, నమ్మకం కంటే కూడా, రాముడు మసీదు గోపురం కింద జన్మించాడనే ఒకే విశ్వాసం, నమ్మకానికే సుప్రీంకోర్టు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణాలు ఏమిటి?

ఆందోళనకరమైన విషయమేమంటే, కేవలం బీజేపీ-ఆర్ఎస్ఎస్ వారు మాత్రమే కాక విస్తృతస్థాయిలో రాజకీయ భావాలున్న పెద్ద వర్గాల వారు కూడా నూతన రామ మందిరం ప్రకారమే నైతిక, ఆధ్యాత్మిక, చట్టపరమైన చట్టబద్ధతను కలిగి ఉన్నారు. మూడు నేరపూరితచర్యల ఫలితంగా మసీదు ఒక ఆలయంగా మారింది. 1949లో మసీదులోకి రాముని విగ్రహాన్ని రహస్యంగా, చట్టవిరుద్ధంగా ప్రవేశపెట్టడమనేది మసీదులో ప్రార్థనలకు అంతరాయం కల్గించిన మొదటి నేరపూరిత చర్య. రెండవది, 1992లో అలజడి సృష్టించే అల్లరిమూకచే మసీదు కూల్చివేత, ఈ చర్యను అద్వానీ లాంటి నాయకులు కేరింతలతో ప్రోత్సహించారు. గాంధీ హత్యానంతరం, దేశానికిది విచారకరమైన రోజని ఉపరాష్ట్రపతి కే.ఆర్.నారాయణన్ అన్నారు. ఈ ఉద్యమం, కూల్చివేత 1989 నుండి 1993 ప్రారంభం వరకు దేశవ్యాప్తంగా భయంకరమైన అల్లర్లను సృష్టించిందీ. వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు, దాని మానని గాయాలు దశాబ్దాల తర్వాత కూడా దేశాన్ని ముక్కలు చేయడం కొనసాగుతూనే ఉంది.

(స్క్రోల్.ఇన్ సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

(ఇంకా వుంది..)



'వాక్ స్వాతంత్ర్యం' అంటే తిట్ల దండకమా?

సృష్టిలో ఏ జీవరాశికి లేని వరం మనిషికి ఉంది. అదే ఇతరులకు అర్థమయ్యే భాష, మాట్లాడే వరం. ఈ మాటలు ఎదుటి వారిని నొప్పించకుండా మాట్లాడాలి. ఎదుటి వారు అర్థం చేసుకోకుండా అదే పనిగా మాట్లాడుతూ, మొండివాదనకు దిగుతూ ఉంటే, వారి పట్ల మౌనం వహించటం మంచిది. మౌనం కూడా భాషేగా! మౌనం అనేది ఎదుటి మనిషి పై నిరసన తెలిపే పదునైన ఆయుధం. కొన్నిసార్లు అనేక మాటలలో వ్యక్తం చేయలేని భావోద్రేకాలను సైతం మౌనవ్రతంతో, కనుచూపుతో వ్యక్తం చేయవచ్చు. పరుషంగా చెప్పవలసిన కఠినమైన సత్యాన్ని కూడా ప్రియంగా చెప్పాలని పెద్దలంటారు. "అల్పుడెప్పుడు పలుకు ఆడంబరము గాను...సజ్జనుండు పలుకు చల్లగాను" అనే చిన్న పద్యం మనం చిన్నప్పుడు చదువుకున్నదే. అది చిన్న పద్యమే కావచ్చు. కానీ, దాని భావాన్ని మనం జీవిత కాలమంతా... నానా యాతన పడుతూ కూడా సాధన చేయవలసిన గొప్ప విద్య. మాటలు చెప్పినంత తేలికకాదు ఆచరించటం. మనిషి సమాజంలో బతుకు తున్నప్పుడు అనునిత్యం ఎదురయ్యే సంఘర్షణాయుత సందర్భాలలో సైతం భావోద్రేకాలను అదుపులో ఉంచుకుని శాంతంగా ప్రవర్తించటం. ప్రియంగా సంభాషించటం నిజంగా "కత్తి మీద సామే" ఇక్కడ ఈ ప్రస్తావన ఎందుకంటే... ఇటీవల మాజీ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పద్మపురస్కార గ్రహీతలకు చేసిన పౌర సన్మాన సభలో కొన్ని మంచి విషయాలు చెప్పారు. ఈ మాటల విలువల గురించి సభలో వివరించారు. శాసనసభల్లోనూ, బయటా ప్రజా జీవితంలో ఉండే నాయకులు ఆచితూచి మాట్లాడాలనీ చెప్పారు. ఇప్పుడు ప్రతి చోటా అధికార, ప్రతిపక్షాల వారు మాట్లాడాల్సిన విషయాన్ని వదిలేసి, అనవసరపు మాటలు మాట్లాడుతూ రాయలేని విధంగా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని చెప్పారు. ఇది నిజంగా శోచనీయం. మన వెనుకటితరం ప్రజా ప్రతినిధులు శాసనసభల్లో మాట్లేడేటప్పుడు విషయ ప్రధానంగా మాట్లాడేవారు. గణాంక వివరాలతో, బలంగా తమవాదన వినిపించే వారు. మాట్లాడవలసిన విషయంపై 'హోంవర్క్' చేసి సభకు వచ్చే వారు. చెప్పవలసిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా ఆసక్తిదాయకంగా చెప్పేవారు. వారి మాటల్లో పొదుపు,అదుపు ఉండేది. విషయం ఏదైనా వినసొంపుగా 'నస' లేకుండా ప్రసంగించటం ఒక కళ. వారు ఉపన్యాస కళలో మంచి 'తర్ఫీతు' పొందారు. జనరం జకంగా ప్రసంగిచేవారు. చట్ట సభల్లో వారు మాట్లాడేటప్పుడు అధికార ప్రతిపక్షం పరస్పరం చలోక్తులతో, సరస సంభాషణలతో, సున్నిత వ్యంగ్యంతో తమ వాదనలను వినిపించేవారు. ముఖ్యంగా పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరావు, వావిలాల గోపాల కృష్ణయ్య, వెంకయ్యనాయుడు, గౌతు లచ్చన్న మొదలైన పెద్దలు ఈ విషయంలో మంచి మార్గ దర్శనం చూపించారు. కేంద్రంలో కూడా పార్లమెంట్‌లో అనేకమంది వక్తలు ఉండేవారు. వారు పార్టీలకతీతంగా, స్నేహ భావంతో, పరస్పర గౌరవంతో, సభామర్యాదను, నియమాలను, సంప్రదాయాలను పాటిస్తూ... అద్భుతంగా ప్రసంగించేవారు. ఇప్పుడు శాసనసభలలోనూ, బయటా, బహిరంగ సభల్లోనూ నాయకులు తిట్ల పురాణంతోనే సంభాషణ మొదలౌతుంది.ఎక్కడ చూసినా వ్యక్తిగత దూషణలే వినిపిస్తాయి. చట్టసభల్లో కూడా "నువ్వెంత? అంటే, నువ్వెంత?" అనేవరకు పోయింది. సభలో లేని కుటుంబ సభ్యులను, వారి వ్యక్తిగత జీవితాలను తవ్వి తీస్తూ దూషణపర్వం మొదలైంది. చెప్పులు చూపిస్తూ ముఖ్యమంత్రిని నిందించే స్థాయికి యువనాయకులు తయారయ్యారు. సభా గౌరవం, విలువలు దారుణంగా పడి పోయాయి.అలాగే ముఖ్యమంత్రి కూడా తన స్థాయి మరచి మాజీ ముఖ్య మంత్రిపై మాటలు తూలటం ఎవరికీ మంచిది కాదు.ఆ సీటు గౌరవం కాపాడాలి. ఒకరిని చూసి మరొకరు రెచ్చిపోవడం మంచిది కాదు. నేడు మనమున్నది డిజిటల్ ఎలక్ట్రానిక్ మీడియా యుగంలో అని మరచిపోరాదు.ప్రతి మాట, కదలిక రికార్డు అవుతుంది. సోషల్ మీడియా ద్వారా ఆ విషయం చిలువలు పలువలు చేరి చిన్న విషయం కూడా 'రచ్చ రచ్చ' అవుతుంది. సీనియర్ శాసనసభ్యులు, మంత్రులు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు తమ మంచి నడవడిక ద్వారా విలువలు, శిక్షణ, నడవడికనివ్వాలి. తిరిగి పూర్వవైభవంతో మన శాసనసభలు, పార్టీ అంతర్గత సభలు, బహిరంగ సభలు వెలుగొందాలి. గౌరవప్రదంగా మంచి ఉపన్యాసాలతో, సంయమనంతో, మంచి భాషతో లోతైన అవగాహనతో, పార్టీ సిద్ధాంతాల పూనికతో, అర్థవంత మైన విమర్శలతో పరిధి దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది వారికే కాదు, భవిష్యత్తు తరానికి ఆదర్శదాయకం.



- డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496


డార్విన్ సిద్ధాంతమంటే ఎందుకింత వ్యతిరేకత?

కట్టా సత్యప్రసాద్

డార్విన్ జీవపరిణామ సిద్ధాంతమంటే ఎందుకింత వ్యతిరేకత? ఉండదా మరి? అనాదిగా నిర్మించుకున్న సౌధాలు కుప్పకూలుతుంటే! యుగాలుగా చలాయిస్తున్న ఆధిపత్యానికి బీటలు వారుతుంటే! ఉండదా మరి అక్కసు! అదేమిటి? డార్విన్ సిద్ధాంతం వెలుగుచూసి చూడక ముందే ఎందుకంత ఉలికిపాటు? ఎప్పుడో పందొమ్మిదో శతాబ్దపు 30వ దశకంలో బీగిల్ నౌకపై ప్రకృతి పరిశీలకుడుగా సేకరించిన ఆధారాలతో 1859 లో 'జాతుల పుట్టుక' (The Origin of Species) పుస్తకం రాశాడు. అందులోనే జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. విడుదలైన తొలిరోజే 1250 కాపీలు అమ్ముడయ్యాయి. ఒక వైపు ఊహించని స్పందన, మరోవైపు ఊహకందని దాడి. ఏడాది తిరగకుండానే వేడి వేడి చర్చలు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నాచురల్ హిస్టరీ మ్యూజియం హాలులో 1860లో జరిగిన చర్చ ఇందుకు మచ్చుతునక. ఇదే చరిత్రలో ప్రసిద్ధి కెక్కిన హక్సలే - విల్బర్‌ఫోర్స్‌ల సంవాదం. ఒక విధంగా చెప్పాలంటే డార్విన్ సిద్ధాంతానికదే తొలి పబ్లిక్ ప్రతిస్పందన. వెయ్యిమంది సభ్యులతో హాలు కిటకిట లాడింది. ఆక్స్‌ఫర్డ్ బిషప్ విల్బర్‌ఫోర్స్ తీవ్ర స్థాయిల్ డార్విన్‌పై విరుచుకుపడ్డాడు. ఆ సభలకు డార్విన్ హాజరు కావలసి ఉండే. అనారోగ్యంతో రాలేకపోయాడు. ఆ సభలోనే ఉన్న థామస్ హెన్రీ హక్సలే ఆ లోటును భర్తీ చేశాడు. చర్చవేడెక్కి వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరుకుంది. హక్సలేను ఎగతాళి చేస్తూ 'నీవు కోతివా? నీ తాతలు కోతులా? అమ్మ తరపునుండా? అయ్యా తరపు నుండా?' అని బిషన్ రెచ్చగొట్టాడు. హక్సలేను వెక్కిరిస్తూ సభలో నవ్వులు, అరుపులు. ఆ గందరగోళం మధ్య నుండి హక్సలే నిబ్బరంగా లేచాడు జవాబిచ్చేందుకు. ఆయన మాటలు వినడానికి నిశ్శబ్దం చెవులిచ్చింది. తన శక్తియుక్తులనూ, మేధస్సునూ, వైజ్ఞానిక చర్చలో ఎదుటివారిని అవమానించడానికి, ఎగతాళి చేయడానికి వినియోగించే మనిషికంటే నా తాతలు, నేను కోతులకు వారసుడిగా ఉండటానికే ఇష్టపడతాము' అని ధీటైన జవాబునిచ్చాడు. నాటి కోతి ప్రహసనం నుండి నిన్న మొన్నటి మన మంత్రుల కోటి ముచ్చట్ల వరకూ పరిణామ సిదాధంతంపై అలుపెరగని దాడి. ఆ సిద్ధాంతం వెలుగు చూసి 165 ఏండ్లయినా ఇంకా జనం నోళ్లలో నానుతుందంటే దానిశక్తి, ప్రాసంగికత ఎంతటిదో అర్థమవుతుంది.

ఇంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఆ సిద్ధాంతం అసలు ఏం చెప్పింది? సైన్సులో ఏ ఒక్క సిద్ధాంతమూ చవిచూడని శతృత్వం దీనిపైనే ఎందుకు? దగ్గర సంబంధం ఉండే జాతుల నుండి కొత్త జాతులు ఆవిర్భవిస్తాయని చెప్పింది. జీవించే క్రమంలో నెలకొన్న పరిస్థితులతో సరిపెట్టుకుంటూ జీవులు మార్పు చెందుతాయనీ, ఆ మార్పులు దీర్ఘ కాలంలో కొత్త జాతి ఏర్పడటానికి దోహదం చేస్తాయనీ చెప్పాడు. ఇందులో ప్రకృతి ఎంపిక (Natural Selection) కీలకంగా పనిజేస్తుందని సూత్రీకరించాడు. దీనిలో ఏ అతీత శక్తుల ప్రమేయం అవసరం ఉండదనీ, ఇది కేవలం భౌతిక ప్రక్రియ మాత్రమేననీ, ఆధారాలతో తేల్చి చెప్పాడు.

ఇదే సృష్టివాదులకు కంటగింపు అయింది. ప్రతి జాతి అవసరమైన ప్రత్యేక లక్షణాలతో సృష్టించబడిందనీ. అది మార్పు చెందదనేది వారి ప్రచారం, నమ్మకం. డార్విన్ సిద్ధాంత వెలుగులో ఈ నమ్మకం దూదిపింజలా తేలిపోతుంటే చూస్తూ ఊరుకుంటాదా మతం. అప్పటికి అందుబాటులో ఉన్న వైజ్ఞానిక ఆధారాలతో తన దార్శనికతను జోడించి అనంత జీవవైవిధ్యానికి కారణం జీవులు పరిణామం చెందడ మేనని సిద్ధాంతీకరించాడు. పరిణామమే నిజమైతే మార్పు చెందే క్రమంలో ఉన్న మధ్యంతర జీవులేవి? కొత్త జాతులనేవి ప్రకృతిలో సహజంగా ఏర్పడటం సాధ్యమా? ఇలాంటి అనేక ప్రశ్నలకు డార్విన్ కాలంలో రుజువులు చూపటం సాధ్యం కాలేదు. పరిణామానికి రుజువు దొరక లేదంటే సృష్టి జరిగిందనే వాదన కూడ సరైంది కాదు.



డార్విన్ తదనంతర కాలంలో జీవ పరిణామ సిద్ధాంతాన్ని రుజువుచేసే ఎన్నో ఆధారాలు లభ్యమయ్యాయి. డార్విన్ సైతం ఊహించనంతటి కచ్చితమైన శిలాజ నిదర్శనాలు దొరికాయి. నీటిలో నివసించే చేపలు నేలపై జీవనానికి అనుకూలమైన మార్పులతో ఉన్న మధ్యంతర శిలాజాలు ఇటీవలి కాలంలో వెలుగు చూశాయి. 2004లో నీల్ షుబిన్ కనిపెట్టిన తిక్తాలిక్ అనే చేప శిలాజం చేపరెక్కలు కాళ్లుగా మారే క్రమాన్ని వెల్లడించింది. శిలాజ నిదర్శనాలతో పాటు ఆధునిక జన్యుశాస్త్ర అధ్యయనాలు జీవపరిణామాన్ని ఎంతగానో బలపరుస్తున్నాయి. సూక్ష్మజీవి నుండి తిమింగలం, మనిషి వరకు అన్ని జీవుల్లోనూ దండలో దారంలా DNA కీలకంగా ఉండటమనేదే అతి పెద్ద రుజువు. జీవుల మనుగడకు అవసరమైన ప్రోటీన్లుగాని, వాటి తయారీ యాంత్రికం గాని జీవులన్నింటిలోనూ ఒకే విధంగా ఉండటం దేనిని సూచిస్తున్నది? అన్ని ప్రోటీన్లలోనూ అవే 20 అమైనో ఆమ్లాలు ఉండటం హైస్కూలు విద్యార్థు లకు సైతం తెలిసిన సత్యమే కేంద్రక ఆమ్లాలు, మైటోకాండ్రియా, సైటోక్రోమ్‌సి, కంటి కటకాల ఆల్ఫా క్రిస్టలిన్, ఇలా ఏ జీవాణువైనా క్రమానుగత సారూప్యతను చూపటం. ఒకే మూలం నుండి శాఖలుగా విడిపోయిన పరిణామ వృక్షాన్ని తలపిస్తాము. జీనోమ్ విజ్ఞానం మరింత కచ్చితంగా వివిధ జీవుల మధ్య సంబంధాన్ని ఆవిష్కరిస్తున్నది. జీవుల సమిష్టి వారసత్వం పిండాభివృద్ధికి కారణమైన జన్యువుల్లో సైతం కనబడుతుంది. ఉదాహరణకు పిండంలో కళ్లు ఏర్పడటాన్ని ప్రేరేపించే జన్యువు Pax6, నత్తల నుండి వెన్నుముక జంతువులన్నింటిలోనూ ఒకే పాత్ర పోషించడం జీవపరిణామానికి తిరుగులేని సాక్ష్యం.

జీవపరిణామ సిద్ధాంతం, ఊహాజనితం కాదు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, నిగ్గుదేలిన సిద్ధాంతం, జరిగిన, జరుగుతున్న ఒక వాస్తవానికిది సిద్ధాంత రూపం. సైన్సు ఇచ్చిన జవాబు డార్విన్ పుట్టినరోజు ఫిబ్రవరి 12న ప్రపంచ 'డార్విన్ దినోత్సవం' గా జరుపుకొంటున్నది. సత్యాన్వేషులు, సైన్సు, సైనికులూ ఇందులో పాల్గొని నేటి సమాజానికి ఈ సిద్ధాంత ప్రాసంగికతను తెలియజేస్తారు.

(ఫిబ్రవరి 12 ప్రపంచ డార్విన్ సిద్ధాంత దినోత్సవం)

'నీవు కోతివా? నీ తాతలు కోతులా? అమ్మ తరపునుండా? అయ్యా తరపునుండా?' అని బిషన్ రెచ్చ గొట్టాడు. హక్సలేను వెక్కిరిస్తూ సభలో నవ్వులు, అరుపులు. ఆ గందరగోళం మధ్య నుండి హక్సలే నిబ్బ రంగా లేచాడు జవాబిచ్చేందుకు. ఆయన మాటలు వినడానికి నిశ్శబ్దం చెవులిచ్చింది. తన శక్తియుక్తులనూ, మేధస్సునూ, వైజ్ఞానిక చర్చలో ఎదుటివారిని అవమానించడానికి, ఎగతాళి చేయడానికి వినియోగించే మనిషికంటే నా తాతలు, నేను కోతులకు వారసుడిగా ఉండటానికే ఇష్టపడతాము' అని ధీటైన జవాబునిచ్చాడు.

మహాలక్ష్మి పథకంలో లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి

నవతెలంగాణ ఖమ్మం

మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 లకు గ్యాస్ సిలిండర్ అందజేయడానికి లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభితో కలిసి నగరంలో అధికారుల క్షేత్ర తనిఖీలను పరిశీలించారు. 54వ డివిజన్, విడివోస్ కాలనీలో అధికారులను లబ్ధిదారుల క్షేత్ర పరిశీలన విషయమై అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ కనెక్షన్ నెంబర్, డిస్ట్రిబ్యూటర్ వివరాలు, అధికారులు కోరిన సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ సత్యనారాయణ రెడ్డి, డిఇ నవ్యజ్యోతి, అధికారులు తదితరులు ఉన్నారు.

నీలాద్రి అటవీ ప్రాంతంలో.... వానరాలకు ఆహారం అందించిన దయానంద్



నవతెలంగాణ-సత్తుపల్లి

కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ శుక్రవారం పెనుబల్లి మండలంలోని నీలాద్రి అటవీ ప్రాంతంలో వానరాలకు ఆహారం అందించారు. నీలాద్రీశ్వరుని సన్నిధికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో వెళ్లిన దయానంద్ అక్కడ కుప్పలు తెప్పలుగా ఉన్న వానరాలను చూసి వాటికి ఆహారం అందించారు. కరోనా సమయంలో నీలాద్రీశ్వరుని దర్శనానికి భక్తులు రాకపోవడంతో వానరాలకు ఆహారం దొరక్క బక్కచిక్కి పోయాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ దయానంద్ వానరాలకు ఆహారం సిద్ధంచేసి తన అనుయాయులతో కలిసి నీలాద్రి అటవీ ప్రాంతానికి వెళ్లి వాటికి ఆహారం అందించే వారు. ఇది చాలాకాలం పాటు సాగింది. నీలాద్రి ప్రాంతానికి దయానంద్ వెళ్లిన సందర్భాల్లో ఆయన్ను చూస్తే చాలు వానరాలన్ని ఆయన దగ్గరకు చేరుకోవడం సర్వసాధారణం. వానరాలు తన దగ్గరకు రావడం, వాటికి ఆహారం అందించడం తనకెంతో సంతోషంగా ఉంటుందని దయానంద్ అంటుంటారు.

వైరాకు 100 పడకల ఆసుపత్రి

- ఇదే జిల్లా ఆసుపత్రి కూడా : జిల్లా పరిషత్ చైర్మన్ కమల్ రాజు



నవతెలంగాణ-వైరా

ఖమ్మం నగరానికి అతి సమీపంలో ఉన్న వైరా పట్టణానికి 100 పడకల ఆసుపత్రి మంజూరైనది. ఈ ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిగా కూడా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. శుక్రవారం ఎంపీపీ వేల్పుల పావని అధ్యక్షతన జరిగిన వైరా మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఖమ్మంలో ఉన్న ఆసుపత్రి ఖమ్మం మెడికల్ కాలేజీ ఆసుపత్రిగా ఉంటుందని, అందువలన వైరా ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిగా మారుతుందని జడ్పి చైర్మన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థల పరిశీలన చేయాలని, ఈ స్థలం చాలక పోతే వెంటనే స్థల సేకరణకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏ మాత్రం జాప్యం చేసినా ఆసుపత్రి కొణిజర్ల మండలానికి తరలి వెళ్లే అవకాశం ఉన్నదని, కొణిజర్ల మండల ప్రజా ప్రతినిధులు ఇప్పటికే ఆ ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుందని, కావునా మండలం లోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను కలిసి స్థల సేకరణ కోసం కృషి చేయాలని కోరారు. వైరా ఎమ్మెల్యే హెడ్ క్వార్టర్‌లో 100 పడకల ఆసుపత్రి ఉండటం ఎంతో మేలని అభిప్రాయ పడ్డారు. గ్రామాలలో ప్రస్తుతం సర్పంచ్ లు లేనందు వలన నియమించబడిన ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామ సమస్యలను లేవనెత్తాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ మండలంలో 13,684 మంది రైతులు న్నారని, వారిలో 17 మంది రైతులు అనారోగ్య సమస్యలతో చనిపోగా వారికి రైతు బీమా వర్తింప జేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ఏఈ మణిశంకర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. అట్టి గ్రామాలు లింగన్న పాలెం, గరిక పాడు, దాచాపురం, వల్లా పురం, గొల్లెన్ పాడు అని తెలిపారు. ఆర్ &బి అధికారి మాట్లాడుతూ గన్నవరం నుండి ఖానా పురం వరకు పీరియాడిక ల్ రెన్యువల్ వర్క్ చేపట్టుటకు రూ.97 లక్షలు మంజూరై అగ్రిమెంట్ కూడా పూర్తయి పని ప్రారంభించాల్సి ఉన్నట్లు, (పంచాయతీ రాజ్ శాఖ నిధులు) వైరా పట్టణం లో క్రాస్ రోడ్డు నుండి మధిర వెళ్ళు రోడ్డు నాలుగు లైన్లు గా విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ టెండర్లు పిలిచి అగ్రిమెంట్ పూర్తయి పనులు ప్రారంభించాల్సి ఉందని (ఎస్‌టిఎస్‌డిఎఫ్ నిధులు) అని తెలిపారు. ఐసిడిఎస్, మెడికల్, ఎన్‌ఆర్‌ఈజిఎస్, విద్యా శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలను సభ్యులకు తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి నంబూరి కనక దుర్గ, జడ్‌పి కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె లాల్ అహ్మద్, ఎంపిడిఓ డి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సర్పంచులు లేకుండా నిర్వహించిన సమావేశంలో ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు 2 నెలల పెండింగ్

పారితోషికాలు తక్షణమే చెల్లించాలి





- గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు డిసెంబర్, జనవరి రెండు నెలల పారితోషికాలు ఇంకా రాలేదని, గతంలో ప్రతి నెల 2వ తేదీన పారితోషికాలు ఆశా వర్కర్ల అకౌంట్లో పడేవి, కానీ ఇప్పుడు రెండు నెలలు దాటినా నేటికీ పడలేదు. రెండు నెలలుగా రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పు చేసి బతకాల్సిన దుర్భర పరిస్థితికి ఉన్నామని ఆశా వర్కర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు. వీరికి నేటికీ కనీస వేతనం లేదని, కనీసం ఫిక్స్‌డ్ వేతనం కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయం చేయలేదు. ప్రభుత్వం చెల్లిస్తున్నవి చాలీచాలని, అతి తక్కువ పారితోషికాలు మాత్రమే ఇవి కూడా సకాలంలో రాకపోవడంతో ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, మరో వైపు పండుగలు క్రిస్టమస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగలు కూడా ఈ కాలంలో వచ్చాయని, ఇలాంటి సందర్భంలో కూడా పారితోషికాలు సకాలంలో రాకపోతే ఎలా బతకాలని ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చెందుతున్నారని వారు అన్నారు.

పారితోషికాలు తక్షణమే చెల్లించాలని, సమ్మె సందర్భంగా ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి రమ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి బి.అమల, జిల్లా నాయకులు రమణ రాణి, కమల, సమాధానం, నాగమణి, జ్యోతి, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల 15 నుండి 17 వరకు మండల, టౌన్ స్థాయి, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే పదోవ తరగతి టాలెంట్ టెస్ట్ ను జయప్రదం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అన్నారు. ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఎంఈఓ బివి రామాచారి,హైస్కూల్ హెచ్ఎం కె శాంతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు, భయాన్ని తగ్గించేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ ఉపయోగ పడుతుందన్నారు. ఎంఈఓ బాణాల వెంకటరామాచారి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిర్వహించే టాలెంట్ టెస్ట్ అభినందనీయమన్నారు. ముదిగొండ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె శాంతి,సెయింట్ ఆన్స్ బిఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పదోవతరగతి విద్యార్థిని, విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సచ్చింద్రబాబు, వెంకన్న, రామారావు, షేక్ రబ్బర్, పద్మావతి, సునీత, మాధవి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

16న విద్యాసంస్థల బంద్ : వామపక్ష విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ఖమ్మం

నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్కు మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న విద్యాసంస్థల బందుకు పిలుపునిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శులు ఇటుకల రామకృష్ణ, మస్తాన్, వెంకటేష్ లు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది . ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాలేజీలలో, యూనివర్సిటీలలో పరిశోధనా సంస్థలలో స్వయం ప్రతిపత్తిని తొలగించి, విద్యార్థుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల ప్రజాస్వామిక హక్కులను ఉల్లంఘన కొనసాగిస్తున్నదని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేసే వారిని బెదిరించడం, దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఫీజులు ఇష్టానుసారంగా పెంచుతున్నారని, కాని పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, స్కాలర్షిప్పులు అందించకుండా నిర్లక్ష్యం చేయడం, విద్యను కాషాయీకరణ చేస్తున్నారని వారు విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బాగు చేయడానికి కృషి చేయకుండా ప్రభుత్వ విద్యారంగంలోకి ప్రైవేటు, కార్పొరేట్, విదేశీ శక్తులను ఆహ్వానించి తన భాధ్యత నుండి తప్పు కునేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ జిల్లా నాయకులు రామకృష్ణ, కరుణ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



దేశ సంపద సంపన్నులకేనా? కార్మికులను ఆదుకోరా...

- 16న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి....
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు.

నవతెలంగాణ-పెనుబల్లి

ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు అన్నారు. హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో అన్నపురెడ్డి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను, ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ భారత బందును, విజయవంతం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ రాయితీలు ప్రకటిస్తుందని, భారత రాజ్యాంగాన్ని అందులో పొందపరచిన లౌకిక వాదాన్ని తారుమారు చేస్తూ, హిందూ రాజస్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన ఏజెండాను ముందు తీసుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు మిద్దె స్వామి, గుజ్జా వెంకటేశ్వర్లు, భూక్య రాములు, అన్నపురెడ్డి రాములు, సిఐటియు ఖమ్మం జిల్లా కమిటీ సభ్యురాలు మిట్టపల్లి నాగమణి, గుడిమెట్ల బాబు కంటే సత్యం చెడికిమళ్ళ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను తనిఖీలు చేయాలి



- కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

గ్రంథాలయం కూలిన సంఘటన పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శుక్రవారం నూతన కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలకు చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భవనాలను ఆయా ఇంజనీరింగ్ శాఖలు తనిఖీలు చేపట్టాలన్నారు. భవనాల తనిఖీ సంబంధ రిజిష్టర్ నిర్వహించి, తనిఖీ అనంతరం రిజిస్టర్ లో రిమార్కులు పొందుపర్చాలన్నారు. తనిఖీల సందర్భంలో ఆయా భవనాల్లో ఉండే శాఖల అధికారులకు భవనాల భద్రతపై సలహాలు, సూచనలు చేయాలన్నారు. వర్షపు నీరు భవనాల స్లాబ్, వెంటిలేటర్ ల వద్ద నిల్వకుండా ఉండేలా చూడాలని, లీకేజీలతో భవనం దెబ్బతింటుందని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. భవనాల భద్రత, భద్రతలేని భవనాల కూల్చివేత, మరమ్మత్తులతో ఉపయోగంలోకి తేవడంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. భవనాల నిర్వహణ చాలా కీలకమని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలోఎన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి, ఎన్ని కూల్చివేశారు, ఎన్ని పరమ్మత్తులతో వాటిని ఉపయోగంలోకి తేవచ్చొ నివేదిక సమర్పించాలన్నారు. కూల్చివేతకు నోటీసులు జారిచేసి, కూల్చివేతకు ఆర్థికభారం పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన భవన నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, పీఆర్, గిరిజన, విద్యా శాఖ ఇఇ లు పాండురంగ విఠల్, నాగశేషు, తానాజీ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక అధికారి వేణు మనోహర్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ జిల్లా ఇంటర్ మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి జయప్రకాష్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ, షెడ్యూల్ సంక్షేమ శాఖ ఆర్సీఓ ప్రత్యూష, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జరిగే మహాసభలను విజయవంతం చేయండి

- విలేకరుల సమావేశంలో ప్రరవే జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రజిత, మల్లేశ్వరి

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే)ఏడో మహాసభలు ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్లో జరగనున్నాయని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్ష కార్యదర్శులు అనిశెట్టి రజిత, కె.ఎస్ మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మంలోని శని, ఆదివారాల్లో స్త్రీలపై ట్రోలింగ్ అనే అంశంపై ఈ మహాసభల్లో చర్చ జరగనున్నాయని, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది సాహితీవేత్తలు, సామాజిక, ఉద్యమకారులు, జర్నలిస్టులు రెండు రోజులపాటు సమాజాన్ని కలవర పెడుతున్న స్త్రీలపై ట్రోలింగ్ అంశంపై చర్చించుతారని తెలిపారు. గత 15 ఏళ్లుగా సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారని, దీనివల్ల ప్రయోజనాలతో పాటు ట్రోలింగ్ వంటి అవాంఛనీయ ధోరణిలు పెరిగాయన్నారు. ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉన్నాయని పరిశోధనలు తేలిందని అన్నారు. ట్రోలింగ్ ఎంతగా సమాజంలో పాతుకు పోయిందో తెలుస్తుందన్నారు. సమాజంలో ఏ చెడు ధోరణి అయినా తలెత్తినప్పుడు దానికి ముందుగా బలి అయ్యేది స్త్రీలు, దళిత, మైనార్టీ, పీడిత అస్తిత్వాల వారిని అన్నారు. ఈ సమస్యని సూక్ష్మ స్థాయిలో అర్థం చేసుకోవడం కోసం ప్రజాస్వామ్యక రచయిత్రుల వేదిక స్త్రీలపై ట్రోలింగ్ మహాసభలో ముఖ్యాంశంగా తీసుకున్నామన్నారు. ఈ చర్చలు సారాంశాన్ని మరింత మందికి చేరవేయడానికి సహకరించాలని కోరారు. ఈ మహాసభలకు ఓల్గా, గంట చక్రపాణి, జి.ఎస్ రామ్మోహన్, రవి మారుత్ ,విమలక్క, సంధ్య, బైర్ నరేష్ ,యాంకర్ ఉదయభాను, ప్రొఫెసర్ సూర్య పల్లి సుజాత, తులసి చంద్, ఎన్ వేణుగోపాల్ ,ప్రొఫెసర్ కె సునీత రాణి, కృష్ణకుమారి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాత్యాయిని విద్మహే, కే.రామలక్ష్మి, జయ శ్రీ, రవి మారుత్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బ్యాంకులు జారీ చేసిన

లీగల్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-ఖమ్మం

పంట రుణాల వసూళ్ల కోసం బ్యాంకులు జారీ చేసిన లీగల్ నోటీసులు ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్ లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ పంట రుణాలు రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత బ్యాంకులు లీగల్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గం అన్నారు.

ఖమ్మం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లాలో అనేకమంది రైతులకు లీగల్ నోటీసులు జారీ చేసిందన్నారు. ఖమ్మం జిల్లాలో గ్రామీణ వికాస్ బ్యాంకుల పరిధి లో ఇతర జాతీయ బ్యాంకుల్లో సుమారు ఐదు వేల మంది రైతులకు



2014 రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ వివిధ కారణాల చూపి చేయలేదని అలాగే 2018 రైతు రుణమాఫీ కూడా అందులో కొందరు రైతులకు ఇంకా కాలేదని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్న సమయంలో బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు వరంగల్ నుంచి పంపించి రైతులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని రాంబాబు అన్నారు. గత రెండు సార్లు రుణమాఫీకి నోచుకోని రైతులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బ్యాంకు అధికారులు రైతులకు పంపించిన లీగల్ నోటీసులు ఉపసంహరించుకోనేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సాగర్ జలాలు విడుదల చేసి ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీరు అందించాలని, వాగులు, వంకలు, చెక్ డ్యాంలు, కుంటలు, చెరువులు నీరు లేక పశువులు కూడా దాహార్తి కి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కుంటలు చెరువులను సాగర్ జలాలతో నింపాలని కోరారు. పాలేరు పాత కాల్వ క్రింద వరి, మొక్కజొన్న పంటలకు సాగునీరు విడుదల చేయాలని కోరారు.

ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కర్ రావు, వాసిరెడ్డి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు ఎస్ కె మీరా, శీలం పకరిమ్మ, వనమా చిన్న సత్యనారాయణ, మల్లెంపాటి రామారావు, కోల్లేటి ఉపేందర్, శీలం సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నీలాద్రీశ్వర స్వామి ఆలయంలో సమీక్ష సమావేశం

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలం నీలాద్రీశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 8న జరుగనున్న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ప్రభుత్వ అధికారులకు కాంగ్రెస్ నేత మట్టా దయానంద్ సూచించారు. ఆలయ అభివృద్ధికి సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగమయి దయానంద్ నిరంతరం కృషి చేస్తారని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కరీముల్లా, వంకాయలపాటి వెంకటేశ్వరావు, చీకటి రామారావు, అలుగోజు చిన్న స్వామి, సోమరాజు సీతారామరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్న నరసింహారావు, పాల్గొన్నారు.

పీవీకి భారతరత్నతో తెలంగాణ సమాజం గర్విస్తుంది

ఎంపీ నామా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయప్రతినిధి

అద్భుతమైన పరిపాలనా ఆర్థిక సంస్కరణలతో తెలంగాణా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన తెలంగాణా ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు భారత ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం యావత్ తెలంగాణ సమాజం గర్విస్తుందని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవితాంతం రైతు సంక్షేమం కోసం కృషి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కు కూడా భారత రత్న ఇవ్వడం పట్ల ఎంపీ నామ సంతోషం వ్యక్తం చేశారు. పీవీకి భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేసీఆర్ నేతత్వంలో తెలంగాణా అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని నామ గుర్తు చేశారు. దేశం వేగవంతమైన వృద్ధిని సాధించడం వెనుక పీవీ ఆర్థిక సంస్కరణలు కీలక పాత్ర వహించాయని నామ పేర్కొన్నారు.

గ్యాస్ కనెక్షన్ డేటా ఎంట్రీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో ఇంజం అప్పారావు



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ప్రజా పాలన మహాలక్ష్మి పథకం దరఖాస్తులు ప్రతి లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో ఇంజం అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజా పాలన పథకాలకు సంబంధించి గ్యాస్ డేటా ఎంట్రీ ప్రక్రియను ఇంటింటికి తిరుగుతూ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాస్, ఎంపీఓ రాజేశ్వరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాజీ నాయక్, అంగన్ వాడీ సూపర్ వైజర్ బక్కమ్మ, సర్వే నిర్వాహకులు, అంగన్వాడీ టీచర్లు పప్పుల కవిత, పాల్గొన్నారు.

గృహ జ్యోతి పథకానికి రేషన్ కార్డ్, ఆధార్ కార్డు చూపించాలి

- విద్యుత్ శాఖ అధికారి ఏఈ రవికుమార్

తిరుమలాయపాలెం : గృహ జ్యోతి పథకానికి రేషన్ కార్డ్, ఆధార్ కార్డు చూపించాలని విద్యుత్ శాఖ అధికారి ఏఈ రవికుమార్ తెలిపారు. శుక్రవారం పిండిప్రోలు గ్రామంలో స్పాట్ బిల్లింగ్ ధృవీకరించారు. ఈ సందర్భంగా ఏఈ రవికుమార్ మాట్లాడుతూ విచారణకు వచ్చే సిబ్బందికి ప్రజా పాలన దరఖాస్తు రసీదు ఆహార భద్రత కార్డు రేషన్ కార్డు నెంబర్ ఆధార్ కార్డు నెంబర్ చూపాల్సి ఉంటుందని విద్యుత్ వినియోగదారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఒకవేళ ఏదైనా కారణం వల్ల సిబ్బంది అందుబాటులో లేనట్లయితే పైన తెలిపిన వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్, నాగరాజు, లైన్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్, జూనియర్ లైన్మెన్, ఉండేటి రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముద్దుబిడ్డకు 'భారతరత్న' అభినందనీయం

- తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక 'ఎన్టీఆర్' కూ ఇవ్వండి
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



నవతెలంగాణ-సత్తుపల్లి

బహుభాషా కోవిదుడు, తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న బిరుదును ఇవ్వడం అభినందనీయమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హర్షం వ్యక్తం చేశారు. తీవ్రవాదాన్ని రూపుమాపి సాంకేతికతకు బీజంపోసి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి పీవీఎన్ఆర్ అన్నారు. తెలుగువారు ప్రధానమంత్రి కావాలని అప్పట్లో నంద్యాలలో పీవీఎన్ఆర్‌పై ఎన్టీ రామారావు అభ్యర్థిని ప్రకటించకుండా ఆయన్ను గౌరవించారన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డకు ఇంతటి గౌరవం దక్కడం తెలుగు వారంతా గర్వించదగ్గ విషయమన్నారు.

తెలుగువారి ఆరాధ్యుడు ఎన్టీఆర్‌కూ భారతరత్న ఇవ్వాలి

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక, ఆరాధ్యుడైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్నను ఇవ్వాలని సండ్ర వెంకటవీరయ్య కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిపాలనలో తనదైన ముద్రవేసి సంక్షేమ రంగాన్ని సృష్టించి దేశ రాజకీయ చరిత్రలోనే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహానుభావుడు ఎన్టీ రామారావు అని సండ్ర కొనియాడారు. ఈ పార్లమెంట్ సమావేశాల ముగింపు లోపు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని ప్రధాని మోడీకి సండ్ర విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

ముదిగొండ.ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు చెల్లి బాబురావు అన్నారు. ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మం నయాబజార్ హైస్కూల్ గ్రౌండ్ లో జరిగే టిపిటిఎఫ్ రాష్ట్ర వైద్య విజ్ఞాన మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని వివిధ పాఠశాలలతోపాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

6

నవతెలంగాణ

ఖమ్మం

శనివారం | ఫిబ్రవరి 10, 2024 | www.navatelangana.com



గోవిందాపురం ఏ ప్రత్యేక అధికారిగా ఏవో సర్వసిద్ధి సరిత బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత శుక్రవారం అధికార బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు సర్వ శుద్ధి సరిత ను గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా భాగం శ్రీనువాసరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు క్రితం తనను గ్రామ సర్పంచ్‌గా ఎన్నుకొని ఐదు సంవత్సరాల పాటు తనను ఆదరించి, సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సరిత కూడా పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాగం పాపారావు, మెదరమెట్ల రాజారావు, వక్కంతుల నారయణరావు, భాగం మధుసూదనరావు, కాపూరి వెంకట్రావు, కాపూరి శంకర్రావు, కాపూరి జానర్ధనరావు, భాగం నాగేశ్వరరావు, గుండపనేనీ బాబు, షేక్ రంజాన్, వడ్డేబోయిన ఉపేంద్ర, అంగన్వాడీ టీచర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, ఇన్చార్జ్ సెక్రెటరీ జొన్నలగడ్డ పరశురాములు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిజం గెలవాలి' కార్యక్రమంలో పాల్గొనటానికి వెళ్లిన బోనకల్ టీడీపీ నాయకులు

నవతెలంగాణ-బోనకల్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించిన నిజం గెలవాలి కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం ల్లోని పెనుగంచిపోలు గ్రామానికి నారా భువనేశ్వరి శుక్రవారం వచ్చారు. దీంతో ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో బోనకల్ మండల తెలుగుదేశం నాయకులు కార్యక్రమంలో పాల్గొనటానికి భారీగా తరలి వెళ్లారు. సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రావుట్ల సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, నందమూరి సత్యనారాయణ, మైనేని రవికుమార్, మామిళ్ల నరసింహారావు మామిళ్ళ లోకేష్, సాదినేని కొండలరావు, కంచర చిన్నప్ప, యనమద్ది ఆదయ్య ఖమ్మం నాయకులు కేతినేని హరీష్, నున్నా నవీన్ చౌదరి, నల్లబోతు రంజీత్, సంద్ర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్

నవతెలంగాణ-తల్లాడ

కనీస వేతనం 26,000 చెల్లించాలంటూ, తమ న్యాయమైన కోరికలను తీర్చకపోతే సమ్మె చేస్తామంటూ, మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం తల్లాడ మండల విద్యాశాఖ అధికారి ఎన్. దామోదర్ ప్రసాద్‌కు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడారు. కార్మికులు అప్పుల పాలయ్యారన్నారు, పెంచిన గౌరవ వేతనం అందలేదని లేదని కోడిగుడ్ల బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు మంకని కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, సీనియర్ నాయకులు తమ్మారపు వెంకటేశ్వర్లు, ప్రకాష్‌రావు వెంకటమ్మ, నక్షత్రం, భాగ్యవతి, మరియమ్మ పద్మ కనకమ్మ, సత్యవతి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

నాణ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఏడీఏ విజయచంద్ర అన్నారు. మండల పరిధిలోని కొండాపురం, ముత్తగూడెం, ఎంవీపాలెం, పల్లెగూడెం, తీర్థాల గ్రామాల్లో ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. పీఓపీ యంత్రం ఉపయోగించి విక్రయాలు జరపాలన్నారు. గుర్తింపు ఉన్న కంపెనీల ఎరువులనే విక్రయించాలన్నారు. ఎంఆర్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ధరల పట్టికను దుకాణం ఎదుట ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-మధిర

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టౌన్ ఎస్ఐ రాజేష్ ఆదేశాల మేరకు వారి సిబ్బంది సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి జోలికి పోకూడదని అటువంటి వాటిని దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ కుమారి పి. కమల కుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, అధ్యాపక , అధ్యాపకేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-కల్లూరు

బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం గ్రామాలకు నిధులు కేటాయించడంతో సర్పంచులు ఎన్నో కష్టాలు పడి గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కొనియాడారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని లింగాల గ్రామంలో మామిడి తోటలో మాజీ సర్పంచులకు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి శాలవ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల తర్వాత పట్టిన మొట్టమొదటి బహిరంగ సభ నల్గొండలో జరుగుతుందని కెసిఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని ప్రజలు భారీగా తరలి కావాలని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సొసైటీ అధ్యక్షుడు పాలెపు రామారావు, లక్కినేని రఘు, కాటమనేని వెంకటేశ్వరరావు, కొరకప్పు ప్రసాద్, మేకల కృష్ణ, ఎంపీటీసీ సుబ్బారావు, సింగి సాల ప్రసాద్, దేవరపల్లి నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా సుశీల భాయ్

నవతెలంగాణ-కామేపల్లి



నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా సుశీల భాయ్‌ని ఎన్నిక చేసినట్లు ఆమె శుక్రవారం తెలిపారు. రాష్ట్ర నంగరా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు. జనవరి 21 నా పాత కమిటీలను రద్దు చేస్తూ ఈనెల 8 న కొత్త కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పుట్టగంటి శ్రీనివాస్ చౌహాన్ నాయక్, దారావత్ గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా, బానోత్ శంకర్ నాయక్, పరశురాం నాయక్, జలందర్ నాయక్, చక్రవర్తి నాయక్, పాల్గొని జాతిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నూతనంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా విభాగంలో అజ్మీర సుశీల బాయ్‌ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర సుశీల భాయ్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి సభ్యుల సమస్య పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

30 కేజీల గంజాయి స్వాధీనం

- ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్, కొత్త బస్సు స్టాండ్ వద్ద శుక్రవారం తనిఖీలు చేయగా మహారాష్ట్ర కి చెందిన ముగ్గురు వ్యక్తులు వద్ద నుండి 30.5 కేజీల ఎండు గంజాయిని, 2 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు. వీరిని విచారించగా ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు ఎండు గంజాయిని తీసుకువెళ్లే క్రమంలో ఖమ్మం వద్ద అధికారులు ఇద్దరు మహిళలతో సహా ఒక వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూపాయలు 8 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐలు ముబాషీర్ అహమ్మద్, సిబ్బంది బాలు, హరీష్, వెంకట్, సుదీర్, హన్మంత్ రావు, విజయ్ స్వరూప, బేబీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ వైఖరితో పత్తి రైతు చిత్తు..



- సీసీఐపై దళారుల పెత్తనం
- ఇచ్చిందే లెక్క..చెప్పిందే ధర అన్నట్లు మిల్లు యాజమాన్యం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలోని భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లు నందు కొత్త రకం మోసానికి మిల్లు యాజమాన్యం పాల్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దిగుమతి చేసుకోకుండా కింటాకు 5 నుంచి 10 కేజీల తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు మిల్లు వరకు వచ్చిన పత్తిని మిల్లు యాజమాన్యం, సీసీఐతో కుమ్మక్కై, పత్తి, తేమ, నాణ్యత లేదని సాకులు చెబుతూ ధర తగ్గిస్తున్నారని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం వల్లనే ఇటువంటి మోసాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, రైతుల అవసరాలు ఆసరాగా చేసుకుని వేబ్రిడ్జి పెట్టక ముందే ఒక క్వింటాకు 3 నుంచి 5 కేజీల తార తీసి డబ్బులు తక్కువ ఇస్తున్నారని రైతుల మండిపడుతున్నారు. మరోవైపు దళారులు కొత్తరకం మోసానికి పాల్పడుతూ.. సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తే డబ్బులు ఆలస్యంగా వస్తాయని, తామైతే వెంటనే ఇస్తామని రైతులను మభ్య పెడుతున్నారు. దళారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఏటువంటి సాకులు లేకుండా పట్టా పాస్ పుస్తకాలతో తిరిగి సీసీఐ కేంద్రాల్లోనే అధిక ధరకు విక్రయించి లబ్ధి పొందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించిన రైతుల జాబితా పరిశీలిస్తే విషయం తెలిసిపోతుంది. పత్తి పంట సాగు చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతుల పాసుపుస్తకాలతో దందా చేస్తున్నారు.

మిల్లు యాజమాన్యం, సీసీఐపై చర్యలు తీసుకోవాలి

బత్తుల రాధాకృష్ణ(రైతు)



ఆరుగాలం కష్టపడి పంట పండించి పత్తి విక్రయించడానికి పాతర్లపాడు గ్రామంలోని భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లుకు తీసుకు వచ్చాను. పత్తిని తేమ, నాణ్యత సాకుతో పత్తిని కొనుగోలు చేయమని బయట ఎక్కడైనా విక్రయించుకోండని దురుసుగా ప్రవర్తించారు. కింటాకు అనధికారికంగా 3 నుంచి 5 కేజీల తార తీసి డబ్బులు ఇస్తున్నారు. మిల్లు యాజమాన్యంపై, సీసీఐపై చర్యలు తీసుకోవాలి.

స్లాట్ బుకింగ్ అంతరాయంపై వికలాంగుల ఆందోళన

- మండల కేంద్రాలలో సదరం క్యాంపులు నిర్వహించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కారేపల్లి



మండలంలో వికలాంగులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనకు దిగారు. సదరమ్ క్యాంపులో ప్రవేశం కోసం ముందస్తుగా మీసేవాలో దివ్యాంగులు స్లాట్ బుకింగ్ ప్రక్రియను చేయాల్సి ఉంటుంది. కారేపల్లి మండలానికి చెందిన దివ్యాంగులు గురువారం మీ సేవా సెంటర్‌కు ఉదయమే చేరుకుని క్యూలో నిల్చున్నారు. మీ సేవాలు తీసిన అనంతరం ఉదయం 11 గంటల వరకు స్లాట్ బుకింగ్ ఓపెన్ కాలేదు. 11 గంటలకు ఓపెన్ కావటం ముగ్గురికి స్లాట్ బుకింగ్ కావటం మళ్లీ బుకింగ్ ఆగిపోయింది. దీంతో దివ్యాంగులు ఇబ్బదులు పడ్డారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర లు మీ సేవా సెంటర్ కుచేరిన దివ్యాంగుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రతి సారి మీ సేవాకు రావటం స్లాట్ బుకింగ్ కాక వెనుతిరగటం అవుతుందని వికలాంగులు తెలిపారు. దీనిపై కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. స్లాట్ బుకింగ్ అంతరాయన్ని నివారించాలని, ఆందోళన వద్దకు అధికారులు రావాలని డిమాండ్ చేశారు. ఆందోళనను ఉద్దేశించి సీపీఎం నాయకులు కొంజెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర లు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌లో కోసం దివ్యాంగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఒక్కక్కరు స్లాట్ బుకింగ్ కోసం నాల్గుఐదు విడుతల మీ సేవ కేంద్రానికి వచ్చినా బుకింగ్ కావటం లేదన్నారు. దివ్యాంగుల నిస్సయతను దృష్టిలో పెట్టుకోని సదరం క్యాంపులను మండల కేంద్రాలలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.దివ్యాంగులను గుర్తిస్తే ఫించన్ భారం ప్రభుత్వంపై భారం పడుతుందని ప్రభుత్వమే స్లాట్ బుకింగ్‌కు అంతరాయాలు కల్గిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ అందోళనకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్ సంఘీభావం ప్రకటించారు. ఆందోళన వద్దకు సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై పుష్పాల రామారావు చేరుకోని ఆందోళన విరమించాలని కోరారు. లతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని విడుదల చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ కింద అనేక గ్రామాలలో యాసంగి కింద మొక్కజొన్న పంట సాగు చేశారని తెలిపారు. కానీ సాగర్ నీరు లేక మొక్కజొన్న పంట ఎండిపోతుందని పేర్కొన్నారు. అదేవిధంగా అనేక గ్రామాలలో బావులు, చెరువులు అడుగంటుతున్నాయని తెలిపారు. వేసవికాలం సమీపిస్తుండటంతో నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సాగర్ నీటిని విడుదల చేసి మండలంలో గల చెరువులన్నింటిని నింపాలని ఆయన కోరారు.

ఏఏఆర్ఎం జాతీయ కమిటీ సభ్యుడిగా భూక్య వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండలంలోని కస్నాతండా గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు, సీపీఐ(ఎం) నేత భూక్య వీరభద్రం ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఏఏఆర్ఎం) జాతీయ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాలు న్యూఢిల్లీలోని ఏకే భవన్ నందు గురువారం జరిగాయి. ఈ సమావేశాల్లో తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి,ఉద్యమ నేత భూక్య వీరభద్రంను జాతీయ కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రంకు పలువురు గిరిజన నేతలు,సిపిఎం నాయకులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ఖమ్మం రూరల్ మండల గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భానోత్ శ్రీను, భూక్య నాగేశ్వరరావు, మల్సూర్, బోడ మోహన్ తదితరులు ఉన్నారు.

మోటమర్రి రైల్వే స్టేషన్‌కు మహర్దశ

నవతెలంగాణ-బోనకల్



కేంద్ర ప్రభుత్వం మేరా రైల్ ఓవర్ రైల్ పేరుతో ఏర్పాటుచేసిన మోటుమర్రి - విష్ణుపురం మధ్య డబుల్ లైన్, మోటుమర్రి వద్ద రైల్ ఓవర్ రైల్‌కు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది.ఈ ప్రాజెక్టు రూ.1,746.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వలన ప్రస్తుత లైన్ సామర్థ్యాన్ని పెంచుతూ రైళ్ల వేగం, సమయపాలన, వ్యాగన్ టర్న్ రౌండ్ టైమ్‌లో మెరుగుదలకు దారితీస్తుంది. దీని ద్వారా రైళ్ల రాకపోకల రద్దీని నియంత్రించడానికి, రైళ్ల రవాణాను పెంచడానికి ఎంతో దోహదపడుతుంది. ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ మోటుమర్రి - విష్ణుపురం మధ్య గల 88.81 కి మీల రైల్వే లైన్ డబ్లింగ్, మోటుమారి వద్ద 10.87 కి మీల మేర రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టు కు ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులకు దాదాపు రూ 1,746.20 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదించబడ్డాయి. మోటమర్రి రైల్వే స్టేషన్లకు ఆర్‌ఓబి బ్రిడ్జి కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. మోటమర్రి రైల్వే స్టేషన్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంతో కాలం నుంచి మోట మరి రైల్వే స్టేషన్లో ఆర్‌ఓబి బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ వస్తున్నారు. నేటితో ఆ ప్రాంత ప్రజల కోరిక నెరవేరనున్నది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో విస్తరించిన ఈ ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టు వలన మోటమర్రి రైల్వే స్టేషన్లో పాటు బోనకల్ రైల్వే స్టేషన్ కూడా అభివృద్ధి చెందటానికి ఎంతో దోహదం చేస్తుంది.

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 16వ తేదీన భారత దేశ వ్యాప్తంగా జరిగే సమ్మె, గ్రామీణ బందును జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు కోరారు. శుక్రవారం వైరా మండలం రెబ్బవరం గ్రామంలో సిపిఐ(ఎం) రూరల్ మండల కమిటీ సమావేశం బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడారు. ఈనెల16వ తేదీన భారత దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలుకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెను వైరా మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు, కార్మికులు, కర్షకులు, మేధావులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, వ్యవసాయ కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు, కమిటీ సభ్యులు బాజోజు రమణ, షేక్ జానిమియా, చిత్తారు నాగరాజు, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, ఆహ్వానితులు ప్రేమ్ కుమార్, యనమద్ది రామకృష్ణ, మేడా శరాబంధి, సామినేని వెంకటేశ్వరరావు అలియాస్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తూ ప్రజలపై భారాలు మోపుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆ పార్టీ సభ్యురాలు చెరుకు కుమారి అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో పాండురంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, చావా రమేశ్, వలీ, వెంకట్రావు, పాకలపాటి ఝాన్సీ పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో...

ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టరును అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సత్తుపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యేబు, అమర్లపూడి శరత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, రాము, శరత్, వలీ బాషా పాల్గొన్నారు.

నేలకొండపల్లి : ఈనెల 16న అఖిలపక్ష పార్టీలు, ప్రజా సఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల జనరల్ బాడీ సమావేశం సంఘం మండల నాయకులు గండారపు రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పగిడికత్తుల నాగేశ్వరరావు మా ట్లాడారు. ఈ సమావేశంలో భవ నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు మేకల ప్రసాద్, చిలకల చిలక వెంకటేశ్వర్లు, శ్రీను పల్లపు శ్రీను, నరసింహారావు, లక్ష్మణ్, రాము, రత్నం, రామారావు, బాబు, పుల్లయ్య, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : ఈనెల 6వ తేదీన జరిగే జాతీయ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని వైరా రూరల్ మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరావు, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ నాయకులు కోట ప్రేమ్ కుమార్ అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి అంగన్వాడీ టీచర్స్, ఆయాలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.

కారేపల్లి : బీజేపీ మతతత్వ పోకడలతో దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. శుక్రవారం కారేపల్లిలో గాదె లక్ష్మినారాయణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తోట రామాంజనేయులు మాట్లాడారు. శ్రామికుల సమస్యలపై ఈనెల 16న జరగున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కారేపల్లి మండల సీపీఐ కార్యదర్శి బోళ్ళ రామస్వామి, నాయకులు చెరుకూరి నరసయ్య, చింతల హనుమంతు, వాంకుడోతు కౌసల్య, ఇస్లావత్ బావుసింగ్, నూకల వీరయ్య, కనకరాజ్, అడ్డగోడ రమేష్, తురక మల్లేష్, కొండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి నమోదు పరిశీలన

నవతెలంగాణ-తల్లాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రాజెక్ట్ అండ్ విజిలెన్స్ జీఎం జి .నాగప్రసాద్ ముద్దునూరు, తల్లాడ గ్రామాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరినీ నమోదు చేయాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, పథకం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ వెంకటేశ్వర్లు, ఏడిఈ ఖాదర్ బాబా, సిబ్బంది పాల్గొన్నారు.



అట్టహాసంగా స్మార్ట్ కిడ్జ్ క్రీడా సంబురం ప్రారంభం

- క్రీడా పోటీలు నైపుణ్యాలను పెంచుతాయి

- జడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజ్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత పాఠశాల విద్యార్థులు ఫ్లాగులతో నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ అందరిని ఆకట్టుకుంది. ముఖ్య అతిథి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తాయన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి వారు ఉన్నతంగా ఎదిగేలా దోహదపడతాయన్నారు. ప్రతి పోటీలో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని బహుమతులు సొంతం చేసుకోవాలని కోరారు.స్మార్ట్ కిడ్జ్ లో విద్యార్థులను చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, వైజ్ఞానిక అంశాల్లో ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులను ఆల్రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాలకు సంపూర్ణ సహకారాన్ని అందించడం అభినందనీయమని వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతి ప్రతిభను అన్ని అంశాల్లో వెలికితీయడానికి తమ పాఠశాల నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. తొలుత లింగాల కమల్ రాజ్ జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, కోకో, హర్డిల్స్, టెన్నికాయిడ్, అథ్లెటిక్స్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం శాలువా, జ్ఞాపకలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య , ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జీఎం బృందం

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ వివరాలు అందజేత



నవతెలంగాణ-ఇల్లందు

ఎస్పీ రోహిత్ రాజును శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ కలిశారు. వారికి ఏరియా జీఎం ఇల్లందు ఏరియాలోని గనుల వివరాలను, రోజువారీ బొగ్గు ఉత్పత్తి వివరాలను తెలియజేశారు. తదుపరి ఈ నెల 15న ప్రాజెక్ట్ ఆఫీస్, కోయగూడెం నందు వార్షిక ఉత్పత్తి 2.0 మిలియన్ టన్నుల నుండి 3.0 మిలియన్ టన్నులకు పెంచినందున పర్యావరణ, అడవి, వాతావరణ మార్పు మంత్రి శాఖ(ఈసి) నుండి అనుమతి కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ వివరాలను ఎస్పీకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ కిశోర్, సెక్యూరిటీ గార్డ్ రతన్ కుమార్ పాల్గొన్నారు.

డెంటల్ మిషన్ రిపేర్ నిమిత్తం లేళ్ల ఆర్థిక సాయం



నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని పీహెచ్ఎస్సీ హాస్పిటల్ నందు డెంటల్ పరికరం పాడైపోయి హాస్పటల్లో ప్రజలకు డెంటల్ సేవలు నిలిచి పోగా విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, సొసైటీ చైర్మెన్ లేళ్ళ వెంకట్ రెడ్డి హాస్పిటల్ సిబ్బందితో మాట్లాడి రిపేర్ నిమిత్తం రూ.15 వేల, మిషన్ పరిధిలో అవసరమైన ఒక చైర్‌ను హాస్పిటల్‌కు అందించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మండలంలో అనేక సేవలను అందించిన లేళ్ళ వెంకట్ రెడ్డిని హాస్పటల్ సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, పెద్దలు తదితరులు ఉన్నారు.

కుష్టు వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కుష్టు వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుష్టు వ్యాధి నిర్మూలలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం, దుమ్ముగూడెం వైద్యాధికారుల సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వైద్యాధికారి సివి సత్యనారాయణ, డీపీఎంవో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జిడిఎల్వీ సాగర్, కరుణ, వీరభద్రం, ధర్మయ్య, రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓ మల్లెల శ్రీనివాసరావు కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి సన్మానం

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని బిల్లుడు తండా గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గలకను శాలువాతో ఉద్యోగులు శుక్రవారం సన్మానించినట్లు తెలిపారు. గ్రామానికి, పంచాయతీ అభివృద్ధికి కృషిచేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హతిరాంనాయక్, ఉపాధ్యక్షులు భుక్యా రాంజీ నాయక్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్ వాడి టీచర్లు సరోజ, పూర్ణ, అమ్మి, సుగుణ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను సందర్శించిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని చిననల్లబల్లి, కొత్త దంతెనం గ్రామ పంచాయితీలలో గల నర్సరీలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూధన్ రాజు శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. నర్సరీలలో కలుపు మొక్కలను గుర్తించి తొలగించాలని, విత్తనాలు మొలకెత్తని ప్రాంతాల్లో కొత్త విత్తనాలు నాటాలని సూచించారు. ఉదయం, సాయంత్రం -సమయాలలో మొక్కలకు నీరు అందించి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, ఈజీఎస్ ఏపీవో సుకన్య గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊరూరా ఉపముఖ్యమంత్రి క్యాలెండర్‌లు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క-నందిని దంపతుల చిత్రాలతో ముద్రించిన 2024 సింగిల్ పేజీ క్యాలెండర్‌ను కాంగ్రెస్ శ్రేణులు ఊరూరా పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం పార్టీ నియోజక వర్గం సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు నేతృత్వంలో మండలంలోని మారుమూల గ్రామాల్లో క్యాలెండర్‌ను పంపిణీ చేస్తు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రచారం చేస్తున్నారు. అనంతారం, గాండ్లగూడెం,తిరుమలకుంటల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.కే పాషా, ఎంపీటీసీలు వేముల భారతి ప్రతాప్, సత్యవరుపు తిరుమల బాలగంగాధర్‌లుతో పాటు స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, లచ్చు, దుర్గారావు, మరియమ్మ, సోబన్, బన్నులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

తమ సమీప బంధువులకు చెందిన ఖర్మ కాండల కోసం వెళ్ళి తిరిగి ద్విచక్ర వావానం పై ఇంటికి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున గౌరవరం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మడలంలోని అడవిరామవరం గ్రామానికి చెందిన నూపా రామకృష్ణ (32) గౌరవరం గ్రామంలో గురువారం జరిగిన ఓ కర్మకాండలకు వెళ్ళాడు. సమీప బంధువులు కావడంతో రాత్రి వరకు అక్కడే ఉండి రామకృష్ణ రాత్రి ఇంటికి అడవిరామవరం తిరుగు ప్రయాణమయ్యాడు. గౌరవరం మూలమలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న నీటి కుంటలో పడి పోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. ఈ విషయాన్ని రాత్రి ఎవరూ గుర్తించకపోవడంతో సహాయం అందించే వారు కూడా లేక పోవడంతో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి మృతదేహాన్ని పరిశీలించగా అడవి రామవరంకు చెందిన రామకృష్ణగా గుర్తించారు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ సంతానం ఉన్నారు. దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వాంకుడోత్ కోబల్ అన్నారు. శుక్రవారం బావోజీ తండా గ్రామపంచాయతీ పరిధిలో రైతులతో నిర్వహించిన రైతు సంఘం శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భూక్య కేమియా, గణేష్, రత్ని, బోడా కమ్లి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర మొండి వైఖరి నశించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శ్రీధర్

నవతెలంగాణ-చంద్రుగొండ

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. కేంద్రం కక్షపూరిత, విధానం అనుసరిస్తుందని కేరళ, ఎల్డీఏ, ప్రభుత్వాలపై గవర్నర్లు బీజేపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, దాసరి సీతారాములు, రాయి రాజా, అయ్యన్నపాలెం శాఖ కార్యదర్శి చల్లపల్లి రాజా, కాక హనుమంతరావు, మహిళ సంఘం నాయకురాలు జైతూని బేగం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించే ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలోని సారపాకలో గోదా వరి బ్రిడ్జి కింద ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సారపాకలో గోదావరి బ్రిడ్జి కింద కొందరు వ్యక్తులు ఇసుకను లోడ్ చేసేందుకు ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచగా ఈ సమాచారం అందుకున్న ఎస్సై రాజ్ కుమార్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇసుక లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాసాని ఐలయ్యను సత్కరించిన కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రముఖ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్యను ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. శుక్రవారం పాత పాల్వంచలో కొత్వాల స్వగృహానికి మర్యాదపూర్వకంగా వచ్చిన సందర్భంగా కాసానిని ఆహ్వానించి శాలువాతో కొత్వాల సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, సీపీఐ(ఎం) నాయకులు అన్నవరపు సత్యనారాయణ, నాయకులు జునుమాల నగేష్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పారితోషకాలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ధర్నా





నవతెలంగాణ-పాల్వంచ

ఆశా వర్కర్లకు రెండు నెలల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ యూనియన్ సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు డిసెంబర్, జనవరి రెండు నెలల పారితోషకాలు ఇంకా రాలేదని, గతంలో ప్రతి నెల రెండో తేదీన పారితోషకాలు ఆశ వర్కర్ల అకౌంట్లో పడేవన్నారు. కానీ ఇప్పుడు రెండు నెలలు దాటినా ఆశ వర్కర్లకు నేటికీ పారితోషకాలు అకౌంట్లో పడటం లేదని అవేదన వ్యక్తం చేశారు. పారితోషకాలు నెలల తరబడి రాకపోవడంతో కుటుంబాల అవసరాల కోసం అప్పుచేసి బతకవలిసిన దుర్భర పరిస్థితి ఆశ వర్కర్లకను నెట్టివేయబడుతున్నారన్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వీరికి నేటికీ కనీస వేతనం లేదనీ, కనీసం ఫిక్స్ వేతనం కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయం చేయలేదన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మళ్ళీ సమ్మె చేసే పరిస్థితులు వస్తున్నాయని నూతన ప్రభుత్వానికి గుర్తు చేశారు. పారితోషకం లేని అభయహస్తం, మహాలక్ష్మి తదితర ప్రభుత్వ అదనపు పనులు ఆశలతో చేయించకూడదని, ఏఎంసీ డెలివరీలను పేరుతో టార్గెట్ పెట్టి ఆశలను భయభ్రాంతులకు గురి చేస్తున్న విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. సమ్మె సందర్భంగా అక్టోబర్ 9 అధికారులు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, గద్దల శీను, సహాయ కార్యదర్శి కే.సత్య, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఝాన్సీ, కార్యదర్శి ధనలక్ష్మి, జయ రుక్మిణీ, హేమ, సుశీల, భాగ్య, రమణ, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య

- పరారీలో నిందితులు



నవతెలంగాణ-బూర్గంపాడు

పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని మోతే పట్టీనగర్లో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై రాజ్ కుమార్ వెల్లడించారు. మండలంలోని సారపాక గ్రామానికి చెందిన గజ్జల ప్రవీణ్ కుమార్ అలియాస్ గజ (23)కు అదే గ్రామానికి చెందిన గుమ్మడి సతీష్, అఖిల్, జేమ్స్, మౌలు లక్కీలకు గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. పాతకక్షల నేపథ్యంలో ఎలాగైనే ప్రవీణ్ కుమార్‌ను అడ్డు తొలగించుకోవాలని, శుక్రవారం పథకం ప్రకారం ఆ నలుగురు వ్యక్తులు కలిసి మోతే పట్టీనగర్ గ్రామంలో కాపు కాసి ప్రధాన సెంటర్లో కర్రలతో ప్రవీణ్ కుమార్ తలపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ క్రమంలో తీవ్ర గాయాలకు గురైన ప్రవీణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సమాచారం అందుకున్న ఎస్సై రాజ్ కుమార్, భద్రాచలం సీఐ నాగరాజురెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని ఈహత్యకు గల గల కారణాలపై విచారణ చేపట్టారు. ఈసంఘటన తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ప్రవీణ్ కుమార్ జిల్లాలో పలు పోలీసే స్టేషన్లలో దొంగతనం, కొట్లాట కేసుల్లో నిందితునిగా ఉన్నాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని తల్లి గజ్జల అలివేలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేలరాలిన ఎర్రమందారం

- అనారోగ్యంతో కుంజ కృష్ణ కుమారి మృతి
- నివాళి అర్పించిన సీపీఐ(ఎం) నాయకులు





నవతెలంగాణ-మణుగూరు

ప్రజా సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు, మడమ తిప్పని పోరాటపటిమ గల నాయకురాలు కుంజా కృష్ణ కుమారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. పేద ప్రజలు ఆమెను మల్లు స్వరాజ్యంగా పిలుచుకునే కష్ణకుమారి మరణ వార్త తెలియగానే సీపీఐ(ఎం) పార్టీ శ్రేణులులకు దిగ్భ్రాంతి గురిచేసింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు ఏజే రమేష్, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు తదితరులు ఎర్ర జెండా కప్పి, పూల మాలతో విప్లవ జోహార్లు అర్పించారు. కామ్రెడ్ కుంజ కృష్ణకుమారి అంచలంచెలుగా సీపీఐ(ఎం) నాయకురాలుగా ఎదిగారని, మావోయిస్టు, ఇతర రాజకీయ పార్టీలు ఆర్థికంగా మానసికంగా ఇబ్బందుల గురిచేసినా ఆమె సీపీఐ(ఎం) లోనే ఉద్యమాలు నిర్వహించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. మావోయిస్టు కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసి చిత్రహింసల గురిచేసిన మొక్కవోని దీక్షతో సీపీఐ(ఎం) పార్టీని ఆమె ముందు నడిపించారు. మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలుగా, సీపీఐ(ఎం) పినపాక డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలుగా, పగిడేరు సర్పంచ్‌గా, రెండుసార్లు ఎంపీటీసీగా ప్రజలకు అనేక రకాల సేవలు అందించారు.

14 గ్రామ పంచాయతీలలో ఏ గ్రామంలో సమస్యలు ఉన్నా ప్రజలు ఇబ్బందులతో బాధపడుతున్నా పరిశీలించి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలలో అధికారులను సమస్య పరిష్కారం అయ్యేవరకు నిలదీసేవారు. సహచర సభ్యులతో పాటు అధికారులు కూడా ఆమె పోరాట పటిమను కొనియాడేవారు. నాయకులు ఎం.జోతి, ఎ.పద్మ ఎస్.లక్ష్మి వి.వాణి, నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కోడిశాల రాములు, కార్యదర్శివర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సత్ర పల్లి సాంబశివరావు, ఉపతల నరసింహారావు, బొల్లం రాజు, పగిడేరు శాఖ కార్యదర్శి పర్షిక పాపారావు, శాంతినగర్ కార్యదర్శి తాళ్లపల్లి ఉప్పలయ్య గౌడ్‌తోట పద్మా, కొండ్రుగౌరీ, కంజా ప్రసాద్, భూషణం తదితరులు జోహార్లు అర్పిచారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి

- 'విద్యా సంస్థల్లో లింగ వివక్షత' సెమినార్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి





నవతెలంగాణ-కొత్తగూడెం

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యాసంస్థల్లో లింగ వివక్షతకు తావులేకుండా ఉండాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం "విద్యా సంస్థల్లో లింగ వివక్షత" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు జిల్లా గర్ల్స్ కన్వీనర్ భవ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.జ్యోతి హాజరై మాట్లాడుతూ అమ్మాయిలు సైన్స్, ఇంజినీరింగ్, మెడికల్, టెక్నాలజీ రంగాల్లో రాణించాలని అన్నారు. ఆడపిల్లలు బాల్యవివాహాలు, ఇంటిపని, చదువులేకపోవడం, దోపిడీ, హింస, లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సమాజంలో లింగ వివక్షత వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. లింగ సమానత్వంకై, ఐక్యతకై పని చేయాలన్నారు.

అమ్మాయిలు చదువుల్లో రాణించాలి : సింగరేణి ప్రిన్సిపల్ శారద

అమ్మాయిలు చదువుల్లో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శారద అన్నారు. చదువులతో పాటు సమాజ గమనం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యా అభిమన్యు, సందీప్, నాగకృష్ణ, జిల్లా నాయకులు రామ్ చరణ్, లక్ష్మీ, పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి

- కేంద్ర మాజీ మంత్రి



నవతెలంగాణ-టేకులపల్లి

కాంగ్రెస్ పార్టీతోనే దేశం పాటు తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ శుక్రవారం అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపిస్తారన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుండి తానే పోటీలో ఉంటానని ఆశాభావము వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేశానని, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీగా టిక్కెట్ నాకే వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య దేవనాయక్, గుండా నరసింహారావు, నర్సింగ్ లక్ష్మయ్య, కె.నర్సయ్య, టేకులపల్లి మాజీ సర్పంచ్ బోడ సరిత, రెడ్యా, సంజయ్,బోడ మంగీలాల్ నాయక్, మూడ్ గణేష్, భూక్య ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- ప్రగతి నివేదికలు చదివి వినిపించిన అధికారులు



నవతెలంగాణ-పినపాక

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

మార్చి 3, 4, 5న విప్లవ కమ్యూనిస్టుల ఐక్యత మహాసభలు

- గోడ పత్రికలు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి



నవతెలంగాణ-ఇల్లందు

మార్చి 3, 4, 5న ఖమ్మం జిల్లాలో భారీ బహిరంగ సభను మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు భవనంలో మహాసభకు ముద్రించిన వాల్పోస్టర్లను ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పాల్గొని మాట్లాడుతూ భారత దేశ కమ్యూనిస్టు చరిత్రలో కమ్యూనిస్టులు చీలిపోవడమే చూసాం, కానీ నేడు దానికి భిన్నంగా ఈ దేశంలో గురుతర బాధ్యత కలిగిన సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో పీసీసీ సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల్ ఆర్ఐ, విప్లవ పార్టీలు ఒక్కటిగా కలిసిపోయాయని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. ఈ మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఒకటైన సందర్భంగా ఐక్యత మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాచర్ల సత్యం, బుర్ర వెంకన్న, పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పథ్వి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

- మనస్థాపంతో బలవన్మరణం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని అనంతోగు గ్రామానికి చెందిన తాటి శ్రావణి (19) గురువారం క్రిమిసంహారక మందు తాగగా, కుటుంబ సభ్యులు 108 వాహనంలో తీసుకెళ్లి కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. కొత్తగూడెంలో చికిత్స పొందుతున్న శ్రావణి పరిస్థితి విషమించడంతో గురువారం అర్ధరాత్రి దాటాక మృతి చెందినట్లు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎస్సై కథనం ప్రకారం.. శ్రావణి మనస్థాపంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు : ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక

మండలంలో గల 23 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి, ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీఓ వెంకటేశ్వర రావు సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బోటి గూడెం, ఎల్చిరెడ్డిపల్లి, బయ్యారం, సీతంపేట, పినపాక గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సెక్రటరీలు జైపాల్ రెడ్డి, జ్యోతి, అశోక్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రమైన బూర్గంపాడు గ్రామానికి చెందిన కొండా సురేంద్ర అనే యువకుడి వైద్య అవసరాల నిమిత్తం మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో రూ.11వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. కొండా సురేంద్ర ఒంట్లో పలు అవయవాలు దెబ్బతిని ఖమ్మం ప్రశాంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితే గానీ డొక్కాడని సురేంద్ర కుటుంబ సభ్యులు సహాయం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో విషయం తెలుసు కున్న చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ యువకుడికి సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ కైపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి (సెక్రెటరీ) జక్కి రెడ్డి మల్లారెడ్డి, సహాయ కార్యద ర్శి గాదె నర్సి రెడ్డి, యర్రావుల శివ, శనగ మల్లే శ్వరరావు, కైపు రామచంద్రారెడ్డి, బిజ్జం వెంకట్రా మిరెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, ట్రస్ట్ తరుపున రూ.10 వేలు, అదేవిధంగా ట్రస్టు సభ్యుడు శివ మరొక రూ.11 వేలు వారి కుటుంబానికి వారి నివాసం వద్దకు వెళ్ళి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తోకల సతీష్ వారి యువ సైన్యం పాల్గొన్నారు. చేయూత ట్రస్ట్ వారికి సురేంద్ర కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

విద్యతో పాటు క్రమశిక్షనే ఉన్నతికి తొలిమెట్టు

- ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్‌లో సాహితి కళాశాల డైరెక్టర్ నాగిరెడ్డి



నవతెలంగాణ-ఇల్లందు

విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షనే ఉన్నతికి తొలిమెట్టని సాహితి కళాశాల డైరెక్టర్ ఎంసీ నాగిరెడ్డి అన్నారు. పట్టణంలోని సాహితి కళాశాలలో శుక్రవారం ఫేర్వెల్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏ స్థాయికి ఎదిగిన తల్లిదండ్రుల రుణాన్ని మర్చిపోకూడదని సూచించారు. భవిష్యత్తు బంగారు బాట కోసం నిరంతరం కృషి చేస్తారని తల్లిదండ్రుల అభిప్రాయాలను, సూచనలు, సలహాలు, జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తులో ఎన్నో విజయాలను సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు, పుట్టిన ఊరుకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులుగా విశ్వశాంతి హై స్కూల్ ప్రిన్సిపాల్ తుమ్మలపల్లి ప్రసాద్, మార్గదర్శని హై స్కూల్ ప్రిన్సిపాల్ అర్వపల్లి రాధాకృష్ణ, సాహితి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అధ్యాపక అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఇంటింటి సర్వే

- పరిశీలించిన ఆర్డీఓ శిరీష

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశానుసారం ఇటీవల జరిగిన ప్రజా పాలన 6 గ్యారంటీల గ్రామ సభలలో గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల గ్యాస్ కనెక్షన్ కన్జ్యూమర్ ఆన్‌లైన్ ప్రక్రియ ఇంటింటి సర్వేను శుక్రవారం ప్రారంభించారు. ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు జరుగుతున్న అన్ని గ్యాస్ కనెక్షన్ల ఇంటింటి సర్వే టీమ్‌లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సంబంధిత ధృవపత్రాలు పరిశీలిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని బర్మాక్యాంపులో నిర్వహించిన సర్వేలో ప్రత్యేక అధికారులు కొర్సా కుమారి, ఆర్పీ చంద్రకాంత, ఆశ రామసీతలు పాల్గొన్నారు.

ఆర్డీఓ పరిశీలన : చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీ, ఎన్‌కే. నగర్‌లో జరిగిన సర్వే కార్యక్రమాన్ని కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిని శిరీష సందర్శించారు. ఈ ఆన్లైన్ ప్రక్రియ శనివారం సాయంత్రం నాటికి త్వరితగతిన పూర్తి కావాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు బి.భూమిక బొంతు బాబురావు, పంచాయతీ సిబ్బంది, బిల్ కలెక్టర్‌లు సురేష్, వంశీ, నిఖిల్ తదితరులు ఉన్నారు.

భద్రాచలం రూరల్ పట్టణంలోని విద్యుత్ మీటర్ రీడింగ్‌తో పాటు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు విద్యుత్ అధికారుల బృందం పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించి నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అశోక్ నగర్ కొత్త కాలనీలో నిర్వహించిన లబ్ధిదారుల నమోదు ప్రక్రియలో విద్యుత్ శాఖ ఏడీఏ వేణు పాల్గొని విద్యుత్ వినియోగదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకానికి నేటి నుండి లబ్ధిదారుల ఎంపిక ప్రారంభిస్తున్నామని విద్యుత్తు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొంతిల్లు లేకుండా అద్దెకు ఉన్న లబ్ధిదారులు కూడా ఈ పథకం వర్తిస్తుందని ఏడీఏ స్పష్టం చేశారు.

ఇల్లందు గత నెలలో నిర్వహించిన ప్రజాపాలన మహాలక్ష్మి పథకానికి అనేక కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. కొందరి దరఖాస్తులలో తప్పులు దొర్లాయి. వీటి వెరిఫికేషన్ కోసం అధికారులు మున్సిపాలిటీ వార్డుల్లో పర్యటించనున్నారు. దీనికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు ప్రజలను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటీ మేనేజర్ అంకు షావలి, ఆర్ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట ప్రజా పాలన గ్రామసభల్లో స్వీకరించిన 3824 దరఖాస్తులలో లబ్ధిదారులు ఇచ్చిన సమాచారం సక్రమంగా లేవని వాటిని ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రుక్మిణి గ్రామపంచాయితీ సిబ్బందిని ఆదేశించారు. సర్వేలో సేకరించిన వివరాలను ప్రజా పాలన యాప్‌లో నమోదు చేసి సరి చూసుకోవాలని చెప్పారు. అశ్వారావుపేట గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజా పాలన దరఖాస్తుల సర్వే వివరాల అన్ లైన్ నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులు ఇచ్చిన వివరాలు రేషన్, గ్యాస్ కార్డుల వివరాలతో సరితూగడం లేదని చెప్పారు. వీటిని సమగ్రంగా సర్వే చేసి యాప్‌లో సరి చేయాలని చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆమె వెంట ఈవో హరికృష్ణ, సర్వే సిబ్బంది ఉన్నారు.

ముగ్గురు పై వేధింపుల కేసు నమోదు

నవతెలంగాణ-అశ్వారావుపేట

అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న ముగ్గురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్.హెచ్.ఒ ఎస్ఐ పీ.శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరాయిగూడెంకు చెందిన తగరం అనంత దేవికి ఇదే గ్రామానికి చెందిన వినోద్ కుమార్‌తో సుమారు మూడేళ్ల క్రితం వివాహం అయింది. గడిచిన కొంతకాలంగా అనంత దేవిని అదనపు కట్నం కోసం భర్త వినోద్ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దాంతో తనను వేధింపులకు గురి చేస్తున్న భర్తతో పాటు, మామ తగరం సత్యనారాయణ, అత్తయ్య వెంకట రమణ పై అనంత దేవి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయిల్ రికవరీని బట్టి గెలల ధర నిర్ణయించాలి

- పామాయిల్ రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు ఆలపాటి

నవతెలంగాణ-దమ్మపేట



తెలంగాణ రాష్ట్రంలో వస్తున్న ఆయిల్ రివకరీని బట్టి పామాయిల్ గెలల ధరను నిర్ణయించాలని తెలంగాణ రాష్ట్ర పామాయిల్ రైతు సంఘ అధ్యక్షులు ఆలపాటి రామచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన అల్లిపల్లిలోని ఆయన స్వగృహంలో మాట్లాడుతూ ఈ నెల 5 నుండి 7వ తేదీ వరకూ జాతీయ స్థాయిలో జరిగిన పీసా రైతు సంఘాల సమావేశాలు జరిగాయని అట్టి సమావేశాలకు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల రైతు సంఘాలు ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు, ఏలూరు ఎంపి శ్రీధర్‌లతో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పామాయిల్ దిగుమతి సుంకం విధింపు, రైతులకు ఇచ్చే రాయతీలు తదితర అంశాలను వివరించామన్నారు. గతంలో కేంద్రం ప్రైవేట్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి నిర్ణీత ధర ఉండేలా జీవో జారీ చేయగా అప్పుడు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. కాగా ప్రస్తుతం ఆంధ్రాలో వస్తున్న ఆయిల్ రికవరీశాతాన్ని పరిగణలోకి తీసుకొని ధర నిర్ణయించేందుకు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి శోభా కరాండ్‌లేజ్ బృందం సమావేశంలో ప్రస్తావించగా ఈ నిర్ణయాన్ని తెలంగాణ రైతు సంఘం తరఫున తీవ్రంగా వ్యతిరేకించామని వివరించారు. గడచిన ఐదేళ్ళుగా ఎపి ప్రభుత్వం తెలంగాణ ఆయిల్ రికవరీశాతాన్ని పరిగణలోకి తీసుకొని అక్కడి రైతులకు గెలల ధరను నిర్ణయిస్తుందన్నారు. ఎపి, తెలంగాణ రైతులు పరిగణలోకి తీసుకోని రికవరీశాతాన్ని మీరేలా పరిగణలోకి తీసుకుంటారని తాము కేంద్ర మంత్రిని ప్రశ్నించి సమావేశంలో తమ వాదనను వినిపించామన్నారు.

10లో 100 శాతం ఫలితాలు సాధించాలి

- డీఈఓ వెంకటేశ్వర చారి

నవతెలంగాణ-పినపాక



పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లకు డీఈవో వెంకటేశ్వర చారి సూచించారు. శుక్రవారం పినపాక మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ పర్యాటనలో భాగంగా జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు వార్షిక ప్రణాళిక వివరాలు పాఠశాల హెడ్మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరీక్షించి, వారి రికార్డులను పరిశీలించారు. అనంతరం అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్షిక ప్రణాళికలో తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త బందును జయప్రదం చేయండి

- అఖిలపక్ష పార్టీలు, సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్లు పిలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం





16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, భారత్ బంద్ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా ప్రజలకు, వ్యాపార వర్గాలకు అఖిల పక్ష పార్టీల నాయకులు జిల్లా పరిషత్ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంచర్ల చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్వాల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు ముద్దా బిక్షం, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎల్.విశ్వనాథం, ఉమర్, టిడిపి అధికార ప్రతినిధి కోటయ్యలు పిలుపు నిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆద్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జమలయ్య, అన్నవరపు సత్యనారాయణల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరిగే సమ్మె, జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని, భారత దేశ ప్రభుత్వ రంగ సంస్థలను, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, రైతు, కార్మిక హక్కుల కోసం, పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జరిగే సమ్మె, బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యాసంస్థలు, వ్యాపారస్తులు సహకరించాలని తీర్మానాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ ప్రవేశపెట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సారంగపాణి బలపరిచారు. కార్మికులు, కర్షకులు చేస్తున్న ఈ పోరాటానికి ప్రత్యక్షంగా పాల్గొంటామని సంపూర్ణ మద్దతు ప్రకటించి నేతలు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు రేపాకుల శ్రీనివాస్, బానోత్ ఊక్ల, కందగట్ల సురేందర్, ఐఎఫ్‌టీయూ నాయకులు యాకూబ్ షావళి, ఏఐటీయూసీ నాయకులు గెద్దాడ నగేష్, సీఐటీయూ నాయకులు డి.వీరన్న, భూక్యా హర్ష, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పృథ్వి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పట్టణ పేదల సంఘం నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తీర్మాణం : కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై 16న దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ సన్నాహక సమావేం. అఖిల పక్ష ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మాణాలు ఆమోదించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చలు అఖిల భారత స్థాయిలో నిర్ణయం జరిగింది. ఈ సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పురస్కరించుకుని జిల్లా బంద్‌కి రాజకీయ పార్టీలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, విద్యా సంస్థలు, అన్ని ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, మేధావులు, పౌర హక్కుల సంఘాలు, ప్రగతి శీల శక్తులు పిలుపు ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



16న భారత్ బంద్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు : మచ్చా

భద్రాచలం రూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 16న జరిగే భారత్ బంద్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ బందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ పట్టణ, శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని అన్నారు. మత ప్రాతిపదికన ప్రజలను విభజించి భారత లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, జీవనజ్యోతి, కోరాడ శ్రీనివాస్, శాఖ కార్యదర్శులు టి.కుమారి, సక్కుబాయి, పుణ్యవతి, నాగలక్ష్మి, శ్రీను, కృష్ణ, ఆది కృష్ణార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

బూర్గంపాడు : కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు అందరూ వేతవేకంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్‌ను సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో అన్ని గోడౌన్లు, ఫ్యాక్టరీలు, గ్రామపంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆశా కేంద్రాలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంక టేశ్వర్లు, సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య, సీఐటీయూ కోకన్వీనర్ గుంటక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : 16 దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత బంద్ నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు మోరంపల్లి బంజర మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. గోడపత్రికలను విడుదల జేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తిరుపతయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పుష్ప, వెంకటలక్ష్మి, కోట దారుగా, సతీశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బందు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి తెలిపారు. ఏలూరి భవన్‌లో రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సభలో వెంకటమ్మ, తాళ్లూరి కృష్ణ, ప్రేమ్ సింఘ్, మరియా, హుస్సేన్, కుమారీ, రాజేష్ తదితరులు పాల్గన్నారు.

జూలూరుపాడు : సమ్మెకు సంబంధించిన గోడ ప్రతులను సీపీఐ(ఎం) కార్యాలయంలో కార్మిక నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, సీఐటీయూ మండల కన్వీనర్ యా సా నరేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు గార్లపాటి వీరభద్రం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కూరాకుల నరసింహారావు, ఐఎన్‌టీయూసీ మండల నాయకులు మందబాబు, ఐఎఫ్‌టీయూ మండల కన్వీనర్ రాయల సిద్దు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ పనులు పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-చంద్రుగొండ



రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ ప్రియాంక అలా పర్యటించారు. మండలంలోని తిప్పనపల్లి, చంద్రుగొండ తదితర గ్రామాల్లోని వైకుంఠ దామాలు, డంపింగ్ యార్డులు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామంలో ఉన్న శానిటేషన్ పనులు పరిశీలించి ప్రతిరోజు శానిటేషన్‌లా కాకుండా స్పెషల్ శానిటేషన్‌లో గ్రామంలో పనులన్నీ ఒక్కసారే పూర్తి చేయాలన్నారు. డంపింగ్ యార్డులకు, వైకుంఠ దామాల రిపేర్లకు నిధులు కేటాయిస్తామని అధికారులు నివేదికలు పంపాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు టాయిలెట్లు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో గ్రామజ్యోతి పథకం కింద ప్రభుత్వ భవనాలను కూల్చారని కూల్చిన స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయని, ఆ స్థలాల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా గ్రంథాలయం, మహిళలకు టాయిలెట్లు నిర్మించాలని టీడీపీ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే తయారు చేసి పంపాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, డీపీఆర్ఓ శ్రీనివాసరావు, ఎంపీపీ బానోత్ పార్వతి, జడ్పీటీసీ కొనగండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీలు ధారా వెంకటేశ్వరరావు, లంక విజయలక్ష్మి, ఎంపీడీవో జి.రేవతి, తహశీల్దార్ మహ్మద్ సాదియా సుల్తానా, మండల పంచాయతీ అధికారి తోట తులసీరామ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-టేకులపల్లి

కొత్తగూడెం, ఇల్లందు ప్రధాన రహదారిలోని టేకులపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం అర్ధరాత్రి మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ గన్ రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం... మండలంలోని మూకమామిడి గ్రామానికి చెందిన కొప్పుల మారేష్ (27) గురువారం అర్ధరాత్రి పాల్వంచ నుండి ఇల్లందు అత్తగారింటికి వెళుతుండగా టేకులపల్లి ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో రాత్రి 12:30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-టేకులపల్లి

మండల శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవంను టేకులపల్లిలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. అసోసియేట్ జిల్లా అధ్యక్షులు పూణెం నరసయ్య, రాష్ట్రకార్యదర్శి రవీందర్, కార్యదర్శి విజయనిర్మల, జిల్లా కార్యదర్శి కె.ప్రసాద్, మండల అధ్యక్షులు జి.మోతిలాల్‌లు మాట్లాడారు. పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.బాలు, కేజీబీవీ ఎస్ఓ సంతు, పార్వతీ, బి.బాలాజీ, డి.మంగీలాల్, డి.రాజేష్ కన్నా, ఎం.పద్మా తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాల ద్వారా గిరిజన యువతకి ఉపాధి చూపించాలి : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన యువతీ, యువకులకు ట్రై కార్ ద్వారా సబ్సిడీపై రుణాలు అందించి, వారికి జీవనోపాధి కల్పించడానికి ట్రై కార్‌కి సంబంధించిన యూనిట్లు త్వరితగతిన గ్రౌండ్ చేసి వారికి త్వరలో సబ్సిడీ రుణాలు అందే విధంగా సంబంధిత ఎంపీడీవోలు, బ్యాంకర్స్, చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపీడీవోలు, బ్యాంకర్స్‌తో ట్రైకార్ యూనిట్లు గ్రౌండింగ్ పై ఆయన మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ట్రై కార్ ద్వారా గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి, వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని గ్రౌండింగ్ చేయడంలో సంబంధిత ఎంపీడీవోలు, బ్యాంకర్స్, ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన హెచ్చరించారు. అర్హులైన ప్రతి యూనిట్ దారులకు ట్రైకార్‌కు సంబంధించిన యూనిట్లు త్వరగా గ్రౌండ్ చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉన్నందున యూనిట్లు ఒక వారం లోపల గ్రౌండ్ చేసి దానికి సంబంధించిన ప్రతిపాదనలు త్వరగా తన కార్యాలయానికి పంపించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఎస్ఓ కార్యాలయం సిబ్బంది రాజేష్, రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తోడ్పాటు

- జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



విద్యార్థులకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచడంలో "స్కౌట్స్ అండ్ గైడ్స్" ఎంతో తోడ్పడుతుందని సింగరేణి జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య అన్నారు. శుక్రవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 'ప్యాట్రోల్ లీడర్ శిక్షణా శిబిరంను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి విచ్చేసిన పాఠశాల విద్యార్థులకు 5 రోజుల ప్యాట్రోల్ లీడర్ శిక్షణా శిబిరంను నిర్వహించడం జరుగుతుందన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నందు స్కౌట్స్ విద్యార్థులకు దేశ భక్తి, నాయకత్వ లక్షణాలు, విపత్తుల సమయంలో ధైర్యముగా ముందుకు వెళ్ళి సేవ చేసే విధముగా మొత్తంగా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహద పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సుశీల్ కుమార్, సింగరేణి ఎయిడెడ్ కొత్తగూడెం, ఇల్లందు, గోలేటి, మందమర్రి పాఠశాలల నుండి, మాస్టర్ ఈకే విద్యాలయం, శ్రీశారదా విద్యాలయం, సెంట్ విన్సెంట్, బాలాజీ స్కూల్, భూపాలపల్లి, ఉజ్జ్వల ఉన్నత పాఠశాల, ఫాతిమా ఉన్నత పాఠశాల, కాగజ్ నగర్ పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పూనెం రాంబాబు అతని సోదరుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆళ్ళపల్లికి వస్తున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డుపై పడటంతో రాంబాబుకు దవడ, మోకాళ్ళ, వేళ్ల భాగంలో తీవ్రంగా గాయాలు కాగా అతని సోదరుడికి స్వల్ప గాయాలయ్యాయని అన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇరువురికి ప్రథమ చికిత్స అందించారని తెలిపారు. ద్విచక్ర వాహనం భాగాలు ఎక్కువగా ధ్వంసం అయ్యాయని చెప్పారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

నవతెలంగాణ-అశ్వాపురం

ఓ వృద్ధురాలి మెడలో బంగారపు గొలుసు అపహరణకు గురైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎస్‌కేటి ఫంక్షన్ హాల్ పక్కన నివాసముంటున్న రాయల లక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా ఓ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో సదరు వ్యక్తి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలకు సంబంధించి వివరాల కోసం ఆధార్ కార్డు కావాలని నమ్మబలికాడు. జనం అలికిడి లేకపోవడంతో ఆమె మెడలో ఉన్న ఐదు దూలాల బంగారపు గొలుసును లాక్కొని పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఎస్సైను సన్మానించిన ఏఐవైఎఫ్ నాయకులు

నవతెలంగాణ-జూలూరుపాడు



ఇటీవల పోలీస్ బదిలీలో భాగంగా కొత్తగూడెం త్రీ టౌన్ నుంచి జూలూరుపాడు బదిలీ పై వచ్చిన జీవన్ రాజును ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా, పాపకొల్లు మాజీ ఉపసర్పంచ్ గార్లపాటి వీరభద్రం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి పసుపులేటి పవన్, కొండ హనుమంతరావు, వంశి, ఉదయ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని రద్దీగా ఉండే బస్‌స్టాండులో మాటు వేసి ప్రయాణికుల విలువైన సామాన్లు దొంగిలించే అంతరాష్ట్ర జేబు దొంగల కిలాడీ గ్యాంగ్‌ను ఖమ్మం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల చెందిన ఏడుగురు ముఠా సభ్యులు పథకం ప్రకారం ములుగు జిల్లాలో జరుగుతున్న మేడారం సమ్మక్క,సారలమ్మ మహా జాతరకు వెళ్లి అక్కడకు వచ్చే భక్తుల విలువైన వస్తువులు, డబ్బులను చోరీ చేసేందుకు రైలులో బయలుదేరారని తెలిపారు. నిందుతులు ఖమ్మం రైల్వే స్టేషన్ లో దిగి ఖమ్మం బస్‌స్టాండు తదితర ప్రాంతాంలో అనుమానాస్పద తిరుగుతున్న నిందుతులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో ఈ ముఠా సభ్యుల వ్యవహారం బయట పడిందని తెలిపారు. నిందుతులపై ఖమ్మం వన్ టౌన్ ,టూ టౌన్ ,త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రద్దీగా జాతరలు,ఉత్సవాలు, బస్సు ప్రయాణికుల చుట్టూ నిలబడి దృష్టిని మరల్చి పర్సులు, బ్యాగ్ లు కత్తిరించి విలువైన వస్తువులు,డబ్బులు చాకచక్యంగా దొంగిలిస్తారని, కాబట్టి మేడరం జాతరకు వెళ్లే భక్తులు తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా వుండాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని ఏళ్ళుగా ఆంధ్రప్రదేశ్ లో చోరీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు, వీరిపై ఆయా జిల్లాలో 50 కేసుల వరకు నమోదు అయినట్లు తెలిపారు.

విద్యార్థులు విద్యతోపాటు
సామాజిక సేవలో ముందుండాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు గ్రామాలలోని గిరిజన ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడంలో అత్యంత ఉత్సాహం చూపి వారిలో చైతన్య స్ఫూర్తిని నింపి వారి భవిష్యత్తు బంగారు బాటలో పయనించేలా కృషి చేయడం చాలా సంతోషకరమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని, మణుగూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కలిసి జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే, సేవా కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను పిఓకి అందజేశారు. అనంతరం పిఓ మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అశ్వాపురం మండలం గొంది గూడెం గ్రామంలో ఈనెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు 70 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ఆ గ్రామంలో ఉదయం రోజుకొకటి సేవా కార్యక్రమాలు మరియు సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రజలకు వివిధ స్థితిగతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్, పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన గద్దల రమేష్

నవ తెలంగాణ-పాల్వంచ

దంతేలబొర ఎస్సీ కాలనీ మాజీ సర్పంచ్ పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గద్దల రమేష్ గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహని హైదరాబాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ పాల్వంచలోని పలు సమస్యల పై వివరించడం జరిగిందని అన్నారు. తన గ్రామానికి హెల్త్ సబ్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి తెలియజేశారు. అనంతరం మంత్రి సానుకూలంగా స్పందించి గ్రామానికి సబ్ హెల్త్ సెంటర్ ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు.

పీవీకి భారతరత్న రావడం
తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా..

నవతెలంగాణ-దమ్మపేట



భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న దక్కడం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. అద్భుతమైన పరిపాలన ఆర్థిక సంస్కరణలతో తెలంగాణ ఖ్యాతికి ఖండాంతరాలకు చాటిన పివికి భారతరత్న ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన డిమాండ్ ను గౌరవించి పివి నర్సింహరావుకు భారతరత్న ఇవ్వడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి, భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేసిన కేసీఆర్‌కి ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

నేడు, రేపు కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు

- రాష్ట్ర నాయకులు పాపెట్ల సత్యనారాయణ పిలుపు

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేడు, రేపు ఖమ్మంలో జరిగే కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర స్థాయి సమావేశంలో జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు పాపేట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ నేలకొండపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళిత గిరిజన అట్టడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు బొడ్డు బాబురావు, పొట్టపింజర స్టాలిన్, కూరపాటి ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెత్తందార్ల ఆగడాలను
అంతం చేసిన త్యాగశీలి కిషన్‌రావు

48వ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-ముదిగొండ



గ్రామాలలో భూస్వామ్య పెత్తందార్ల ఆగడాలను అంతం చేసి పేదలకు అండగా, వెట్టిచాకిరీ విముక్తికై ఎర్రజెండా నీడలో ఉద్యమించి తన జీవితాన్ని పేదలకు అంకితం చేసిన త్యాగశీలి గండ్లూరి కిషన్ రావు అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల బండి రమేష్ అన్నారు. మండలపరిధిలో బాణాపురంలో జనం గుండె చప్పుడు, సిపిఐ(ఎం) నాయకులు, పేదల ఆశాజ్యోతి,అమరవీరుడు కామ్రేడ్ గండ్లూరి కిషన్ రావు 48వ వర్ధంతి శుక్రవారం రాత్రి గండ్లూరి స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో పల్లె ప్రాంతాల్లో అమాయక ప్రజలపై జరుగుతున్న భూస్వామ్య దాడులు, వెట్టిచాకిరి, పెచ్చు మానికల దోపిడీపై దండెత్తి, గళం విప్పి,ప్రజా ఉద్యమాలను ఉధృతం చేసి, అన్యాయ,అక్రమాలపై విజయబావుట ఎగరేసిన గండ్లూరి కిషన్ రావు పేద ప్రజల బతుకులులో వెలుగులో నింపారన్నారు. కులమతాలకతీతంగా ప్రజలందరినీ ఐక్యమత్యం చేసి అణగారిన వర్గాల ప్రజలకు గండ్లూరి ఆత్మబంధువయ్యారన్నారు. గండ్లూరి కిషన్ రావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వము మత ఉన్మాదంతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆయన విమర్శించారు. మతం పేరట రాజకీయాలు చేస్తున్న ప్రధాని మోడీ విధానాలను నిరసించాలన్నారు. కులమతాలకతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ఉండాలన్నారు. తొలిత బాణాపురం ప్రధాన సెంటర్ నుండి ఎర్రజెండాలతో అమరవీరుల స్థూపాల వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం గండ్లూరి కిషన్ రావు స్థూపంతోపాటు,గ్రామ అమరవీరుల స్థూపాల వద్ద పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ సామల అజయ్ కుమార్, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు టిఎస్ కళ్యాణ్, కందిమళ్ల తిరుపతి, పాలవాయి పాండురంగారావు, పంద్రకొల రాంబాబు, సిపిఐ(ఎం) మండల మాజీ కార్యదర్శి కూరపాటి శ్రీనివాసరావు, గ్రామ శాఖ కార్యదర్శి చింతకాయల రామారావు పాల్గొన్నారు.

మారాయి గూడెం సమ్మక్క, సారలమ్మ జాతరకు రండి

- మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన మారాయిగూడెం గ్రామంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే శ్రీసమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం హైదరాబాద్ లో శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను కలిసి ఆహ్వానం అందించారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే జాతర మహోత్సవానికి మూడు రాష్ట్రాల అశేష భక్తజనం హాజరవుతారని, ఇట్టి జాతర మహో త్సవానికి హాజరై అమ్మ ఆశీస్సులు పొందాలని దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మలు మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ నిర్వహకులు సలీం. అప్కా వీర్రాజు, అప్కా శ్రీను, వీరభద్రం, ఎటపాక జడ్పిటిసి సుస్మిత తదితరులున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

• కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తహశీల్దార్లు, సెక్టార్ అధికారులకు, ఎన్నికల విధులు, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రేయినర్లు శ్రీరామ్, మదన్ గోపాల్‌లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారుల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన టీఎస్ బీపాస్ విధానం ద్వారా నిర్మాణ అనుమతులు

టిఎస్ బిపాస్ విధానం ద్వారా నిర్మాణ అనుమతులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా త్వరితగతిన ఆమోదించడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లే అవుట్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభితో కలిసి, కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఒకటి, మధిర మునిసిపాలిటీ పరిధిలో ఒకటి, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో 3, సుడా పరిధిలో 13, ఫైనల్ లే-అవుట్ల ఆమోదం కోసం 3, మొత్తం 21 దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనల మేరకు సమర్పించబడిన దరఖాస్తులను కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే-అవుట్ల అనుమతులను నిర్ణీత గడువులోగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. లేఅవుట్ డెవలపర్స్ కూడా నిబంధనల మేరకు చట్టబద్ధంగా సమగ్ర ప్రణాళికబద్దంగా ల్యాండ్ డెవలప్మెంట్ పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జెడ్పి సిఇఓ అప్పారావు, డిపిఓ హరికిషన్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, డిటిసిపిఓ ప్రసాద్, టిపిఓ వికాస్, మధిర, కొనిజర్ల తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్, ఇర్రిగేషన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంలను వినియోగిస్తాం

పార్లమెంట్ ఎన్నికల వినియోగానికి జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని ఇవిఎం గోడౌన్ లోని అదనపు ఇవిఎంలను వినియోగించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఇవిఎం గోడౌన్ తెరచి, అందులో భద్రపరచిన ఇవిఎంలను నూతన కలెక్టరేట్ ఆవరణలో నున్న ఇవిఎం గోడౌన్ కు ఫస్ట్ లెవల్ చెకప్‌కు తరలించారు. జిల్లా పరిషత్ ఇవిఎం గోడౌన్ లో 810 బ్యాలెట్ యూనిట్లు, 716 కంట్రోల్ యూనిట్లు, 807 వివిప్యాట్లను నూతన గోడౌన్ కు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి జిఎస్ఆర్ఏ. విద్యాసాగర్, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి జి. పున్నయ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాలరావు, టిడిపి పార్టీ ప్రతినిధి కె. కరుణాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నవతెలంగాణ -కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణ పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వన్ టౌన్ పరిధిలోని బస్టాండ్ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు టీఎస్ 09 ఇహెచ్, 0459 నంబర్ కారులో అక్రమంగా తరలిస్తున్న 1 క్వింటా గంజాయి (49)ప్యాకెట్లను పట్టుకోవడం జరిగిందని వన్ టౌన్ సిఐ ఎం. కరుణాకర్ వివరాలు తెలిపారు. బస్టాండ్ సెంటర్ లో ఎస్ఐ విజయ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సూపర్ బజార్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా వెళ్తున్న కారుని ఎస్ఐ ఆపి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న కారులోని ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించగా సంబంధం లేని సమాధానాలు చెప్పారు. అనుమానం వచ్చిన పోలీసులు కారును తనిఖీలు చేయగా ఒక క్వింటాల్ బరువు గల 49 నిషేధిత గంజాయి ప్యాకెట్లను గుర్తించడం జరిగిందని చెప్పారు. కారులో ప్రయాణిస్తున్న కర్ణాటకకు చెందిన పవన్ చౌహన్, నెహ్రూ రాథోడ్, నారాయణ ఖేడ్‌కి చెందిన శ్రీకాంత్ మెగావత్ లను అదుపులోకి తీసుకొని కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించామని తెలిపారు. కార్ లో ఉన్న గంజాయి విలువ సుమారు రూ. 25 లక్షలు ఉంటుందని సిఐ కరుణాకర్ తెలిపారు. కార్ లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కరుణాకర్ తెలిపారు.

దళిత బంధుపై జరిగిన వసూళ్ల దందాపై అధికారులు విచారణ చేపట్టాలి

- నిరుపేదలను మోసం చేసిన వారిపై

- చట్టరీత్యా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-చర్ల



దళిత బంధు ఇప్పిస్తామంటూ నిరుపేదలను మోసం చేసి డబ్బు వసూలు చేసిన మోసగాళ్లను గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బంధు సాధన కమిటీ చేస్తున్న పోరాటానికి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాపుల కృష్ణార్జునరావు, దొడ్డి తాతారావు హాజరై సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటం చేస్తే ఏ సమస్య అయినా పరిష్కారం కాక తప్పదని దళిత బంధు సాధన కోసం పోరాట రూపాన్ని ఎంచుకున్న కమిటీ నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా మాజీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ దళిత బంధు పథకాన్ని ఏర్పాటు చేసిందని మొదటి దఫాగా అర్హులను ఎంపిక చేసి దళిత బంధుని మంజూరు చేసిందని అన్నారు. అనంతరం ఈ ప్రాంతంలోని ప్రజలు అందరికీ దళిత బందు వస్తుందని భావించి నమ్మారు. మా జీవితాలు బాగుపడతాయని ఆశపడ్డారు. ఈ ఆశను అదునుగా చేసుకొని ప్రభుత్వ పథకమైన దళిత బందును ఇప్పిస్తామంటూ కొంతమంది ఈ నిరుపేదలైన దళితుల దగ్గర నుంచి లక్షల రూపాయలు దండుకున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయ్యేసరికి ప్రభుత్వం మారేసరికి దళిత బంధు వస్తుందో రాదో అనేటువంటి భయాందోళనకి ప్రజలు గురయ్యారు. రెక్కల కష్టంతో తిని తినక సంపాదించుకున్న డబ్బులను అప్పు సప్పు చేసి వడ్డీలకు తెచ్చిన డబ్బులను దళిత బందు కోసం వెచ్చించి మోసపోయామని బాధతో రాష్ట్రంలో అక్కడక్కడ దళిత బందు కారణంగా ఆత్మహత్యలకు చేసుకున్నారు. ప్రభుత్వ పథకమైన దళిత బంధు పై డబ్బులు దండుకున్న విషయంపై తక్షణమే అధికారులు విచారణ జరిపి సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలి, తీసుకున్న డబ్బులను వారి నుంచి ప్రజలకు ఇప్పించాలి, ఇలాంటి దందాలను పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన ప్రభుత్వంలో పరిపాలనలో దళితుల ఆసలు ఆకాంక్షలు మరింత చిగురించాలి తప్ప చిదిమి వేయకూడదని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రభుత్వంపై దళితులకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బంధు కచ్చితంగా ఇవ్వాలని తద్వారా దళిత సమాజానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భరోసాని ఇవ్వాలని ప్రజల్లో ఉన్న భయాందోళనలను చెరిపి ఆత్మహత్యలను ఆపాలని దళితులకు ప్రభుత్వంపై విశ్వాసం కల్పించాలని కోరారు లేనియెడల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బందు సాధన కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం రీజియన్ పరిధిలోని మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు రివిజనల్ మేనేజర్ సిహెచ్. వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం డిపో పరిధి నుంచి 30 బస్సులు, ఇల్లందు 124, సత్తుపల్లి డిపో పరిధి నుంచి వెంకటాపురం 11, చర్ల 10, ఏటూరి నాగారం 34, మణుగూరు డిపో పరిధి నుంచి మణుగూరు 25, మంగపేట 10, కొత్తగూడెం డిపో పరిధి నుంచి 130, టేకులపల్లి 25, మధిర డిపో పరిధి నుంచి పాల్వంచ 45, భద్రాచలం డిపో పరిధి నుంచి భద్రాచలం 50 బస్సులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇంకా అదనంగా ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులను ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడిపేందుకు సిద్ధంగా ఉంచుతుమని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 జాతర పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ పాయింట్‌లో ఆర్టీసీ ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రయాణికులకు మేడారం జాతర బస్సుల సమాచారం ఇస్తారు. మేడారం జాతర కు వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని మద్దులపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి భద్రాచలం మీదుగా ఒడిస్సా వెళ్తుంది. బస్సు మార్గమధ్యలో మండల పరిధిలోని మద్దులపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 45 మంది ఉన్నారు. వారిలో ఒడిస్సా రాష్ట్రం మాల్కాజిగిరి జిల్లా కలిమెళ ప్రాంతానికి చెందిన మార్కం ఆకాశ్ కు తీవ్ర గాయాలు, మిగతా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ ఆకాశ్‌ను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మిగతా వారు ఇతర వాహనాల్లో తమ ప్రాంతానికి వెళ్లిపోయారు. ప్రమాదం సమయంలో బస్సులో ఉన్న వారంతా ఒడిస్సా ప్రాంతానికి చెందిన వారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేశ్ సందర్శించారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పంతంగి బసవయ్య మృతి

నవతెలంగాణ-వైరాటౌన్



మండలంలోని దాచపురం గ్రామంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు పంతంగి బసవయ్య(80) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరణవార్త తెలిసిన వెంటనే సిపిఐ(ఎం) వైరా రూరల్ మండల కమిటీ సభ్యులు మాగంటి తిరుమలరావు, షేక్. జానీమియా పంతంగి బసవయ్య భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితోపాటు సిపిఐ (ఎం) దాచాపురం గ్రామ శాఖా కార్యదర్శి ఉప్పరపల్లి కృష్ణారెడ్డి, గరికపాడు ఎంపీటీసీ మాగంటి సుందరమ్మ, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు నివాళులర్పించారు.

అంతర్జాతీయంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

ఖమ్మం : ప్రఖ్యాతి చెందిన భారతదేశపు స్వదేశ హస్తకళను అంతర్జాతీయంగా ప్రోత్సహించే క్రమంలో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఒక ప్రతిష్టాత్మకమైన విస్తరణ ప్రణాళికను ప్రారంభించిందని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అషర్ ఓ అన్నారు. ఇప్పటికే తమ రిటైల్ ఉనికి ఉన్న ప్రాంతాలలో మరిన్ని షోరూంలను ప్రారంభించి మరింత బలోపేతం చేయడంతో పాటు, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, బంగ్లాదేశ్, టర్కీ , న్యూజిలాండ్ వంటి దేశాలలో కొత్తగా తమ ఉనికిని విస్తరింపజేయడం జరుగుతుందని తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అల్పాహారం

సత్తుపల్లి : సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్పాహారం అందించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థినులకు బస్సు సౌకర్యం సరిగా లేని కారణంగా అల్పాహారం లాంటివి ఏమీ తీసుకోకుండానే ఉదయం 6 గంటలకే కళాశాలకు బయలుదేరడం జరుగుతోంది. దీంతో నీరసపడి విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతుండటాన్ని గమనించిన ఆ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి విషయాన్ని లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన లయన్స్ క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకరరెడ్డి 15రోజుల పాటు అల్పాహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య, క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, ఉడతనేని అప్పారావు, కొత్తూరు ప్రభాకరరావు, సోమిరెడ్డి, రంగారావు, అధ్యాపకురాలు రజియా సుల్తానా పాల్గొన్నారు.

పంచాయతీల ప్రత్యేకాధికారులు
ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

నవతెలంగాణ పాల్వంచ



గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల స్థానంలో నియమితులైన ప్రత్యేకాధికారులు ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల 19వ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎండిఓ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గాలు వున్నప్పుడు ప్రజాసమస్యలపై పట్టు ఉండేదని, ఇప్పుడు వున్న ప్రత్యేకాధికారులు నిత్యం, సమస్యలపై అవగాహనా ఏర్పర్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లోని గృహజ్యోతి పథకం లబ్దిదారుల అర్హులపై సర్వే చేపట్టిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు లబిదారుల ఎంపికపై శ్రద్ధ కనబరిచి, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని కొత్వాల కోరారు.

కొత్వాలను సన్మానించిన సర్వసభ్య సమావేశం

ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా ఎంపికైన కొత్వాల శ్రీనివాసరావు ను మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ఎంపీటీసీలు గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్ లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మడివి సరస్వతి అధ్యక్షత వహించగా ఎమ్మార్వో నాగరాజు, ఎంపీడీవో అప్పారావు, ఎంపీ ఓ నారాయణ, వైస్ ఎంపీ ఓ మార్గం గుర్వయ్య ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

50 తునికాకుల కట్టకు రూ.5 చెల్లించాలి.

సీపీఐ ఎంఎల్-మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్

నవతెలంగాణ పాల్వంచ

సీపీఐ ఎంఎల్-మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 50 ఆకుల కట్టకు ఐదు రూపాయలు ఇవ్వాలని, జిల్లాలో తునికి మోడెం వెంటనే కొట్టించాలని, టెండర్స్ పూర్తి చేయాలని, తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని, ఇతర పనులకు 30 శాతం అదనంగా పెంచాలని ఆకు సేకరణ సమయంలో వడదెబ్బ, క్రిమి కీటకాలు, అడవి జంతువుల బారినబడి గాయపడిన వారికి ఐదు లక్షల రూపాయలు., చనిపోయిన వారికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో... జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. రానున్న బడ్జెట్లో ఉపాధి కూలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎక్కువ నిధులు కేటాయించి కూలీలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ముద్ద బిక్షం. జిల్లా నాయకులు అమర్లపూడి రాము, జాటోత్ కృష్ణ, నాయిని రాజు, నూపా భాస్కర్, నిమ్మల రాంబాబు, ఆజాద్ ప్రజా సంఘాల నాయకులు ధర్మా, పూనెం రమేష్, రామ్ చందర్, రాజశేఖర్, పాల్గొన్నారు.

కారేపల్లిలో రాస్తారోకో చేసిన నాయకులపై కేసు

నవతెలంగాణ-కారేపల్లి

సదరం క్యాంపు స్లాట్ బుకింగ్ లో దివ్యాంగుల పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం కారేపల్లిలో రాస్తారోకో నిర్వహించిన నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దివ్యాంగులు మీ సేవ సెంటర్‌లో గంటల తరబడి వేచి ఉన్న స్లాట్ బుకింగ్ కాక పోవటంతో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. దీనికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలు నాయకులు సంఘీభావం తెల్పారు. ఈ ఆందోళనకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాస్తారోకో చేసి ప్రజలకు ఇబ్బందులకు కల్గించారని పోలీసు బ్లూకోట్ సిబ్బంది సీతారాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్‌లను కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సభలు, సమావేశాలు, ఆందోళన నిర్వహించే సమయంలో ముందస్తులు అనుమతులు తీసుకోవాలని లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం బీక్యాతండాలో అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యంను టాస్క్ పోర్స్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. బీక్యాతండా ముగ్గురు ఇండ్లలో 20 క్వింటాళ్లకు పైగారేషన్ బియ్యంను నిల్వచేశారు. వాటిని ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో సమాచారం అందుకున్న టాస్క్‌పోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఆ బియ్యంను కారేపల్లి పోలీసుకు తరలించి, సివిల్ సప్లయి అధికారులు అప్పగించారు. బియ్యంను సివిల్ సప్లయి డీటీ విజయ్‌బాబు, ఆర్ఐ పవన్‌లు స్వాధీనం చేసుకోని స్థానిక రేషన్ షాపుకు తరలించారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవిస్తున్న యువకులు

నవతెలంగాణ-కారేపల్లి

గంజాయి సేవిస్తున్న యువకులను కారేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం భాగ్యనగర్‌తండా సమీపంలోని బొడ్రాసికుంట వద్ద జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు ఈ ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి మోటర్ సైకిళ్లపై వచ్చారు. బొడ్రాసికుంట చెరువు కట్ట పై ముగ్గురు యువకులు కూర్చోని గంజాయి సేవిస్తున్నారు. అదే సమయంలో ఆటుగా వెళ్తున్న బ్లూకోట్ పోలీసు సిబ్బందికి అనుమానం వచ్చి వారిని దగ్గరకు రమ్మని ఆదేశించగా వారు పరారైనారు. దీనిపై బ్లూకోట్ సిబ్బంది సీతారాములు కారేపల్లి స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేయాగా వారు సివిల్ డ్రస్‌లో ఎదురు వచ్చి యువకులను పట్టుకున్నారు. దీనికి సంబంధించి యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఖమ్మం సీసీఎస్ పోలీస్ లకు అప్పగించారు.

సీతారామ ప్రాజెక్టు ఏన్కూరు వద్ద సాగర్ ఎడమ
కాలువ లింక్ ప్రతిపాదన విరమించుకోవాలి

- తహసీల్దార్‌కి రైతుల వినతి

నవతెలంగాణ-కొణిజర్ల

నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సీతారామ ప్రాజెక్ట్ ఏన్కూరు వద్ద లింకు చేయాలనే ప్రతిపాదన విరమించుకోవాలని పాలేరు అనుసంధానం ఉండంగా రెండో లింకు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని రైతులు విలువైన భూములు లింక్ కెనాల్‌కు ఇవ్వటానికి సుముఖంగా లేమని ఏనుకూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ అనుసంధానం ప్రక్రియ కొనసాగుతుండగా ప్రాజెక్టు ప్రతిపాదనలో లేని ఏన్కూర్ లింకు కొత్తగా తెరమీదకు తెచ్చి, మూడు పంటలు పండే సారవంతమైన, విలువైన భూములు బలవంతంగా తీసుకోవడం సరికాదని అన్నారు.70 మీటర్లు వెడల్పుతో లింకు కాల్వలు ప్రతిపాదన సన్న చిన్న కారు రైతులకు తీవ్రంగా నష్టం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వంకు 70 కోట్లు అదనపు ఖర్చు ప్రతిపాదన తయారు చేయడం రైతులకు అభ్యంతరకరమని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ గతంలో రూపొందించిన ప్రతిపాదన ప్రకారం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బానోత్ బాలాజీ, వల్లభనేని వేణు మాధవ్, వెనిగండ్ల శ్రీహరి, ఆది పూర్ణయ్య, లాకవత్ నాగేశ్వరరావు, దొంతిబోయిన నాగేశ్వరరావు, వేణు, మాజీ ఎంపిపి కిషన్, మేడా కృష్ణయ్య తులిసీరామ్, పంతులు రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలివ్వాలి

- ఇతర ఖర్చులు, అలవెన్స్‌లు విడుదల చేయండి : సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి
- కలెక్టరేట్ వద్ద ధర్నా, ఏఓకు వినతిపత్రం



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ నగరంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఎఎన్ఎంలకు వివిధ కార్యక్రమాలకు ఇవ్వాల్సిన ఖర్చులను, అలవెన్స్, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జె.కుమారస్వామి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే అనేక కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్నారని, టార్గెట్లను పూర్తి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో వారికి అయ్యే ఖర్చులు, అలవెన్స్ మాత్రం అందడం లేదన్నారు. వారికి వేతనాలు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కొన్ని యూపీఎస్సీలలో కొన్ని రకాల ఖర్చులు అలవెన్స్‌లను కొద్ది మొత్తంలో ఇచ్చినప్పటికీ ఎక్కువ సెంటర్లలో ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీ పని భారం తగ్గించాలని, ఎన్‌సీడీ ఎంట్రీస్‌కు ప్రత్యేక ఏజెన్సీని నియమించాలని కోరారు. మిషన్ ఇంద్రధనస్సు, కంటి వెలుగు, ఎన్.డి.డి, ఏ.వి.డిల ఖర్చులు, అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎ.కవిత, నగర ఉపాధ్యక్షులు పి.లక్ష్మీబాయి, నగర ప్రధాన కార్యదర్శి బి.కిరణ్మయి పాల్గొన్నారు.

ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరిస్తా

ఫెడరేషన్‌కు మంత్రి పొంగులేటీ హామీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బీవీఎన్ పద్మరాజు, సీనియర్ జర్నలిస్టు రాకేష్‌రెడ్డి మంత్రిని కలిశారు. ఈసం దర్భంగా సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలనూ మంత్రితో చర్చించారు. ఇందుకు స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

గ్యాస్ సిలిండర్‌లో గంజాయి తరలింపు

- 65 కేజీల గంజాయి స్వాధీనం




నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు ఎన్ని చర్యలు చేపడుతున్నప్పటికీ కొత్త పద్ధతుల ద్వారా వాటిని నేరగాళ్లు రవాణా చేస్తున్నారు. తొలిసారిగా సీఎన్‌జీ సిలిండర్లలో గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులకు చిక్కడం కలకలం రేపుతుంది. ఈ తరహాలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడటం దేశంలోనే మొదటిసారి అని పోలీసులు చెబుతున్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం మేడ్చల్ డీసీపీ నితిక పంత్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు కార్లలో గ్యాస్ సిలిండర్లలో నలుగురు నిందితులు గంజాయి నింపి తరలిస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్ జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు రెండు కార్లను ఆపి చూడగా.. గంజాయి లభ్యమైందన్నారు. అభిషేక్ తోమర్, అరవింద్ చౌదరి, ఆశిష్ కుష్వాన, ఆకాష్ సోలంకికి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 65 కేజీల గంజాయి, రెండు కార్లు, 6 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

వైభవంగా నాగోబా మహాపూజ

- మురాడి నుంచి నాగదేవత తరలింపు
- హాజరైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు



నవతెలంగాణ- ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా దేవతకు మహాభిషేకంతో శుక్రవారం అర్ధరాత్రి పూజలు నిర్వహించారు. ముందుగా వట వృక్షం నుంచి పటేల్‌రావ్, పూజారి కోసేరావ్, హన్మంతు, ధర్ము ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో గంగా జలంతో నాగోబా ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పాము పుట్ట తయారీ

ఈ సందర్భంగా మెస్రం వంశీయులు కోనేరు నుంచి కొత్త కుండల్లో తెచ్చిన నీటితో నాగోబా ఆవరణలో పాత పుట్టను తవ్వి కొత్త పుట్టను తయారు చేశారు. ఈ సందర్భంగా మెస్రం అల్లుళ్లకు పెద్ద పీట వేస్తారు. అనంతరం ఏడు వరుసలుగా భౌల దేవతను తయారు చేసి పూజించారు. అనంతరం నాగోబా ఆలయం వెనుక ఉన్న భాన్, సతి దేవతకు కొత్త కుండల్లో తెచ్చిన నీటితో అభిషేకం చేశారు. మెస్రం వంశ మహిళలు ప్రత్యేకంగా ఈ పూజలో పాల్గొనడం ఆనవాయితీ.

అర్ధరాత్రి నాగోబాకు జలాభిషేకం

మెస్రం వంశీయులు శుక్రవారం రాత్రి 10గంటల నుంచి నాగోబా పూజను ప్రారంభించారు. కాలికొమ్, పెప్రే, తుడుమ్, కాగడాల మధ్య నాగోబా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ పూజలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలంతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మెస్రం వంశస్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఈఎన్సీ(జనరల్) పోస్టుకు గట్టిపోటీ

పలువురి పైరవీ

- మంత్రుల ప్రసన్నానికి అసెంబ్లీలో మకాం
- నియామకాలు నేటికి వాయిదా



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్) పోస్టుకు గట్టిపోటీ కనిపిస్తున్నది. ఆ పోస్టును దక్కించుకునేందుకు పలువురు ఈఎన్సీలు ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వారంతా అక్కడే తిష్ట వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నేపథ్యంలో సంబంధిత ఇన్‌ఛార్జీ ఈఎన్సీ ఎన్.వెంకటేశ్వర్లును సర్వీసు నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. అలాగే ఈఎన్సీ జనరల్‌గా ఉన్న సి మురళీధర్‌రావును రాజీనామా చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆయన గురువారం రాత్రి సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు లేఖ పంపారు. దీంతో ఇప్పుడు ఆ రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. కాగా ఈఎన్సీ జనరల్ పోస్టు కోసం ఈఎన్సీ(అడ్మిన్)గా ఉన్న అనిల్‌కుమార్‌తోపాటు నాగేందర్, హరిరామ్, శంకర్ పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే కామారెడ్డి సీఈ సుధాకర్‌రెడ్డి సైతం తనవంతు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది.

ఆ పోస్టు సుధాకర్‌రెడ్డికి దక్కాలంటే ఆయన పోస్టును అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుందని సమాచారం. అలాగే డిజైన్ విభాగంలో ఉన్న సీఈ అనంద్‌కుమార్ సైతం ఆశిస్తున్నట్టు తెలిసింది. వీరిలో ముగ్గురు ఈఎన్సీలు శుక్రవారం అసెంబ్లీకి వచ్చారు. ఎవరికివారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే ఇందులో అడ్మిన్‌గా ఉన్న అనిల్‌కుమార్‌కే ఎక్కువ అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఆయనను వద్దనుకుంటే నాగేందర్‌కు దక్కే పరిస్థితి ఉన్నట్టు అధికారిక సమాచారం. అనిల్‌కుమార్ కాళేశ్వరం పనుల విషయంలో గతంలో 'డిసెంట్' రాసి కాస్త కఠినంగా వ్యవహరించారనే పేరుంది. అందుకే సర్కారు ఆయనవైపు మొగ్గుచూపే అవకాశాలు ఉన్నట్టు జలసౌధ వర్గాలు చెబుతున్నాయి. కాళేశ్వరం ఈఎన్సీ బాధ్యతను ఇప్పుడున్న సీఈల్లో సీనియర్‌ను నియమించే అవకాశముంది. ఈ రెండు పోస్టుల నియామకం శనివారానికి ప్రభుత్వం వాయిదా వేసింది.

అసలు ఆ పోస్టు ఎందుకు ?

నీటిపారుదల శాఖలో ఈఎన్సీలు ఆరుగురు ఉంటారు. ఇందులో ఇప్పుడు రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. సీఈలకు కొదవ లేదు. జిల్లాకు ఒకరు చొప్పున పనిచేస్తున్నారు. వీరికి ఆయా బాధ్యతలు అప్పగించారు. కొన్ని జిల్లాలకు ఇద్దరు, ముగ్గురు ఉండటం తెలిసిందే. ఆయా జిల్లాల్లో ప్రాజెక్టులు, పనులను బట్టి పోస్టులను సృష్టించిన సంగతి తెలిసిందే. సాధారణంగా మొదట ఈఎన్సీ జనరల్ పోస్టు లేదు. మురళీధర్‌రావు తన పలుకుబడితో ఈఎన్సీలంతా తన ద్వారా కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రభుత్వంలో పైరవీ చేసి ఈఎన్సీ(జనరల్) పోస్టును సృష్టించుకున్నట్టు సమాచారం. ఆయనతోపాటు ఉన్న ఈఎన్సీలకు అనుభవం లేదనే సాకుతో సర్కారులో చక్రం తిప్పి, ఈఎన్సీ జనరల్‌గా బాధ్యతల్లోకి వచ్చారు. దీంతో మిగతా ఈఎన్సీలపై ఈఎన్సీ జనరల్ పోస్టు ద్వారా పైచేయి సాధించారు. సర్కారు ఈ పరిస్థితిని అధ్యయనం చేసింది. తొలినాళ్లల్లో ఉన్న విధానాన్నే కొనసాగించాలనే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ప్రత్యేకంగా ఈఎన్సీ జనరల్ పోస్టు అవసరమా ? ఈఎన్సీలందరికీ ఒకే రకమైన అధికారాలు ఉన్నప్పుడు ఆపోస్టు అనవసరమేంటి అనే భావనలో ఉంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం ఈ విషయమై సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. అధికారాలను అందరికి సమానంగా పంచేసి విధులను నిర్వర్తింపచేయాలని అనుకున్నట్టు సమాచారం. ఆరుగురు ఈఎన్సీలు నేరుగా సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శికి రిపోర్టు చేసేలా అధికారాల్లో మార్పులు చేయాలా ? లేక యధావిధిగా ఈఎన్సీ జనరల్ పోస్టును కొనసాగించాలా ? అనే విషయంలో మంత్రి, ముఖ్యకార్యదర్శి స్థాయిలో తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం.

ఆరు గ్యారంటీలు సరే..

మిగతా హామీలకు గ్యారంటీ ఇవ్వరా?

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆరు గ్యారంటీలు తప్ప, ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన మిగతా హామీలకు గ్యారంటీ గురించి గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించకపోవటం విచారకరమని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగానికి దన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శుక్రవారం శాసన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదనీ, సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని గాడిలో పెట్టాలని సూచించారు. రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన వాళ్లను గుర్తు చేసుకోవటం మంచిదే కానీ.. బీజేపీని విస్మరించటం ప్రభుత్వ సంకుచిత స్వభావానికి నిదర్శనమని విమర్శించారు.ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వటమే ప్రభుత్వ విజయం కాదన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి రూ. 10లక్షలకు పెంచినప్పటికీ అది అమలుకు నోచుకోవటం లేదని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ బాధితులు ఇప్పటికీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. 60నుంచి 70వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో బెల్టుషాపులు విచ్చల విడిగా ఉన్నాయనీ, వాటిని ఎప్పటి నుంచి మూసేస్తారనే విషయమై గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించకపోవటం విచారకరమన్నారు.పంటల బీమా, రెండు లక్షల రుణమాఫీ గురించి కూడా ఆ ప్రసంగంలో లేదని తెలిపారు. గత ప్రభుత్వం హామీలిచ్చి మోసం చేసిందనీ, ఈ ప్రభుత్వం అలానే చేస్తుందా? అని శంకర్ ప్రశ్నించారు.



చిరంజీవికి గవర్నర్ సన్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పద్మ విభూషణ్, ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవిని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై ఘనంగా సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ లో చిరంజీవి, గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఇదే రకమైన విజయాలను అందుకోవాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి, తన సతీమణి సురేఖతో కలిసి గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చెయ్యాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్

- ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ధర్నా



నవతెలంగాణ- ఓయూ

ఓయూలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఓయూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గ్రాంట్స్ విడుదల చేయకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందన్నారు.

పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను యూనివర్సిటీలలో కూడా విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. అందరం ఐక్యంగా పోరాడి ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయించుకోవాలన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ.. ఓయూ ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. వెంటనే అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు అనసూయ, శ్రీను, నాగరాజు, లక్ష్మణ్ గౌడ్, సహాయ కార్యదర్శులు నరేష్, శ్యామల, శివ, అంజమ్మ, పుష్ప, కుమార్, లక్ష్మణ్, మహేందర్, ఈశ్వరయ్య, వీరేశం, సుధాకర్ పాల్గొన్నారు.

పీవీకీ భారతరత్న రావడంలో కేసీఆర్ కృషి గొప్పది

మాజీ ఎఫ్‌డీసీ చైర్మెన్ అనిల్ కుర్మాచలం

నవతెలంగాణ-హైదరాబాద్

మాజీ దేశ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ అనిల్ కుర్మాచలం హర్షం వ్యక్తం చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, ఆర్థిక సంస్కరణల సృష్టికర్త అన్నింటికి మించి తెలంగాణ బిడ్డ కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు.

పీవీకి భారతరత్న రావడంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి గొప్పదని అభినందించారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల ద్వారా పీవీకి కేసీఆర్ సర్కారు ఘననివాళిని అర్పించిందని గుర్తు చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- వ్యతిరేకంగా 13 మంది కౌన్సిలర్ల ఓటు
- అవిశ్వాసం నెగ్గినట్టు ప్రకటించిన ఆర్డీఓ
- కంటతడి పెట్టిన చైర్‌పర్సన్ ఆర్థికగౌడ్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో కాంగ్రెస్‌కు చెందిన చైర్‌పర్సన్ ఆర్థికగౌడ్, బీఆర్ఎస్‌కి చెందిన వైస్ చైర్మెన్ కోరె కళమ్మ కుర్చీ దిగిపోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్థికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కళమ్మపై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చారు. దీంతో శుక్రవారం అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అందులో వైస్ చైర్‌పర్సన్ అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉన్నారు. చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక, మరో 13మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం కాగానే ఆర్డీవో అనంతరెడ్డి అవిశ్వాస తీర్మాన చట్టాన్ని సభ్యులకు వివరించారు. అనంతరం ఓటింగ్ పెట్టారు. ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆరుగు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ కౌన్సిలర్ ఒకరు అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలిపారు. 13మంది కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినట్టు ఆర్డీఓ అనంతరెడ్డి ప్రకటించారు. అదే విధంగా మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేసిన మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో వైస్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసానికి సైతం 13మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు. అవిశ్వాసం నెగ్గినట్టు ఆర్డీఓ ప్రకటించారు. నిబంధనల ప్రకారం కొత్త చైర్మెన్, వైస్ చైర్మెన్‌ను ఎన్నుకునేందుకు అవిశ్వాసం ప్రకటించిన తేదీ నుంచి 30 రోజుల గడువు ఉంటుంది. ఈ మధ్య కాలంలో మరోమారు కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చైర్మెన్ ఎన్నిక నిర్వహిస్తారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులతో పాటు అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన కౌన్సిలర్లు ఒక్కటయ్యారని మాజీ చైర్‌పర్సన్ కొత్త ఆర్థికగౌడ్ ఆరోపించారు. అవిశ్వాసంపై తోటి సభ్యులను నిలదీశారు. పోలీసులు ఆమెను బయటకు తీసుకొచ్చారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. కన్నీటి పరమంతమయ్యారు.



పారితోషికాలు వెంటనే విడుదల చేయాలి : ఆశాల డిమాండ్

- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు
- కలెక్టర్లకు వినతి

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు డిసెంబర్, జనవరి నెలల పారితోషికాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. గతంలో ప్రతి నెలా 2వ తేదీన పారితోషికాలు అకౌంట్లో పడేవి, ఇప్పుడు నేటికీ పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పారితోషికాలు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అప్పారావు మాట్లాడారు. ఆశా వర్కర్లంతా మహిళలు, బడుగు, బలహీన తరగతులకు చెందిన వారని, వారికి కనీస వేతనం లేదని అప్పు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారని అన్నారు. కనీసం ఫిక్స్‌డ్ వేతనం కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదన్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్నవి చాలీచాలని, అతి తక్కువ పారితోషికాలు కూడా సకాలంలో రాకపోవడంతో ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. అనంతరం ఆయా కలెక్టర్లకు వినతి పత్రం అందజేశారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చెపట్టి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు.

15 నుంచి ఈసెట్ దరఖాస్తుల స్వీకరణ

- 14న నోటిఫికేషన్ జారీ
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ నోటిఫికేషన్ ఈనెల 14న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్, ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఈసెట్ కన్వీనర్ శ్రీరాం వెంకటేశ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 16వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.500తో అదేనెల 22 వరకు, రూ.వెయ్యితో 28 వరకు అవకాశముందని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఏప్రిల్ 24 నుంచి 28 వరకు సవరణ చేసుకోవచ్చని కోరారు. మే ఒకటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈసెట్ రాతపరీక్ష మే ఆరో తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీసీలకు బడ్జెట్‌లో రూ. 20 వేలకోట్లు కేటాయించాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2024 బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులను రూ.20 వేల కోట్లకు పెంచాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా రాబోయే ఐదేండ్లలో బీసీలకు రూ.లక్ష కోట్లను కేటాయిస్తామంటూ సీఎం ఇచ్చిన హామీ మేరకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నియోజకవర్గంలో సమీకృత బీసీ, గిరిజన, మైనారిటీ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలకు భవనాలను ఏర్పాటు చేయాలని కోరారు.

నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com ఖమ్మం
శనివారం 10 ఫిబ్రవరి 2024

ఐద్వా అదాలత్

మాటలు కరువైతే...

భార్యాభర్తల బంధం అంటే ఒకరినొకరు అర్థం చేసుకువాలి. అలా కాకుండా ఒకరిని ఒకరు విమర్శించు కుంటూ, భర్త భార్యని, భార్య భర్తని తక్కువ చేసి చూస్తే భరించడం చాలా కష్టం. అలాంటి సంసారం సాఫీగా సాగదు. ఆ కుటుంబం లో ఎవరికీ మనశ్శాంతి ఉండదు. ఇద్దరూ ఒకరి పట్ల ఒకరూ ప్రేమగా ఉంటేనే జీవితం హాయిగా ఉంటుంది. ఇప్పుడిదంతా ఎందుకు చెబుతున్నానను కుంటున్నారా? అక్కడికే వస్తున్నా! సరిగ్గా ఇలాంటి సమస్యతోనే వంశీ ఐద్వా దగ్గరకు వచ్చాడు. ఇంతకీ అతని సమస్య ఏంటో మీరే చదవండీ...



'మేడం నా భార్య పేరు సుజాత, నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులూ లేవు. పిల్లలిద్దరూ ఉదయమే స్కూల్‌కి వెళ్ళి సాయంత్రం వస్తారు. వచ్చీరాగానే ఇంట్లో అరగంట ఉండి ట్యూషన్‌కి వెళ్ళి తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు వస్తారు. ఆ తర్వాత తినేసి ఏదైనా రాసుకునేదుంటే పూర్తి చేసుకుంటారు. లేకపోతే పడుకుంటారు. మళ్ళీ రేపు ఉదయం త్వరగా లేవాలి కదా! ఇది రోజూ పిల్లలు చేసే పని.

ఇక నేను ఉదయం ఆఫీస్‌కి వెళితే సాయంత్రం వస్తాను. వచ్చిన తర్వాత సుజాత నాతో సరిగా మాట్లాడదు. రోజూ ఏదో ఒక విషయంపై నాతో అనవసరంగా గొడవ పడుతుంది. ఎంత చెప్పినా పట్టించుకోదు. మా అమ్మా, అక్క వాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళతో మాత్రం బాగా మాట్లాడుతుంది. వాళ్ళకు ఏం కావాలన్నా తెచ్చిపెడుతుంది. ఎక్కడికి తీసుకెళ్ళమన్నా తీసుకెళుతుంది. ఓ ఆరు నెలలు వాళ్ళు ఇంటికి రాకపోతే ఫోన్ చేసి మరీ పిలుస్తుంది. 'ఎందుకు రావడం లేదు' అంటూ అడుగుతుంది. పండగలకు రమ్మని పిలుస్తుంది. ఇలా వాళ్ళతో మాత్రం బాగానే ఉంటుంది. నాతో మాత్రం గొడవ పడుతుంది. తను ఎందుకు ఇలా చేస్తుందో అర్థం కావడం లేదు. ఆమె ఎప్పుడు ఎక్కడికి వెళతానన్నా నేను అడ్డుచెప్పను. నా జీతం మొత్తం కూడా ఆమెకే ఇచ్చేస్తాను. దానితో ఆమెకు కావల్సినవి కొనుక్కుంటుంది. ఇదెందుకు అనవసరంగా కొన్నావు అని కూడా అడగను. ఆమె పొదుపు చేసినా, ఖర్చు చేసినా అడగను. అయినా గొడవ చేస్తుంది. నాకు నరకంలా అనిపిస్తుంది. మా కుటుంబ సభ్యులందరూ ఆమెకే సపోర్ట్. ఆమె నాపై గొడవ పడుతుందన్నా ఎవ్వరూ నమ్మరు. పైగా నన్నే తిడతారు. 'సుజాత చాలా మంచిది, అలాంటి అమ్మాయి నీకు భార్య కావడం నీ అదృష్టం' అంటుంది మా అక్క. నాతో ఆమెకున్న నమస్య ఏంటో, నాతో ఎందుకు అలా ఉంటుందో తెలుసుకుని నన్ను ఈ నరకం నుండి బయటపడేయండీ' అని చెప్పుకొచ్చాడు.

అతను చెప్పింది మొత్తం విని సుజాతను పిలిపించి మాట్లాడితే 'నేను ఆయనతో కావాలని ఎప్పుడూ గొడవ పడలేదు. ఆయన కుటుంబ సభ్యులు వచ్చినా వాళ్ళను నా సొంత వాళ్ళలా చూసుకుంటాను. వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం వంశీ ఇంట్లోనే ఉంటాడు. బయటకు తీసుకెళతాడు. కానీ నన్ను, పిల్లల్ని ఎప్పుడైనా బయటకు తీసుకెళ్ళమంటే తీసుకెళ్ళడు. టైం లేదు అంటాడు. అదే వాళ్ళ కుటుంబ సభ్యులు అడిగితే మాత్రం సెలవు పెట్టి మరీ తీసుకెళతాడు. వాళ్ళ ముందు మాత్రం నాతో బాగుంటాడు. నాకు కావల్సింది ఆయనే దగ్గర ఉండి మరీ కొని పెడతాడు. అలా చేయకపోతే నేను ఆయనపై అరుస్తాను. గొడవ పడతాను. నేను ఆ మాత్రం అరవకపోతే నన్ను అస్సలు పట్టించుకోడు. కనీసం తిన్నావా, ఏం చేస్తున్నావు అని కూడా అడగడు. వంశీ చాలా మంచి వాడే. కానీ నేనూ నా పిల్లలు ఆయనా కలిసి రోజులో కనీసం ఐదు నిమిషాలన్నా గడపాలంటే అస్సలు కుదరదు. కనీసం రాత్రిపూటైనా అందరం కలిసి భోజనం చేద్దామంటే వినడు. 'మీరు తినండి నేను తర్వాత తింటాను' అంటారు. అప్పుడు నేను కొంచెం గొడవ చేస్తాను. దాంతో మాతో తింటానికి వస్తారు. అందుకే నేను ఆయనతో గొడవ పడతాను. ఏదైనా గొడవ చేస్తేనే ఆయన మాట వింటారు. అదే వాళ్ళ అమ్మ, అక్క వాళ్ళు వస్తే మేం పిలవక ముందే వచ్చి కూర్చుంటారు. వాళ్ళు ఉంటే నాతో ప్రేమగా ఉంటారు. లేదంటే నాతో అస్సలు మాట్లాడరు. అందుకే నేను వాళ్ళను రమ్మని పిలుస్తుంటాను.

నేను పడుకున్న తర్వాత ఎప్పటికో బెడ్‌రూంలోకి వస్తారు. ఇది ఎంత వరకు సరైనది మీరే చెప్పండి. అందుకే ఆయనపై ఎప్పుడూ నేను గొడవ పడుతుంటాను. నాకోసం కనీసం కొంత సమయమైనా కేటాయించాలి కదా. అలా ఉంటే నేనెందుకు గొడవ చేస్తాను. మాకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందీ లేదు. నా సమస్య మొత్తం ఆయన నాకు టైం ఇవ్వడం లేదు' అని చెప్పి బాధపడింది.

ఇదే విషయం గురించి వంశీని అడిగితే 'నేను రోజూ ఆమెతోనే ఉంటున్నాను. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత కనీసం బయటకు కూడా వెళ్ళను. రాత్రి 8గంటల తర్వాత ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తాను. కాబట్టి రాత్రి పడుకోవడం కాస్త ఆలస్యమవుతుంది. అప్పటికే సుజాత పడుకుంటుంది. తను ఇంట్లో ఉండి మధ్యాహ్నం ఆన్‌లైన్ జాబ్ చేస్తుంది. నేను ఎప్పుడైనా ఇంట్లో ఉంటే అప్పుడు ఆమె నాతో మాట్లాడదు. ఆమె వర్క్ ఆమె చేసుకుంటుంది. అప్పుడు నేను ఆమెను ఇబ్బంది పెట్టలేదు. నీవు నాకు టైం ఇవ్వడం లేదు అని అడగను' అని చెప్పాడు.

వారిద్దరి మాటలు విన్న తర్వాత ఇద్దరి మధ్య పెద్దగా గొడవలు ఏమీ లేవు. కేవలం కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే కనిపించింది. అందువల్లే ఇద్దరూ గొడవ పడుతున్నారు. మనశ్శాంతి లేకుండా జీవిస్తున్నారనిపించి వారితో 'ముందు మీరిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం అలవాటు చేసుకోండి. పిల్లలు ట్యూషన్ నుంచి రాగానే అందరూ కలిసి భోజనం చెయ్యడం ఓ పనిగా పెట్టుకోండి. మీరూ, పిల్లలూ కలిసి ప్రతి ఆదివారం సరదాగా బయటకు వెళ్ళండి. పిల్లలు మీకేమైనా చెప్పాలంటే అప్పుడు వాళ్ళు మీతో మాట్లాడతారు. మీరు రాత్రి పూట పార్ట్‌టైం జాబ్ చేస్తున్నా అంటున్నారు. మీరు చేస్తున్న రెగ్యులర్ జాబ్ మంచిదే. జీతం బాగా వస్తుంది. ఆర్థికంగా కూడా సమస్యలు లేవు. ఇక అలాంటప్పుడు అనవసరంగా పార్ట్‌టైం జాబ్ చేస్తూ మీ ఆనందాన్ని ఎందుకు పాడు చేసుకోవడం. వెంటనే దాన్ని ఆపేయండి. ఇద్దరి మధ్య మాటలు కరువైతే మీ సమస్య ఎప్పటికీ ఇలాగే ఉంటుంది. అందుకే మీరిద్దరూ కలిసి కాస్త సమయం గడపండి. అప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఇవన్నీ మీరు పాటిస్తే మీ జీవితం, మీ పిల్లల భవిష్యత్ సంతోషంగా ఉంటుంది. లేదంటే మీరంతా యంత్రాల్లా తయారవుతారు. ముఖ్యంగా పిల్లల భవిష్యత్ ఘోరంగా తయారవుతుంది' అని చెప్పాము.



'సుజాత గొడవ చేస్తేనే మీరు ఆమెతో మాట్లాడతారు. లేదంటే లేదు. అందుకే ఆమె మీతో గొడవ పడుతుంది. మీ అమ్మా, అక్క ఉన్నప్పుడే ఆమెతో మంచిగా ఉంటారు. అందుకే ఆమె వాళ్ళను ఎక్కువగా మీ ఇంటికి పిలుస్తుంది. ఆమె మీ నుండి ప్రేమ కోరుకుంటుంది. అది అందిస్తే చాలు, మీ మధ్య ఎలాంటి గొడవలూ ఉండవు'

అలాగే 'సుజాత గొడవ చేస్తేనే మీరు ఆమెతో మాట్లాడతారు. లేదంటే లేదు. అందుకే ఆమె మీతో గొడవ పడుతుంది. మీ అమ్మా, అక్క ఉన్నప్పుడే ఆమెతో మంచిగా ఉంటారు. అందుకే ఆమె వాళ్ళను ఎక్కువగా మీ ఇంటికి పిలుస్తుంది. ఆమె మీ నుండి ప్రేమ కోరుకుంటుంది. అది అందిస్తే చాలు, మీ మధ్య ఎలాంటి గొడవలూ ఉండవు' అని అర్థమయ్యేలా చెప్పాము. దాంతో ఇద్దరూ అర్థం చేసుకొని మేము చెప్పిన ప్రకారమే నడుచుకుంటామని చెప్పి వెళ్ళిపోయారు.

- వై. వరలక్ష్మి 9948794051

తొక్కలతో అందంగా...

అందంగా ఉండాలన్న ఆశ ఎవరికి ఉండదు చెప్పండి! దానికోసం వేలకు వేలు బ్యూటీ పార్లర్లకు పెట్టేస్తుంటారు కూడానూ. అయితే ఇలా ఖర్చు పెట్టడం అందరి వల్లా కాదు కదా. బ్యూటీ పార్లర్లకు వెళ్లకుండానే ఇంట్లోనే అందంగా మెరిసిపోయేందుకు హోమ్ రెమిడీస్ చాలానే ఉన్నాయి. అందులో నారింజ తొక్కలతో చేసుకునే స్క్రబ్ చర్మం నిగారించేలా చేస్తుంది. అయితే ఈ నారింజ స్క్రబ్‌ను ఎలాంటి సమయాల్లో వాడొచ్చు, దీని వల్ల ఉపయోగాలేంటి, ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం...

రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం వల్ల ముఖానికి, చేతులకు, కాళ్లకు టాన్ పట్టి నల్లగా మారుతాయి. అందులోనూ ఇప్పుడు రానున్నది వేసవి కాలం. కొంచెం సేపు ఎండలో బయటకి వెళ్ళి వచ్చినా బయటి వేడికి, చెమటకు ముఖం కాంతి హీనంగా మారుతుంది. ఇటువంటి సమయంలో నారింజ తొక్కలతో తయారు చేసిన స్క్రబ్‌ను ఉపయోగించి ముఖం కాంతి వంతంగా అయ్యేలా చేసుకోవచ్చు. అంతేకాదు, ఈ స్క్రబ్‌తో పాదాలు, చేతులకు కూడా మసాజ్ చేసుకుంటే టాన్ పోయి, మెరుపు సొంతమవుతుంది. అంతేకాదు ఈ స్క్రబ్ వల్ల డీ హైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. చర్మం తేమగా మారుతుంది. చర్మం మృదువుగా, సున్నితంగా ఉంటుంది. దీని వల్ల మీరు మరింత అందంగా కనిపిస్తారు.

ప్రయోజనాలు

- నారింజ తొక్కలో సహజ ఆమ్లాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని చాలా సున్నితంగా మురికి లేకుండా తొలగిస్తాయి.
- మృత కణాలను, మలినాలను తొలగిస్తాయి. చర్మం కింద భాగం దెబ్బ తినకుండా కాపాడతాయి.
- నారింజ తొక్కలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని పాదాలను వాపు వల్ల కలిగే అసౌకర్యం నుండి కాపాడతాయి.
- ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.
- నారింజలోని విటమిన్ సి చర్మాన్ని దెబ్బతీసే వైరస్, బ్యాక్టీరియాల నుంచి కాపాడుతుంది.
- యాంటీ ఏజింగ్ లక్షణాలు నారెంజ తొక్కలో ఎక్కువ. కాబట్టి ఆరంజ్ పీల్ స్క్రబ్ చేసుకోవడం వల్ల చర్మానికి చాలా మేలు జరుగుతుంది.
- డార్క్ స్పాట్స్, మచ్చలు పోతాయి.

స్క్రబ్ తయారీ

నారింజ తినే ముందు శుభ్రంగా కడిగి ఉపయోగిస్తాం కాబట్టి, ఈ తొక్కలను గాలికి ఆరబెట్టాలి. ఇవి బాగా ఆరడానికి కొన్ని రోజులు పడుతుంది. బాగా ఎండిపోయాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని కంటైనర్‌లో భద్రపరుచుకోవాలి. స్క్రబ్ చేయడానికి ముందు ఒక గిన్నెలో నారింజ తొక్క పొడిని, కాస్త చక్కెర, ఉప్పు వేసి బాగా కలపాలి. అందులో కాస్త ఆలీవ్ నూనె లేదా కొబ్బరి నూనె వేసి ఈ మొత్తం మిశ్రమాన్ని బాగా కలుపుకోవాలి. దీన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నుంచి పది నిమిషాల పాటు వృత్తాకార పద్ధతిలో మసాజ్ చేస్తూ ఉండాలి. తర్వాత కొంచెం సేపు అలాగే వదిలేయాలి. ఆరిపోయాక గోరువెచ్చటి నీటితో ముఖాన్ని మళ్ళీ సున్నితంగా రుద్దుతూ శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికొకసారి లేదా రెండు వారాలకొకసారి చేస్తూ ఉంటే ముఖం క్లీనవుతుంది.



పీవీకి భారతరత్న ఇవ్వటం పట్ల రేవంత్, కేసీఆర్ సహా పలువురి హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించటం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించన గొప్ప వ్యక్తి పీవీ అని కొనియాడారు. ఆయనకు భారత రత్న ప్రకటించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆలస్యమైనా పీవీకి ఆ గౌరవం దక్కడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. 'నా తరపున, సభ తరపున, రాష్ట్ర ప్రజల తరపున పీవీ కుటుంబ సభ్యులకు సీఎం శుభాకాంక్షలు' అని రేవంత్ అసెంబ్లీలో తెలిపారు.దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్న అవార్డు పీవీకి దక్కటం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని చరణ్‌సింగ్, ఎల్‌కె అద్వానీ, కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌లకు భారత రత్న రావటం సంతోషకరమని తెలిపారు.

పీవీతో పాటు ప్రపంచంలోనే అధిక జనాభాకలిగిన దేశ వాసుల ఆకలి తీర్చేందుకు తన జీవితాంతం కృషి చేసిన ఎంఎస్ స్వామినాథన్‌కు భారత రత్న దక్కటం హర్షనీణీయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు.పీవీ నర్సింహారావుకు భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌరసన్మానం భారత రత్నను ప్రకటించటం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.పీవీకి భారత రత్న ప్రకటించటం హర్షించదగిందని మాజీ మంత్రి టి హరీశ్‌రావు తెలిపారు.

వ్యంగ్యం మానుకుంటే మంచిది

- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సలహా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటల్లో వ్యంగ్యం తగ్గించుకుంటే మంచిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తర్వాత ఆయన ఈ కామెంట్స్ చేశారు. అంతకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో "80వేల పుస్తకాలు చదివిన మేధావి... ఆయనే ఇంజినీర్, ఆయనే డిజైనర్, ఆయనే డ్రాఫ్ట్‌మెన్, ఆయనే తాపీ మేస్త్రీ... వందరూపాయలు పెట్టి పెట్రోల్ కొని, పదిపైసల అగ్గిపెట్టె కొనడం మర్చిపోయిన ఆయన... రాజకుమారుడు... మామా అల్లుళ్లు...అంటూ పలుమార్లు ప్రస్తావించారు. దీనితో ఒకింత అసహనానికి గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పై విధంగా వ్యాఖ్యానించారు. సీఎం ప్రసంగానికి పలుమార్లు అడ్డుతగిలే ప్రయత్నం చేశారు. సభ్యులంతా మాట్లాడాక, మీకు అనుమతి ఇస్తానంటూ స్పీకర్ ప్రసాదరావు ఆయన్ని పలుమార్లు నియంత్రించారు. ఒకదశలో 'అగ్గిపెట్టె' అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ "అప్పటి భావోద్వేగాలు మీకు అర్థం కావు. మా ఉద్యమాన్ని కించపరిచే ప్రయత్నం చేస్తే మీ ఇష్టం. అగ్గిపెట్టె విషయం ఇంకోసారి ప్రస్తావించొద్దు" అని అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ సభ్యులు ముసిముసిగా నవ్వుకోవడం కనిపించింది.

వక్ఫ్ బోర్డు అక్రమాలపై సీబీసీఐడి విచారణ జరిపించాలి

- ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వక్ఫ్‌బోర్డు భూముల ఆక్రమణలపైనా, అక్రమాలపైనా సీబీసీఐడీ విచారణ జరిపించాలని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. పహడీషరీఫ్ ప్రాంతంతో పాటు పాతబస్తీలోని రోడ్లకు మరమ్మతులు చేయించాలనీ, కొత్త రోడ్లు వేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రార్థనా మందిరాలకు దగ్గరలో వైన్స్‌లు, బార్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలనీ, దానిపై ఒక విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల సమస్యను వెంటనే పరిష్కరించాలనీ, కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

భారత రత్నాలు

(మొదటిపేజి తరువాయి)

(1971-73)గా బాధ్యతలు నిర్వర్తించారు.

ఇక హరిత విప్లవ పితామహుడైన ఎంఎస్ స్వామినాథన్ దేశానికి ఎనలేని సేవలందించారు. ఎంఎస్ స్వామినాథన్‌ను 1967లో పద్మశ్రీ, 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1972లో పద్మ భూషణ్, 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్, 1989లో పద్మ విభూషణ్ అవార్డులు వరించాయి.ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ దేశ ఐదో ప్రధానిగా పనిచేసిన దివంగత చౌదరి చరణ్ సింగ్‌ను రైతుల సంక్షేమం కోసం కృషిచేసిన అచంచలమైన అంకితభావానికి మరణానంతరం భారతరత్నతో సత్కరించుకుంటున్నామన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర హోం మంత్రిగా పని చేసిన చరణ్ సింగ్ రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చేసిన ప్రతిఘటన, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత దేశానికి స్ఫూర్తినిచ్చేవిగా నిలిచాయనీ, దేశానికి ఆయన చేసిన సాటిలేని సేవలను గౌరవించడం ప్రభుత్వానికి దక్కిన అదృష్టమని ప్రధాని మోడీ కొనియాడారు.

"మాజీ ప్రధాని పీవీ నరసింహారావును భారతరత్నతో సత్కరించటం ఆనందంగా ఉంది. ప్రముఖ పండితుడు, రాజకీయవేత్త అయిన నరసింహారావు వివిధ హోదాల్లో విస్తృత సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్, అసెంబ్లీ సభ్యునిగా ఎన్నో ఏండ్లుగా ఆయన విశేష కృషి చేశారు. నరసింహారావు ప్రధానిగా పనిచేసిన కాలం ఆర్థిక రంగంలో కొత్త శకానికి నాంది పలికింది" అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు."దేశానికి చేసిన విశేష కృషికి గానూ హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వడం సంతోషకరం. సంక్షేమానికి వ్యవసాయం, రైతులు మూలస్తంభాలు. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ఆయన వ్యవసాయంలో పెనుమార్పులు తీసుకువచ్చారు. దేశ వ్యవసాయాన్ని ఆధునీకరించే దిశగా విశేష కృషి చేశారు. ఒక ఆవిష్కర్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఆయన ముందుచూపు వ్యవసాయం రూపరేఖలు మార్చడమే కాకుండా ఆహార భద్రతకు హామీ ఇచ్చింది" అని ప్రధాని కొనియాడారు.

స్వాగతిస్తున్నాం : సోనియా గాంధీ

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ భారత రత్న అవార్డులపై స్పందించారు. పార్లమెంట్‌లో మీడియాతో 'వారికి భారత రత్న ఇవ్వడాన్ని ఖచ్చితంగా స్వాగతిస్తున్నాను' అని అన్నారు.

నాన్న బతికున్నప్పుడు ఇచ్చుంటే సంతోషించేవారు: సౌమ్య స్వామినాథన్

స్వామినాథన్ కుమార్తె, మాజీ చీఫ్ సైంటిస్ట్, డబ్ల్యూహెచ్ఓ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ స్పందించారు. నాన్న బతికున్నప్పుడు ఈ అవార్డు దక్కి ఉంటే సంతోషించి ఉండేవారని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి, రైతులకు ఆయన చేసిన సేవలకు గాను ఈ గుర్తింపు దక్కడంపై సంతోషంగాను, గర్వంగానూ ఉందన్నారు. కానీ ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదని, గుర్తింపుకోసం ఎదురు చూడలేదని తెలిపారు. చాలా అవార్డులు ఆయనకు దక్కాయని పేర్కొన్నారు. తను చేసిన పనికి వచ్చిన ఫలితాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టేవారని, ఆయన జీవితమంతా రైతుల ప్రయోజనాల కోసం పాటు పడ్డారని తండ్రి సేవలను ఆమె గుర్తు చేసుకున్నారు. దేశంలో ఏ మూలకెళ్లినా ఆయన కలిసిన రైతులను గుర్తు పెట్టుకునేవారని అన్నారు.

'ఓటుకు నోటు'కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

(మొదటిపేజి తరువాయి)

తెలంగాణ వెలుపల మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేయాలని బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మద్ అలీ, కల్వకుంట్ల సంజయ్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది పి మోహిత్ రావు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ్ దవే, డి శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్‌లు వాదనలు వినిపించారు. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఈ కేసులో వెంటనే ట్రయల్ కూడా మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందని నివేదించారు. ఇప్పుడు విచారణ మొదలైతే... దానిపై ప్రభుత్వ పెద్దలు ప్రభావం చూపే అవకాశముందని వాదనలు వినిపించారు. ఈ వాదనలపై జోక్యం చేసుకున్న జస్టిస్ గవాయి... ఒకవేళ ట్రయల్ పై అలాంటి ప్రభావం ఉందనుకుంటే తాము ఎలా చూస్తూ ఉంటామని వ్యాఖ్యానించారు. అయితే ఈ కేసులో ట్రయల్‌ను నిలుపుదల చేస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డిపై 88 క్రిమినల్ కేసులు నమోదైనట్టు తెలిపారు. పలు సందర్భాల్లో పోలీసులను బెదిరించేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని ధర్మాసనానికి నివేదించారు. కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలమనీ, అలాగే ఈ కేసులో ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు జోక్యం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరారు. కాగా ఈ కేసు విచారణ బదిలీపై తెలంగాణ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి, ఇతర ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై నాలుగు వారాల్లో స్పందించాలని పేర్కొంది.

అక్షరానికి మరణం లేదు

పాటలను జీవితంగా మలుచుకుని చివరి వరకు పాటుపడిన రవ్వా శ్రీహరి, గద్దర్ పేర్లను ఈ పుస్తక ప్రదర్శనలో పెట్టి సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకం అందరికి అందుబాటులో ఉన్నప్పుడే చదువు, జ్ఞానం విస్తరిస్తుందని అన్నారు. అయితే కేవలం వ్యక్తులు, సంస్థలతోనే ఇది సాధ్యం కాదని, ప్రభుత్వాలు కూడా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. గత పదేండ్లుగా తెలంగాణలో గ్రంథాలయాలు నిర్వీర్యమయ్యాయనీ, వాటిని పునరుద్ధరించే బాధ్యతను కొత్త ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు. సరైన నిధులు కేటాయించి, నియామకాలు చేపట్టడం ద్వారా వాటికి పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు. ప్రజాపక్షం సంపాదకులు కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పుస్తకాలను కొనుగోలు చేసి అన్ని గ్రంథాలయాలకు అందించాలని సూచించారు. సీనియర్ జర్నలిస్టు జహీరుద్దీన్ అలీఖాన్ లాంటి వారి పేర్లను ఈ ప్రదర్శనలోని వేదికలకు పెట్టడం హర్షనీయమన్నారు. నవతెలంగాణ ఎడిటర్ ఆర్. సుధా భాస్కర్ మాట్లాడుతూ చదువుతో జ్ఞానం పెరుగుతుందనీ, తద్వారా ప్రశ్నించే గుణం అందరికి అలవడుతుందని అన్నారు. ప్రశ్నను జీర్ణించుకోలేని ప్రభుత్వాలు నిర్బంధాలను పెంచుతాయనీ, ఈ వేదిక మీదున్న ఒకరు బాధితులని మిగిలిన వారిపై కూడా రావచ్చని చెప్పారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత పెరిగి, అరచేతిలో ప్రపంచం కనిపిస్తున్నా ప్రజల్లో పుస్తక పఠనం తగ్గక పోవడం గొప్ప పరిణామమన్నారు. ఇటీవల కోల్‌కత్తాలో 14 రోజుల పాటు జరిగిన పుస్తక ప్రదర్శనను 29 లక్షల మంది సందర్శించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. సభాధ్యక్షులు జూలూరు గౌరి శంకర్ మాట్లాడుతూ గత 35 ఏండ్లుగా కాలాతీతంగా వస్తున్న మార్పులను తట్టుకుంటూ ఎంతో మంది కొత్త రచయితలను, రచనలను, పాఠకులకు ఈ పుస్తక ప్రదర్శన పరిచయం చేసిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు రాజేశ్వర్ రావు, కార్యదర్శి ఆర్.వాసు, గద్దర్ కూతురు వెన్నెల, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు కోయ చంద్రమోహన్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను సందర్శించిన మంత్రి జూపల్లి

తెలంగాణ కళాభారతిలో కొలువు దీరిన 36వ జాతీయ పుస్తక ప్రదర్శనను సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సకల రుగ్మతలకు విరుగుడు పుస్తకమేనని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నాడనీ, వాటినుంచి పుస్తక పఠనం స్వాంతన చేకూరుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు పుస్తకాలను తమ నేస్తాలుగా మలుచుకోవాలని ఆయన సూచించారు.

భావ ప్రకటనకు సంకెళ్లు

న్యూఢిల్లీ : భారత్‌లో భావప్రకటనా స్వేచ్ఛకు చోటు ఉండటం లేదు. బీజేపీ పాలనలో ఇది చాలా తీవ్రమైంది. ఐక్యరాజ్యసమితితో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు, సంస్థలూ ఇదే విషయాన్ని చెప్తున్నాయి. బీజేపీ సీనియర్ నాయకులు ఎల్.కె అద్వానీకి కేంద్రంలోని మోడీ సర్కారు భారతరత్న అవార్డును ప్రటకించిన విషయం తెలిసిందే. కేంద్రం నిర్ణయాన్ని పలువురు తప్పుబట్టారు. 'హిందూత్వ' సిద్ధాంతాన్ని భుజాన వేసుకొని, ఒక వర్గం వారిని శత్రువులుగా చిత్రీకరించి.. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతకు కారకుడైన వ్యక్తికి భారతరత్నను ప్రకటించటమేంటని పలువురు ప్రశ్నించారు. మహారాష్ట్రలోని ఒక జర్నలిస్టు కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేశారు. అద్వానీకి భారతరత్నను ప్రటకించటంపై నిఖిల్ వాగ్లే విమర్శించారు. ఈ మేరకు తన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వ్యక్తపరిచారు. తన భావాన్ని ప్రకటించటమే ఇప్పుడు ఆ జర్నలిస్టుకు శాపమైంది. దీని ఫలితంగా ఇప్పుడు ఆయనపై కేసు నమోదైంది. బీజేపీ నాయకుడు చేసిన ఫిర్యాదు మేరకే మహారాష్ట్ర పోలీసులు సదరు జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయటం గమనార్హం. బీజేపీకి చెందిన సునీల్ దేవధర్.. విశ్రాంబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కొద్ది రోజులకే వాగ్లేపై ఐపీసీలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదైంది. అయితే, వాగ్లేపై పోలీసు కేసు నమోదు చేయటాన్ని సామాజిక కార్యకర్తలు తప్పుబడుతున్నారు. భావప్రకటనా స్వేచ్ఛను రాష్ట్ర సర్కారు హరిస్తున్నదని ఆరోపిస్తున్నారు.

రూ.570 కోట్లకు పైగా విలువైన బాండ్‌ల విక్రయం

న్యూఢిల్లీ : ఈ ఏడాది జనవరి 2 నుంచి 11 వరకు కొనసాగిన ఎలక్టోరల్ బాండ్ల విక్రయం తాజా దశలో రూ. 570 కోట్లకు పైగా విలువైన ఎలక్టోరల్ బాండ్లు విక్రయించబడ్డాయి. సామాజిక కార్యకర్త కమోడోర్ లోకేష్ బాత్రా దాఖలు చేసిన సమాచార హక్కు (ఆర్టీఐ) ప్రశ్నకు ఇది సమాధానంగా వెలువడింది. తాజా దశ అమ్మకం అనేది.. గతేడాది నవంబర్‌లో స్కీమ్ చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు నాలుగు పిటిషన్లను విచారించడం ప్రారంభించినప్పటి నుంచి విక్రయించబడిన రెండో బ్యాచ్ ఎలక్టోరల్ బాండ్‌లు, 2018లో పథకం ప్రారంభించబడినప్పటి నుంచి విక్రయించబడిన 30వ బ్యాచ్ ఎలక్టోరల్ బాండ్‌లు.బాత్రా ప్రశ్నకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఇచ్చిన సమాధానం ప్రకారం.. బెంగళూరు, చెన్నై, గాంధీనగర్, కోల్‌కతా, హైదరాబాద్, న్యూఢిల్లీ, విశాఖపట్నం, ముంబయి, జైపూర్ ఎస్బీఐ శాఖలలో రూ. 5,71,80,03,000 విలువైన ఎలక్టోరల్ బాండ్‌లు విక్రయించబడ్డాయి. రూ. 1,000, రూ. 10,000, రూ. 1 లక్ష మరియు రూ. 1 కోటి విలువ కలిగిన 897 బాండ్‌లలో దాదాపు సగం(415) కోల్‌కతాలో విక్రయించబడ్డాయి. అత్యధికంగా అమ్ముడైన రూ. 1 కోటి విలువ కలిగిన బాండ్‌లు 540 (60 శాతం వరకు) కాగా.. ఇందులో కోల్‌కతా(161), హైదరాబాద్ (131), చెన్నై (73)లు ముందు వరుసలో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ విక్రయం తదుపరి దశ ఫిబ్రవరి లేదా మార్చిలో జరుగుతుందని సమాచారం.

స్వేచ్ఛ ఉంటేనే ఆత్మగౌరవం

(మొదటిపేజి తరువాయి)

కార్మికులకు రూ.11వేలు తగ్గుతుందని గుర్తు చేశారు. రకరకాల పేర్లతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, క్యాజువల్, స్కీం వర్కర్లకు ఆ జీవో తీరని అన్యాయం చేసిందని చెప్పారు. పని రూపం ఒకే విధంగా ఉన్నా.. వేతనాల్లో తేడాలున్నాయని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే ఆటోలకు, ఫ్రీ బస్సు ప్రయాణానికి లంకె పెట్టి పంచాయతీ సృష్టిస్తున్నారని చెప్పారు. ఆటో కార్మికులపై కొత్తకొత్త స్రేమలు ఒలకబోస్తున్నారని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలను నగరాలకే పరిమితం చేయకుండా వెనుకబడ్డ ప్రాంతాలకు విస్తరించాలని కోరారు.విద్య వైద్యం తదితర అంశాలపై గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదని గుర్తు చేశారు. రైతాంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.చిన్ననీటి తరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవినీతి అనకొండల భరతం పట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కోరారు.ఎన్ఐఏ దాడులను ఆపాలనీ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కూనంనేని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నవచిత్రం



గోపీచంద్, మాళవిక శర్మ

ఏదో..ఏదో మాయ

గోపీచంద్ నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ఎ.హర్ష దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ఏదో ఏదో మాయ..'ని మేకర్స్ విడుదల చేశారు.

టీజర్ ప్రధానంగా సినిమా బ్యాక్‌డ్రాప్‌ను, గోపీచంద్ పాత్రను టఫ్ కాప్‌గా పరిచయం చేయడంపై దృష్టి పెడితే, ఫస్ట్ సింగిల్ ద్వారా భీమా ప్రేమ కథను ప్రజెంట్ చేశారు. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ అద్భుతమైన రొమాంటిక్ నంబర్‌కి చేసిన కంపొజింగ్ చాలా ప్లజెంట్‌గా ఉంది. విన్న వెంటనే ఈ పాటతో ప్రేమలో పడతారనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యం హీరో తాను గాఢంగా ప్రేమిస్తున్న అమ్మాయి పట్ల చూపే ఆరాధనను వర్ణిస్తుంది. అతను ఆమెతో సమయం గడపడానికి తన ఇగోలను పక్కన పెట్టే పోలీసు. టీచర్‌గా పరిచయమైన మాళవిక శర్మ కూడా పిల్లలతో కలిసి మెలిసి వారికి సహాయం చేస్తూ కనిపించింది. గోపీచంద్, మాళవిక జంట తెరపై బ్యూటీఫుల్ కెమిస్ట్రీని పంచుకున్నారు. అనురాగ్ కులకర్ణి వాయిస్ కట్టిపడేసింది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ మరో కథానాయిక. మహా శివరాత్రి కానుకగా మార్చి 8న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది.

ఈ చిత్రానికి డీవోపీ: స్వామి జె గౌడ, సంగీత దర్శకుడు: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైనర్: రమణ వంక, ఎడిటర్: తమ్మిరాజు, డైలాగ్స్: అజ్జు మహంకాళి, ఫైట్స్: రామ్-లక్ష్మణ్, వెంక, డాక్టర్ రవివర్మ

యాత్ర2కి విశేష ప్రేక్షకాదరణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి పేదల కష్టనష్టాలను తెలుసుకుని వాటిని తీర్చటానికి చేసిన పాదయాత్ర ఆధారంగా రూపొందిన సినిమా 'యాత్ర'. దీనికి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వై.ఎస్.ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించగా, ఆయన తనయుడు వై.ఎస్.జగన్ పాత్రలో జీవా నటించారు. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిస్థితులు, వై.ఎస్.జగన్ పేదల కోసం చేసిన పాదయాత్ర ఆధారంగా 'యాత్ర 2' చిత్రాన్ని రూపొందించారు.

ఈనెల 8న విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఘన విజయాన్ని సాధించడంతో చిత్రయూనిట్ శుక్రవారం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మహి వీ రాఘవ్ మీడియాతో మాట్లాడుతూ, 'నేను తీసిన 'యాత్ర 2' కొందరికి నచ్చింది.. ఇంకొందరికి నచ్చలేదు.. తీసిందే పొలిటికల్ మూవీ, రాజకీయ నాయకుడి మీద కాబట్టి.. భిన్నాభిప్రాయాలు రావడం సహజం. కానీ ఓ స్టోరీ టెల్లర్‌గా నేను అనుకున్న కథ, స్క్రిప్ట్‌ను తీశాను. కొంత మంది పాజిటివ్‌గా రివ్యూ ఇచ్చారు. ఇంకొంత మంది నెగెటివ్ రివ్యూలు ఇచ్చారు. ఫిల్మ్ మేకర్లుగా సినిమాను తీయడం మా బాధ్యత. విమర్శించారు కదా? నేనేమీ దాన్ని డిఫెండ్ చేసుకోను. మా టెక్నికల్ టీంకి, మమ్ముట్టి, జీవాకి థ్యాంక్స్. మంచి లక్ష్యంతో తీసిన సినిమాకి ఇంకా మంచి ఫలితం వస్తుందని ఆశిస్తున్నా. సీఎం వైఎస్ జగన్ త్వరలోనే సినిమా చూస్తారు' అని తెలిపారు.



మహి.వి.రాఘవ్



యూత్‌కి నచ్చే భిన్న ప్రేమకథా చిత్రం

సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఐ హేట్ లవ్'. నేనూ ప్రేమలో పడ్డాను అనేది ఉపశీర్షి. ఈనెల 16న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వీరశంకర్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది సహజత్వంగా బాగా చిత్రీకరించారు. అన్ని వర్గాలవారికి ఈ చిత్రం నచ్చుతుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం మంచి సక్సెస్ అవుతుంది' అని తెలిపారు. 'కథాపరంగా ఎక్కడా రాజీపడకుండా అద్భుతంగా తెరకెక్కించాం. గోదావరి ఒడ్డున కూర్చుంటే ఎంత ప్రశాంతంగా ఉంటుందో మా సినిమాని అంత ప్రశాంతంగా ఆస్వాదించ వచ్చు' అని నిర్మాత డాక్టర్ బాల రావి అన్నారు. కో- ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ మాట్లాడుతూ, 'మంచి చిత్రాలను ఎప్పుడూ ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో ఈ చిత్రం తీశాం' అని చెప్పారు. 'గోదావరి జిల్లా యాసతో పూర్తిగా కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. ఇది యూత్‌ని బాగా ఆకట్టుకునే సందేశాత్మక కథ. పెద్దపల్లి రోహిత్ సంగీతాన్ని అందించారు. పాటలకి మంచి స్పందన వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏస్ కె యల్ ఎమ్ మోషన్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని దర్శకుడు వెంకటేష్.వి అన్నారు.



చాంపియన్స్ ట్రోఫీకి మరో సవాల్!

- వేదికతో పాటు షెడ్యూల్‌పై అనిశ్చితి
- పలు గ్లోబల్ టీ20 లీగ్‌లకు ఆటంకం

దుబాయ్ : 2025 చాంపియన్స్ ట్రోఫీ వరుస సమస్యల్లో ఇరుక్కుంది. భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌లో చాంపియన్ ట్రోఫీ ఆడలేమని భారత క్రికెట్ బోర్డు ఇప్పటికే తేల్చి చెప్పింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులపై ఇటీవల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసింది. అయినా, భారత క్రికెట్ బోర్డు విముఖంగా ఉండటంతో చాంపియన్స్ ట్రోఫీ వేదికపై నీలినీడలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగానే, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరో సమస్యను ఎదుర్కొంటుంది. చాంపియన్స్ ట్రోఫీ జరిగే సమయంలో పలు దేశాల క్రికెట్ బోర్డులు టీ20 లీగ్‌లు నిర్వహిస్తున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ సమయంలో టీ20 లీగ్‌లు జరగాల్సి ఉంది. దీంతో పలు దేశాలు షెడ్యూల్‌పైనా అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం కనిపిస్తోంది.

2025 చాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో జరగాల్సి ఉంది. తుది షెడ్యూల్ ఖరారు చేయలేదు. ఎస్ఏ20, ఐఎల్‌టీ20, బిపిఎల్‌లు ఇదే సమయంలో జరుగుతున్నాయి. ఈ ఏడాది ఎస్ఏ20 జనవరి 10న మొదలై, ఫిబ్రవరి 10న ముగుస్తుంది. ఐఎల్‌టీ20 జనవరి 19న ఆరంభం కాగా.. ఫిబ్రవరి 17న ముగియనుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ సైతం దాదాపుగా ఇదే సమయంలో జరుగుతుంది. దీంతో చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌పై అభ్యంతరాలు వ్యక్తం కానున్నాయి. ఈ అంశాన్ని ఐసీసీ సమావేశంలో ప్రస్తావించేందుకు ఆయా దేశాల క్రికెట్ బోర్డులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్వహించే పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్-ఎల్) సైతం ఫిబ్రవరి-మార్చిలోనే జరుగుతుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సహజంగా మార్చి ద్వితీయార్థంలో ఆరంభమవుతుంది. దీంతో చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను ముందుకు జరపడానికి కుదరదు. షెడ్యూల్‌ను కాస్త వెనక్కి జరిపితే ఎస్ఏ20, ఐఎల్‌టీ20, బిపిఎల్ పూర్తిగా ఇరకాటంలో పడతాయి. త్వరలోనే ఐసీసీ, పీసీబీ ఈ అంశంలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. చాంపియన్స్ ట్రోఫీ వేదిక అంశంలోనే ఎటూ తేల్చని పీసీబీ, ఇప్పుడు కొత్తగా షెడ్యూల్ తలనొప్పితో ఏం చేస్తుందో చూడాలి.

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ ఆరంభం

ముఖ్య అతిథిగా హాజరైన ఏసీబీ డైరెక్టర్ సివి ఆనంద్



హైదరాబాద్ : 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారం జూబ్లిహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా మొదలైంది. బుద్ధవతారం రాజు, లింగమనేని లక్ష్మి స్మారకార్థం హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్‌ఓటీఏ) నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) డైరెక్టర్ సివి ఆనంద్ పోటీలను ఆరంభించారు. 'దేశం నలుమూలల నుంచి వెటరన్ క్రీడాకారులు రావటం సంతోషంగా ఉంది. క్రీడోత్సాహానికి వయసుతో సంబంధం లేదని టెన్నిస్ క్రీడాకారులు మరోసారి నిరూపిస్తున్నారు. ఇంతమంచి టోర్నమెంట్ నిర్వహిస్తున్న హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్‌కు అభినందనలు' అని సివి ఆనంద్ అన్నారు. మహిళల సింగిల్స్‌లో ఓపెన్ పోటీ ఉండగా, పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో 30, 40, 50, 60, 70 ఏండ్ల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. టోర్నీలో పోటీపడుతున్న 408 మంది క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి తెలిపారు. జూబ్లిహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్ రావు, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం ఆఫీస్ బేరర్లు సదాశివ రెడ్డి, అనిరుధ్, రామకష్ణ, సందీప్, సుబ్రమణ్యం, రాంబాబు సహా యుఎస్ ఎంబసీ ప్రతినిధి ఫ్రాంక్ తదితరులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టైటిల్ నిలుపుకుంటారా?

- జెయింట్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు



కేప్‌టౌన్ : సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఐపీఎల్‌లో నిరాశపరుస్తున్నా.. ఎస్ఏ20 లీగ్‌లో మాత్రం దుమ్మురేపుతోంది. వరుసగా రెండో సీజన్‌లో ఈస్టర్న్ కేప్ సన్‌రైజర్స్ జట్టు ఫైనల్లోకి చేరుకుంది. తొలి సీజన్ విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ తాజా సీజన్‌లో టైటిల్ నిలుపుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంది. నేడు జరిగే ఫైనల్లో డర్బన్ సూపర్‌జెయింట్స్‌తో తలపడనుంది. తొలి క్వాలిఫయర్‌లో సూపర్‌జెయింట్స్‌ను చిత్తు చేసిన సన్‌రైజర్స్ అంతిమ పోరులో అదే ప్రదర్శన పునరావృతం చేయాలని చూస్తుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 9 గంటలకు ఎస్ఏ20 ఫైనల్ ఆరంభం కానుంది.

తన్మయ్, తిలక్ శతకాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 383/5

హైదరాబాద్ : తన్మయ్ అగర్వాల్ (164, 192 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సులు), తిలక్ వర్మ (101, 135 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు) సెంచరీలతో చెలరేగారు. రోహిత్ రాయుడు (59) సైతం రాణించటంతో నాగాలాండ్‌తో రంజీ ట్రోఫీ ప్లేట్ సెమీఫైనల్లో హైదరాబాద్ భారీ స్కోరు దిశగా సాగుతుంది. తొలి రోజు 90 ఓవర్లలో 5 వికెట్లకు 383 పరుగులు చేసింది. నితీశ్ రెడ్డి (21), ప్రజ్ఞయ్ రెడ్డి (12) అజేయంగా ఆడుతున్నారు. నాగాలాండ్ బౌలర్లలో జొనాథన్ (2/88) రాణించాడు.

ఆర్టీసీకి మహాలక్ష్మి

ఉచితంతో గణనీయంగా పెరిగిన ప్రయాణీకులు

- జీరో టిక్కెట్‌తో ఆర్టీసీ ఆదాయంలోనూ పెరుగుదల
- ఖమ్మం రీజియన్‌కు గతం కంటే రెట్టింపు ఆదాయం
- మిగతా చోట్లా అదే ఆదరణ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉచిత బస్సు ప్రయాణం మహిళలతోపాటు టీఎస్ ఆర్టీసీకి సైతం వరంలా మారింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభానికి ముందు తరువాత చూస్తే ఆర్టీసీకి రెట్టింపు స్థాయిలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అధికారంలోకి వచ్చిన తరువాత మహాలక్ష్మి పథకంలో ఒక్కటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి కూడా ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం మహిళలకు సున్నా టిక్కెట్ ఇస్తోంది. దీని ప్రకారం ఎంతమంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారో దానికి అనుగుణంగా ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీకి ఆ మొత్తాన్ని చెల్లించేలా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి విశేష స్పందన లభిస్తోందని పలువురు తెలిపారు. తొలుత ఈ పథకంపై విమర్శలు వచ్చినా.. పురుష ప్రయాణికులు కొంతమేర ఇబ్బంది పడినా.. ముఖ్యంగా ఆటో డ్రైవర్ల రోజువారీ ఆదాయానికి గండిపడినా.. సోషల్ మీడియాలో రకరకాల విమర్శనాత్మక వీడియోలు వెలువడినా.. ప్రభుత్వం మాత్రం ఈ పథకం విషయంలో వెనక్కి తగ్గలేదు. ఆటో కార్మికులు, యూనియన్‌లు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారికి సైతం రూ.12వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. ఈ పథకంతో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరిగిన దృష్ట్యా సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలనే డిమాండ్లు సైతం ముందుకొచ్చాయి. అంతేకాక బస్సుల వైపు నుంచి కూడా అవరోధాలు ఏర్పడ్డాయి. వీటన్నింటినీ అధిగమిస్తూ మహిళల ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. అయితే, ఈ స్కీం ఉద్దేశాన్ని తెలుసుకొని స్వతహాగా చాలామంది ఆర్థికంగా ఉన్న మహిళలు ఉచిత ప్రయాణానికి దూరంగా ఉంటున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నారు. గుర్తింపు కార్డు చూపించి జీరో టికెట్ తీసుకుని ప్రయాణించేలా నిబంధనల్లో మార్పు తెచ్చారు. ఎవరైనా జీరో టికెట్ తీసుకోకుండా బస్సులో ప్రయాణిస్తే రూ. 500 వరకు జరిమానా విధించేలా రూల్స్‌లో మార్పు తెచ్చారు. మహిళా సాధికారత పెంపుదలకు ఈ పథకం ఎంతగానో ఉపకరిస్తుందని మహిళా సంఘాలు అంటున్నాయి. నిరుపేదలు, మధ్యతరగతి మహిళలు అత్యధికంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.



ఉచితంతో పెరిగిన ప్రయాణం..

రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో దాదాపు అన్ని రీజియన్లలోనూ ఆదాయం భారీగా పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. స్కీమ్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఫిబ్రవరి ఆరు వరకు దాదాపు 15 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు మొత్తం ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. సుమారు వెయ్యి బస్సుల వరకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఉచిత ప్రయాణానికి ముందు అక్టోబర్, నవంబర్ నెలల్లో సగటున ఒక్కో నెల 35 లక్షల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగించారు. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చాక డిసెంబర్ 9 నుంచి జనవరి 26వ తేదీ వరకు దాదాపు 48 రోజుల్లో మొత్తం రీజియన్ పరిధిలో 88 లక్షల మందికి పైగా ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం గమనార్హం. గతంలో 61 రోజుల్లో 71.62 లక్షల మంది ప్రయాణిస్తే.. ఉచిత పథకంతో కేవలం 48 రోజుల్లోనే 88.21 లక్షల మంది ప్రయాణించారు. గడిచిన 48 రోజుల్లో 46.24 లక్షల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తే.. 41.97 లక్షల మంది పురుషులు రాకపోకలు సాగించారు. పురుషుల కంటే మహిళలు దాదాపు 5 లక్షల వరకు ప్రయాణం సాగించారు.

ఆక్యుపెన్సీతో పాటు ఆదాయం..

ఉచితంతో మహిళా ఆక్యుపెన్సీ రేషియో పెరగడంతో ఆర్టీసీకి ప్రభుత్వం వైపు నుంచి ఆదాయం కూడా భారీగా పెరిగింది. కొందరు మహిళలు దాదాపు రెండు నెలలుగా రాష్ట్రంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ స్థలాలకు వెళ్తున్నారు. లగ్జరీ, సూపర్ లగ్జరీ, రాజధాని వంటి బస్సుల్లో ప్రయాణించే వారు సైతం ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణిస్తుండటంతో ఈ బస్సులకు వచ్చే ఆదాయం భారీగా పెరుగుతోందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల్లో కేవలం మధిర భద్రాచలం తప్ప మిగిలిన ఐదు డిపోల పరిధిలోనూ పురుషుల కన్నా మహిళలే అధికంగా ప్రయాణించారు. గతంలో 61 రోజుల్లో మొత్తం ప్రయాణికుల నుంచి రూ.60 కోట్ల ఆదాయం వస్తే.. ఇప్పుడు 48 రోజుల్లో కేవలం పురుష ప్రయాణికుల నుంచి రూ.62 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. ప్రభుత్వం వైపు నుంచి ఉచిత ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం అదనం.

తీర్థ యాత్రలు చేస్తున్నా..



మేము గతంలో ఎప్పుడూ తిరగని పుణ్యక్షేత్రాలను ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇప్పుడు దర్శించుకోగలుగుతున్నాం. ఇంతకుముందు ఎటైనా వెళ్లాలంటే నేను, ముగ్గురు పిల్లలు, నా భర్తకు.. మొత్తం ఐదుగురికి చార్జీలు భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ముగ్గురం ఉచితంగా ప్రయాణిస్తున్నాం. ఎక్కడికి వెళ్లాలన్నా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నాం. బస్సుల్లో ప్రయాణం వల్ల మహిళలకు సేఫ్టీ కూడా ఉంటుంది. మాతోపాటు మా బాబు, భర్త కూడా బస్సులోనే ప్రయాణం చేస్తున్నారు. ఎప్పటికీ ఈ పథకాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహిళలందరి తరఫున కోరుతున్నాను.

- కళ్యాణి, భువనగిరి

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886